

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 192

సోమవారం 2-10-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



916 బంగారు ఆభరణాల V.A ఛార్జీలపై FLAT 50% భారీ తగ్గింపు

DIAMOND JEWELLERY
EF-VVs DIAMOND CARAT PRICE 56,000 ONLY

సిల్వర్ ఆర్టికల్స్‌పై తరుగు మజూరీ లేదు

92.5 సిల్వర్ జ్యుయలరీపై 70% ఎక్స్ఛేంజ్ వేల్యూ

శారీస్

- మస్కా రెనియల్ శారీ ₹129 మాత్రమే
- లెమన్ షిఫాన్ శారీ ₹139 మాత్రమే
- సూపర్ మార్బుల్ శారీ or ఫిజా ₹149 మాత్రమే
- ఇండియన్ బ్యూటీ or అరుణ కోట ₹175 మాత్రమే
- గరిమా జార్జెట్ or కేరళ పట్టు ₹199 మాత్రమే
- ఆర్కో బార్డర్ శారీ or రాధిక సిల్క్ ₹222 మాత్రమే
- సేలమ్ పట్టు or డిజిటల్ రాణి ₹249 మాత్రమే
- చెన్నయ్ బ్రాసో or మావ్ పట్టు శారీ ₹275 మాత్రమే
- మంగళసూత్ర or 3D బ్రాసో ₹299 మాత్రమే
- మిర్రర్ వర్క్ శారీ or మిస్ ఇండియా ₹333 మాత్రమే
- టిక్కి డిజిటల్ or జుగ్ను సిల్క్ ₹349 మాత్రమే
- సరిత గోల్డ్ or పటోలా క్రష్ ₹375 మాత్రమే
- లినెన్ కాటన్ or శృతి కాటలాగ్ శారీ ₹399 మాత్రమే
- దీపజ్యోతి కాటలాగ్ శారీ or కోరా సిల్క్ ₹425 మాత్రమే
- లినెన్ ఎంబ్రాయిడరీ శారీ or డాలర్ సిల్క్ ₹444 మాత్రమే
- మహాలక్ష్మి కాటలాగ్ శారీ or మధుమిత స్టోన్ వర్క్ ₹475 మాత్రమే
- కోమల్ సిల్క్ or డిజైనర్ పట్టు ₹499 మాత్రమే
- దుపియాన్ బుట్టా or బనారస్ బ్రోకేడ్ ₹599 మాత్రమే
- నూరి డిజిటల్ or సాఫ్ట్ సిల్క్ ₹649 మాత్రమే
- శిల్పా జక్కార్డ్ బార్డర్ or KGF సిల్క్ ₹699 మాత్రమే
- మనోహరి సిల్క్ or కాళింది సిల్క్ ₹749 మాత్రమే
- మల్బరి సిల్క్ బుట్టా or కోరా కాటన్ ప్రింటెడ్ ₹799 మాత్రమే
- పటోలా సిల్క్ or ఆర్ట్ కాపర్ బుట్టా ₹899 మాత్రమే
- ఇక్కత్ సిల్క్ or జరీ చెక్స్ ₹999 మాత్రమే
- కుప్పాడం సిల్క్ ₹1299 మాత్రమే
- డిజైనర్ టిష్యూ ₹1699 మాత్రమే
- రేషమ్ బ్రోకేడ్ ~~4000~~ ₹1998 మాత్రమే
- ధర్మవరం టిష్యూ ~~4998~~ ₹2496 మాత్రమే

ఉమెన్స్

- 1 QTY కుర్తీ ₹99 మాత్రమే
- 1 QTY లెగ్గింగ్ ₹99 మాత్రమే
- 1 QTY పలాజో బాటమ్ ₹99 మాత్రమే
- 1 QTY ఫ్యాన్సీ చున్నీ ₹99 మాత్రమే
- 2 QTY నైటీస్ ₹300 మాత్రమే
- 2 QTY 2 పీస్ పలాజో సెట్ ₹400 మాత్రమే
- 2 QTY డ్రెస్ మెటీరియల్స్ ₹555 మాత్రమే
- 2 QTY 3 పీస్ పలాజో సూట్ దుపట్టాతో ₹555 మాత్రమే
- 2 QTY సల్వార్ సూట్స్ ₹666 మాత్రమే
- 2 QTY పటియాలా సూట్స్ ₹777 మాత్రమే
- 1 QTY పటోలా లెహెంగా ₹749 మాత్రమే
- 1 QTY గరారా సూట్స్ ~~1666~~ ₹666 మాత్రమే
- 1 QTY నారాయణపేట్ సూట్ ~~1888~~ ₹888 మాత్రమే

*Terms and Conditions apply. Offer valid till stock lasts. Merchandise also available without this offer. Clubbing or splitting of two or more bills is not permissible. Please look for detailed Terms & Conditions at ... Please ask store staff for further details.

మెన్స్

- 6 QTY బ్రాండెడ్ క్యాజువల్ షర్ట్స్ ₹999
- 6 QTY షార్ట్స్ ₹999
- 5 QTY బ్రాండెడ్ ట్రాక్ ప్యాంట్స్ ₹999
- 5 QTY బ్రాండెడ్ 3/4 షార్ట్స్ ₹999
- 4 QTY బ్రాండెడ్ టీ-షర్ట్స్ ₹999
- 3 QTY బ్రాండెడ్ కాటన్ ట్రౌజర్స్ ₹999
- 3 QTY బ్రాండెడ్ ఫార్మల్ ట్రౌజర్స్ ₹999
- 2 QTY ఫ్యాషన్ జీన్స్ ₹999
- 2 QTY పార్టీవేర్ షర్ట్స్ ₹1799
- 1 QTY బ్లేజర్ ₹777

గర్ల్స్

- 2 QTY గర్ల్స్ లెగ్గింగ్స్ ₹333 మాత్రమే
- 5 QTY గర్ల్స్ టీ-షర్ట్స్ ₹444 మాత్రమే
- 3 QTY గర్ల్స్ టాప్స్ ₹555 మాత్రమే
- 2 QTY గర్ల్స్ నైటీసూట్స్ ₹555 మాత్రమే
- 2 QTY గర్ల్స్ పలాజో బాటమ్ ₹444 మాత్రమే
- 2 QTY కాటన్ ఫ్రాక్స్ ₹444 మాత్రమే
- 2 QTY జెగ్గింగ్స్ ₹444 మాత్రమే
- 2 QTY లాంగ్ స్కర్ట్స్ ₹777 మాత్రమే

బాయ్స్

- 2 QTY బాయ్స్ 3/4 ప్యాంట్స్ ₹333 మాత్రమే
- 2 QTY బాయ్స్ షార్ట్స్ ₹333 మాత్రమే
- 2 QTY బాబా సూట్స్ ₹444 మాత్రమే
- 2 QTY బాయ్స్ నైట్ సూట్స్ ₹555 మాత్రమే
- 4 QTY బాయ్స్ టీ-షర్ట్స్ ₹555 మాత్రమే
- 2 QTY బాయ్స్ షర్ట్స్ ₹555 మాత్రమే
- 2 QTY బాయ్స్ ట్రాక్ ప్యాంట్స్ ₹444 మాత్రమే
- 2 QTY బాయ్స్ జీన్స్ ₹666 మాత్రమే

ప్రారంభోత్సవ ధూం ధడాకా ఆఫర్లను మిస్ అవ్వకండి!

కస్తూరి సిల్క్ శారీ ₹99 మాత్రమే

PURE SILK SAREE COLLECTIONS
Samudrika Pattu | Vastrakala pattu | Saatvika Pattu | Parinaya Pattu | Sampradaya Pattu



ది చెన్నయ్ షాపింగ్ మాల్ ®

కోర్టు రోడ్, కరీంనగర్

శారీస్ — పట్టు చీరలు - డిజైనర్ చీరలు - ఫ్యాన్సీ చీరలు - కాటన్ చీరలు - హ్యాండ్లూం శారీస్

ఉమెన్స్‌వేర్ — సల్వార్ సూట్స్ - గాగ్రూస్ - పట్టు పావడా సెట్స్ - చుడీదార్స్ - ఫ్రాక్స్ - వెస్టర్న్ వేర్

మెన్స్‌వేర్ — జీన్స్ & టీ-షర్ట్స్ - బెర్ముడాస్ - ధోతి సెట్స్ - ఎత్నిక్ వేర్ - ఫార్మల్ వేర్ - బ్లేజర్స్ - సూటింగ్ - షర్టింగ్ ఫ్యాబ్రిక్స్

కిడ్స్‌వేర్ — గర్ల్స్: ఫ్రాక్స్ - గాగ్రూస్ - చుడీదార్స్ - పటియాలా సూట్స్ - ఘరారా - వెస్టర్న్‌వేర్ - బాయ్స్: బాబాసూట్స్ - టీషర్ట్స్ - షర్ట్స్ - షార్ట్స్


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 192

సోమవారం 2-10-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జీఎస్‌టీ వసూళ్లు రూ. 1.62 లక్షల కోట్లు -13లో



పెట్టుబడికి 'సోషల్'రూట్..?
అనుభవజ్ఞులైన ట్రేడర్లు, ఇన్వెస్టర్ల సమూహాలు -13లో



గాల్లోనే ఊపిరి పోశారు

విమానంలో ఆర్నెల్ల హృద్రోగ చిన్నారికి శ్వాస సమస్య తలెత్తడంతో ఆక్సిజన్ కిట్ ద్వారా శ్వాస అందించారు.

వివరాలు 6లో ▸



అమెరికా-భారత్‌కు హద్దుల్లేవ్

అమెరికా, భారత్ మధ్య సంబంధాలు అత్యున్నత స్థాయికి చేరుకున్నాయని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు.

వివరాలు 6లో ▸



అఫ్గాన్ ఎంబసీ మూసివేత

భారత్‌లో రాయబార కార్యాలయాన్ని అఫ్గానిస్తాన్ మూసివేసింది. ఆదివారం నుంచి కార్యకలాపాలన్నీ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

వివరాలు 6లో ▸



తప్పిన షట్‌డౌన్ ముప్పు

అమెరికాకు షట్‌డౌన్ ముప్పు తాత్కాలికంగా తప్పింది. వార్షిక ద్రవ్య వినిమయ బిల్లును రిపబ్లికన్లు ప్రతినిధుల సభలో ఆమోదించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి సిద్దిపేటలో రైలుకూత



సిద్దిపేట–సికింద్రాబాద్ మార్గంలో రెండు ప్యాసింజర్ రైళ్లు మంగళవారం నుంచి రాకపోకలు సాగించనున్నాయి. సిద్దిపేటతో పాటు గజ్వేల్, నాచగిరి (నాచారం), కొమురవెల్లి మీదుగా ఈ రైళ్లు తిరుగుతాయి.

- వివరాలు 14లో▶

బీఆర్‌ఎస్‌కు ఎమ్మెల్సీ కసిరెడ్డి రాజీనామా



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ కూడా బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు.

- వివరాలు 5లో▶

రాజ్యాధికారమే బీసీల లక్ష్యం కావాలి



అర శాతం, ఐదు శాతం ఉన్నవాళ్లు బహుజనులపై పెత్తనం చెలాయిస్తున్నారని, బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు, గౌడన్నలు చైతన్యవంతం కావాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు.

- వివరాలు 5లో▶

'అంతరిక్ష విత్తనాలు' ఆదుకుంటాయా?

- వివరాలు 14లో▶

ఇదండీ సంగతి



'చేతి'తో పిడకలు చేసుకుంటారేమో సార్!

పార్టీలు కాదు.. ప్రైవేటు కంపెనీలు

బీఆర్‌ఎస్, ఎంఐఎంలపై పరోక్షంగా ప్రధాని మోదీ ఫైర్



- కుటుంబం కోసమే పార్టీ అన్నట్టుగా వాటి తీరు
- రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టులు కేవలం అవినీతి కోసమే..
- తప్పుడు హామీలతో రైతులను మోసం చేస్తున్నారు
- ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.. వాటి నుంచి నీళ్లు మాత్రం రావు
- గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తామంటే ఐదేళ్లుగా భూమి ఇవ్వలేదు
- మహిళా రిజర్వేషన్ల బిల్లుతో స్త్రీ శక్తిని బలోపేతం చేస్తున్నాం
- తెలంగాణ అక్కాచెల్లెళ్లూ.. ఢిల్లీలో మీకు ఓ అన్న ఉన్నాడని మరిచిపోకండి
- ఇక్కడి ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.. అది బీజేపీతోనే సాధ్యం.. రాష్ట్రంలో అవినీతి రహిత ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని వ్యాఖ్య
- పాలమూరు ప్రజాగర్జన సభలో ప్రసంగించిన ప్రధాని

2లో

కుటుంబ సభ్యులు ఓనర్లు.. బయటివారు అటెండర్లు!

తెలంగాణలోని రెండు కుటుంబ పాలిత పార్టీలది ఒకటే ఫార్ములా.. అవినీతి, కమీషన్లు.. అంతా కుటుంబం కోసం, కుటుంబం ద్వారా, కుటుంబానికి చెందిన (పార్టీ బై ద ఫ్యామిలీ, ఫర్ ద ఫ్యామిలీ, టు ద ఫ్యామిలీ) అన్నట్టుగా ఆ పార్టీల తీరు ఉంది. అవి పార్టీలు కాదు.. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలుగా నడిపిస్తున్నారు. వాటిలో ప్రెసిడెంట్లు, సీఈవోలు, డైరెక్టర్, జనరల్ మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, అంతా కుటుంబ సభ్యులే. సహాయకులుగా ఉండే అటెండర్లు, సపోర్ట్ స్టాఫ్‌గానే బయటి వ్యక్తులు ఉంటారు. వచ్చే ఎన్నికల్లో ఈ పార్టీలకు చరమగీతం పాడి.. బీజేపీని గెలిపించాల్సిన అవసరం ఉంది.

ఢిల్లీలో ఓ అన్న ఉన్నాడు..

తెలంగాణ రాణీ రుద్రమ వంటి వీరవనితలు పుట్టిన భూమి. ఇటీవల ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో చట్టసభల్లో మహిళల గొంతు మరింతగా వినిపించబోతోంది. మహిళలు మోదీ చేతులను బలోపేతం చేస్తే.. మోదీ మహిళా శక్తిని బలోపేతం చేస్తున్నాడు.. తెలంగాణలోని అక్కాచెల్లెళ్లకు ఢిల్లీలో ఒక అన్న (మోదీ) ఉన్న విషయాన్ని మర్చిపోవద్దు. మహిళల కోసం ఆత్మగౌరవ గృహాలు, ముద్రా యోజన, పీఎం ఆవాస్ యోజన, ఉచిత గ్యాస్ కనెక్షన్లు వంటివి తెచ్చి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చాం.

మోదీ వరాల జల్లు...

పసుపు బోర్డు.. గిరిజన వర్సిటీ

- రాష్ట్రానికి జాతీయ పసుపుబోర్డు మంజూరు చేస్తున్నాం
- ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ..
- రూ.900 కోట్లతో సమ్మక్క–సారలమ్మ పేరిట ఏర్పాటు
- తెలంగాణలో కొత్త రోడ్లు, రైల్వే ప్రాజెక్టులతో కనెక్టివిటీ పెరుగుతుందన్న మోదీ
- పాలమూరు పర్యటనలో రూ.13,545 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

పాలమూరు పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. రాష్ట్రానికి పలు వరాలు ప్రకటించారు. రాష్ట్ర రైతులు ఎంతో కాలం నుంచి డిమాండ్ చేస్తున్న జాతీయ పసుపు బోర్డును, ఉమ్మడి ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో ఆదివారం నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో.. రూ.13,545 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు. మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తెలంగాణలో పసుపు పంట విస్తృతంగా పండుతుంది. దేశంలో ఎక్కువగా ఉత్పత్తి చేయడంతోపాటు వినియోగించేది, ఎగుమతి చేసేది ఈ పంటే. కరోనా తర్వాత పసుపు గొప్పదనం ప్రపంచానికి తెలిసింది. దీనిపై పరిశోధనలు పెరిగాయి. పాలమూరు సభ సాక్షిగా

మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్ ఇక.. ఫామ్‌హౌస్‌కే పరిమితం!

పాలమూరు ప్రజాగర్జన సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్



- వివరాలు 3లో▶



జ్యోతి యర్రాజీ-రజతం



తజీందర్ - గోల్డ్



అవినాశ్ సాబ్లే - గోల్డ్



కైనన్ చెనాయ్-స్వర్ణం, కాంస్యం

ఒకే రోజు 15 పతకాలు

ఆసియా క్రీడల్లో మెరిసిన భారత క్రీడాకారులు

చైనా గడ్డపై తెలుగు వెలుగులు

చైనా గడ్డపై ఆదివారం భారత క్రీడాకారులు పతకాల మోత మోగించారు. ఒకే రోజు ఏకంగా 15 పతకాలతో మెరిశారు. అథ్లెటిక్స్‌లో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు, మూడు కాంస్యాలతో కలిపి తొమ్మిది పతకాలు రాగా... షూటింగ్‌లో ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి మూడు పతకాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్ సభ్యులుగా ఉన్న భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు రజత పతకం గెల్చుకోగా... మహిళల గోల్ఫ్‌లో అదితి అశోక్ కూడా రజతం సాధించింది. భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. అథ్లెటిక్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకం దక్కించుకుంది.ఏడు క్రీడాంశాల సమాహారమైన మహిళల హెప్టాథ్లాన్ తెలంగాణ అమ్మాయి అగసార నందిని 5712 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. హైదరాబాద్ షూటర్ కైనన్ చెనాయ్ పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం, వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. అవినాశ్ సాబ్లే 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో, షాట్‌పుట్ ఈవెంట్‌లో తజీందర్‌పాల్ సింగ్ స్వర్ణ పతకాలు గెలుచుకోగా... ఎనిమిదో రోజు తర్వాత భారత్ 13 స్వర్ణాలు, 21 రజతాలు, 19 కాంస్యాలతో కలిపి మొత్తం 53 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

- 12లో



నందిని-కాంస్యం

ఎవరు కావాలో ప్రజలే తేల్చుకోవాలి

- వైట్ కాలర్ నేరస్తులను ప్రోత్సహించేది వాళ్లు
- వైట్ కోట్ డాక్టర్లను తయారు చేసేది మనం
- కేంద్రం రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు.. సీఎం కేసీఆర్ 33 జిల్లాలకు 35 మెడికల్ కాలేజీలు తెచ్చారు
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, రంగారెడ్డిజిల్లా/కందుకూరు: 'ప్రధాని నరేంద్ర మోదీ... నీరవ్‌మోదీ, విజయ్ మాల్యా వంటి వైట్ కాలర్ నేరస్తులను దేశాన్ని దాటించేందుకు సహకరించారు. రాష్ట్రానికి ఒక మెడికల్ కాలేజీ ఇవ్వలేదు.. కేంద్రం సహకరించక పోయినా.. రూపాయి ఇవ్వక పోయినా.. సీఎం కేసీఆర్ 33 జిల్లాలకు 35 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారు. వైట్‌కోట్ రెవల్యూషన్ సృష్టించారు. వైట్ కాలర్ నేరస్తులను దేశ సరిహద్దులు దాటించిన వాళ్లు కావాలా? వైట్ కోట్ రివల్యూషన్ సృష్టిస్తున్న కేసీఆర్ కావాలా? ప్రజలే తేల్చుకోవాలి'అని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో రూ.176 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన మెడికల్ కాలేజీ

మిగతా 3వ పేజీలో ▶

గుజరాత్‌కో నీతి.. తెలంగాణకో నీతా?

- ప్రభుత్వరంగ సంస్థలను దివాలా తీయించి దోస్తులకు అప్పజెప్పడమే మోదీ పని
- కేసీఆర్ అంటే నమ్మకం.. మోదీ అంటే అమ్మకం.. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే
- బీఆర్‌ఎస్ ఎంపీలనూ గెలిపించుకుంటేనే ఢిల్లీ జుట్టు మన చేతిలో...
- రామగుండం, పెద్దపల్లి, రామకృష్ణాపూర్ సభల్లో కేటీఆర్



సాక్షి,పెద్దపల్లి/గోదావరిఖని/సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'నీ ఉద్దేశం మంచిదే అయితే.. నీకు నియ్యత్ ఉంటే గుజరాత్‌కో నీతి.. తెలంగాణకో నీతి ఉంటదా? నువ్వు గుజరాత్ ప్రధానివా? దేశానికి ప్రధానివా?'అని మోదీని ఉద్దేశించి రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రశ్నించారు. అలాగే 6 గ్యారంటీలు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీపైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మంచిర్యాల జిల్లాలోనూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామగుండం, పెద్దపల్లి, రామకృష్ణాపూర్‌లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో కేటీఆర్ ప్రసంగించారు.

సింగరేణికి గనులు ఇవ్వలేదేం?

రామగుండం, పెద్దపల్లి సభల్లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ 'ఏం ముఖం పెట్టుకొని ప్రధాని రాష్ట్రానికి వస్తున్నడు? ఇటీవల రామగుండం వచ్చిన మోదీ సింగరేణిని ప్రైవేటీకరించబోమని తియ్యని మాటలు చెప్పారు. కానీ ఆ తర్వాత నెల రోజులకే సింగరేణి బొగ్గు బ్లాకులను వేలానికి పెట్టారు'అని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా

మిగతా 3వ పేజీలో ▶

అంగన్‌వాడీలకూ పీఆర్సీ ఫలాలు

- మిగతా డిమాండ్లనూ పరిశీలించి పరిష్కరిస్తాం: హరీశ్‌రావు
- అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ నేతలతో భేటీ

సమ్మె యథాతథం


- మంత్రి హరీశ్‌తో చర్చలు జరిగాయే కానీ స్పష్టత రాలేదు
- ఈనెల 4న తలపెట్టిన చలో హైదరాబాద్ నిర్వహిస్తాం
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ స్పష్టీకరణ

14లో

బడి బ్యాగు బరువు తగ్గించాలి!

రాష్ట్రాలకు కేంద్రం సూచన

- ఈ అంశంపై ఇప్పటికే జాతీయ స్థాయిలో అధ్యయనం
- పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని గుర్తింపు
- చిన్నారులపై పుస్తకాలు, ఇతర భారం తగ్గించడంపై రాష్ట్ర విద్యాశాఖ దృష్టి
- ఓ కమిటీ వేసి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయం
- ముఖ్యంగా ప్రైవేటు స్కూళ్లను కట్టడి చేసే యోచన
- త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: పాఠశాలల్లో చదివే విద్యార్థులపై పుస్తకాల బరువు తగ్గించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఇది అమలయ్యేలా చూడాలని పేర్కొంది. పుస్తకాల బరువు, దాని వల్ల ఎదురయ్యే పరిణామాలపై కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో చేసిన అధ్యయనం వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం.. 70శాతం మంది స్కూల్ విద్యార్థులపై పుస్తకాల భారం అధికంగా ఉంటోంది. దీనితో పిల్లల కండరాలు, మోకాళ్లపై ఒత్తిడి పడుతోంది. 22 శాతం మంది విద్యార్థులు వెన్నునొప్పితో బాధపడుతున్నారు. ఇంటికి రాగానే నీరసంగా, భుజాలు వంగిపోయి నొప్పితో ఇబ్బందిపడుతున్నారు. దీర్ఘకాలం పాటు ఈ ప్రభావం ఉంటోందని.. ఈ ఆరోగ్య సమస్యలు విద్యార్థి చదువుపై శ్రద్ధ కోల్పోయేందుకు కారణం అవుతున్నాయని అధ్యయనం నివేదిక స్పష్టం చేసింది. మితిమీరిన పుస్తకాలు, చదువుతో విద్యార్థులు సరిగా నిద్రపోవడం లేదని.. దీనితో తరగతి గదిలో చురుకుగా ఉండటం లేదని పేర్కొంది. ముఖ్యంగా ప్రైవేటు స్కూళ్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోందని వివరించింది. ప్రైవేటు స్కూళ్లు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటం, శక్తికి మించిన

మిగతా 5వ పేజీలో ▶





పాలమూరు సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, డీకే అరుణ, బండి సంజయ్, జితేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి. సభకు హాజరైన ప్రజలు

క్లుప్తంగా...

గిరిజనులపై ప్రధానిది కపట ప్రేమ

మంత్రి సత్యవతి రాథోడ్



సాక్షి, హైదరాబాద్: గిరిజనులపై ప్రధాని మోదీ కపటప్రేమ ప్రదర్శిస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా గిరిజన వర్సిటీని తొక్కిపెట్టింది మోదీ ప్రభుత్వమే అని, దీంతో ఎంతో మంది ఉన్నత చదువుల కోసం దూరప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎన్నికలు ముంచుకొస్తున్నందునే మోదీకి గిరిజన వర్సిటీ గుర్తొచ్చిందన్నారు. ఈ వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లా జాకారంలో 335 ఎకరాలను ఇప్పటికే కేటాయించిందని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా కేంద్రం స్పందించలేదన్నారు.

మోదీ హామీలన్నీ మోసపూరితమే..

మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శ



సాక్షి, హైదరాబాద్: మోసపూరిత హామీల్లో ప్రధాని నరేంద్ర మోదీది అందెవేసిన చేయి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు మంత్రి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలమూరుకు వచ్చి పసుపుబోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం ప్రకటించడం బీజేపీ అవగాహనారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని హామీల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ఊసేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించకపోవడం పాలమూరు ప్రజలను వంచించడమేనన్నారు. కృష్ణా జలాలలో తెలంగాణవాటా గురించి ప్రధా ని ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రూ.13,500 కోట్ల టోల్ రహదారులు ఏ ప్రజల ప్రయోజనాల కోసమో చెప్పాలని నిల దీశారు. 2019 ఎన్నికల పసుపు బోర్డు హామీ ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు.

వైఫల్యాలను కప్పిపుచ్చేలా మోదీ మాటలు

దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ మాయ మాటలు చెప్పి, మసిపూసి మారేడు కాయలు చేస్తూ తమ అసమర్థత, వైఫల్యాలను కప్పిపెట్టుకునే ప్రయత్నం చేశారంటూ బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీచేశారు. 'రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను ఎందుకు అమలు పరచడం లేదో ఆయన సమాధానం చెప్పరు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఎందుకు కల్పించరో చెప్పరు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఎందుకు కట్టరో చెప్పరు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎందుకు కట్టరో చెప్పరు. ఇలాంటి కీలక అంశాలపై ఏ సమాధానం చెప్పకుండా కేసీఆర్ ప్రభుత్వంపై బట్ట కాల్చి మీద వేస్తున్నారు' అని శ్రవణ్ మండిపడ్డారు. వాస్తవానికి మోదీ ప్రభుత్వ స్టీరింగ్ అదానీ, అంబానీ చేతిలో ఉందన్నారు.

నేటి భవితలో..

- టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్స్: గ్రూప్–2.. గురితప్పకుండా! టీఎస్‌పీఎస్సీ గ్రూప్–2 సర్వీసెస్ ఎగ్జామ్! అయిదు లక్షల మందికి పైగా పోటీ పడే పరీక్ష!! లక్షల మంది తమ కలల కొలువు దక్కించుకునేందుకు ఎంతో కాలంగా అకుంఠిత దీక్షతో ప్రిపరేషన్ సాగిస్తున్నారు. ఎన్ని నెలలు కృషి చేసినా.. ఎన్ని పుస్తకాలు చదివినా.. పరీక్షకు నెలరోజుల ముందు నుంచి సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే సక్సెస్‌లో కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో.. నవంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలో విజయానికి మెలకువలు..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా..అంతర్జాతీయం,జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, స్పోర్ట్స్ తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పార్టీలు కాదు.. ప్రైవేటు కంపెనీలు!

మహబూబ్‌నగర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి:

బీఆర్‌ఎస్, ఎంఐఎంలపై పరోక్షంగా ప్రధాని మోదీ ఫైర్
- కుటుంబం కోసమే పార్టీ అన్నట్టుగా వాటి తీరు
- రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టులు కేవలం అవినీతి కోసమే..
- తప్పుడు హామీలతో రైతులను మోసం చేస్తున్నారు

తెలంగాణలో అభివృద్ధి జరగకుండా రెండు కుటుంబ పాలిత పార్టీలు అడ్డుకుంటున్నాయని.. అవి ప్రజాస్వామ్యాన్ని కుటుంబస్వామ్యంగా మార్చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. బీఆర్‌ఎస్, ఎంఐఎంలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. వాటికి ప్రజల సంక్షేమం కంటే కుటుంబ ప్రయోజనాలే ప్రధానంగా మారిపోయాయని మండిపడ్డారు. తెలంగాణ సర్కార్ కారు స్టీరింగ్ మరొకరి చేతుల్లో ఉందని.. దీనిని బట్టి ఈ ప్రభుత్వాన్ని ఎవరు నడుపుతున్నారో అర్థమవుతుందని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పరివార వాద పార్టీలకు చరమగీతం పాడాలని.. ప్రజల జీవితాలను ఎలా మెరుగుపర్చాలి, ఎలా అభివృద్ధి చేయాలని నిరంతరం ఆలోచించే బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆదివారం పాలమూరు ప్రజాగర్జన సభలో మోదీ మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం చేసిన సాయం, పథకాలను ప్రస్తావిస్తూనే.. బీఆర్‌ఎస్‌పై ఘాటుగా విమర్శలు గుప్పించారు. సభలో మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టులు కేవలం అవినీతి, అక్రమాల కోసమే. ఇటీవల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాల పేరిట ఆర్భాటాలు, హంగామా చేశారు. కానీ వాటిలోంచి రైతులకు నీళ్లు మాత్రం రాలేదు. ఇలా ప్రాజెక్టుల పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారు. రైతు పథకాలను కొందరు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. తప్పుడు హామీలతో మోసం చేస్తున్నారు. రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారు. ఎందరో రైతుల మరణానికి కారణం అయ్యారు.

పసుపు బోర్డు, గిరిజన వర్సిటీతో ఎంతో మేలు

కేంద్రం ఇప్పటిదాకా తెలంగాణలో అమలుచేసిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఇప్పుడు పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ, ఇతర ప్రాజెక్టులతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుకుంటుంది. ములుగులో రూ.900 కోట్లతో సమ్మక్క–సారలమ్మ కేంద్రీయ గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. నిజానికి మేం గిరిజన వర్సిటీని ఐదేళ్ల కిందటే నెలకొల్పాలని ప్రయత్నిస్తే.. రాష్ట్రంలోని అవినీతి ప్రభుత్వం దానికి భూమి ఇచ్చేందుకు ఐదేళ్లు పట్టింది. దీన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనుల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతోంది. మేం పసుపు రైతుల కష్టాలను గుర్తించి, వారిని ఆదుకోవడానికి పసుపు బోర్డు ఏర్పాటు చేయబోతున్నాం. ఇప్పటికే సుగంధ ద్రవ్యాల బోర్డు ఉండగా.. ప్రత్యేకంగా పసుపు కోసం నేషనల్ టర్మరిక్ బోర్డు ఏర్పాటుతో తెలంగాణ ప్రజలు, రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఎగుమతులకు వాల్యూ అడిషన్‌గా పనికొస్తుంది.

రూ.27వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేశాం

కేంద్ర ప్రభుత్వం రైతుల కష్టాన్ని గుర్తించి గిట్టుబాటు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తోంది. 2014లో కాంగ్రెస్ హయాంలో రూ.3,400 కోట్లతో ధాన్యం కొనుగోలు చేస్తే.. మేం అధికారంలోకి వచ్చాక ఒక్క ఏడాదిలోనే రూ.27 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశాం. అన్నదాతలకు గౌరవం కల్పించాం. రాష్ట్రంలో మూతపడిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని రైతుల కోసం తెరిచాం. ఇప్పుడు రూ.13,500 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. ఈ సభకు వచ్చిన వారిని ఉత్సాహాన్ని చూస్తుంటే ఇక్కడి ప్రభుత్వానికి నిద్ర పట్టదు.

తెలంగాణ అభివృద్ధికి తోడుగా..

బీజేపీ తెలంగాణ ప్రజల జీవితాలను మరింత ఉజ్వలం చేసేందుకు, అభివృద్ధి మార్గాన నడిపించేందుకు కంకణబద్ధమై ఉంది. 2014 నాటికి తెలంగాణలో రూ.2,500 కిలోమీటర్ల పొడవున మాత్రమే జాతీయ రహదారులు ఉంటే.. మేం వచ్చాక తొమ్మిదేళ్లలో వాటిని రెండింతలు చేశాం. వీటివల్ల చిన్న గ్రామాల నుంచి పెద్ద పట్టణాల దాకా రవాణా సదుపాయాలు పెరిగి.. ఉద్యోగులు, రైతులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరింది. తెలంగాణకు చెందిన బిద్రీ ఆర్ట్ (కళంకారీ)కు సంబంధించిన వస్తువును ఇటీవల దక్షిణాఫ్రికా అధ్యక్షుడికి కానుకగా ఇచ్చాను. దాంతో అది ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతుంది.

మోదీ గ్యారంటీలపై భరోసా

తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణలో మహిళలు, రైతులు, ఇతర వర్గాల ప్రజల్లో మోదీ గ్యారంటీలపై భరోసా కనిపిస్తోంది. మోదీ ఏదైనా గ్యారంటీ ఇస్తే దానిని కచ్చితంగా చేసి తీరుతారని ప్రజలు నమ్ముతున్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత, నిజాయతీతో కూడిన పారదర్శక ప్రభుత్వం కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉంది. ఈ సభకు హాజరైన ప్రజల్లో కనిపిస్తున్న ఉత్సాహం, ఉత్తేజం చూస్తుంటే.. తెలంగాణ ప్రజలు ప్రభుత్వాన్ని మార్చాలనే సంకల్పంతో ఉన్నట్టు స్ప ష్టం అవుతోంది. తెలంగాణలో మార్పు కచ్చితం. అది బీజేపీతో మాత్రమే సాధ్యం. గత నాలుగేళ్లలో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని బలోపేతం చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ బీజేపీని గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరుతున్నా..''అని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు.



శంషాబాద్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్ తదితరులు

1.30కి రాక.. 5.30కి తిరుగు ప్రయాణం

శంషాబాద్: ప్రధాని మోదీ పాలమూరు పర్యటన నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్ తదితరులు స్వాగతం పలికారు. తర్వాత ప్రధాని ప్రత్యేక హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. అక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం హెలికాప్టర్‌లో శంషాబాద్‌కు చేరుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరుగుప్రయాణం అయ్యారు.

ఎయిర్‌పోర్టులో 'వాట్ హ్యాపెండ్ మోదీ' ఫ్లెక్సీలు



ఎయిర్‌పోర్టు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 'వాట్ హ్యాపెండ్ మోదీ'అంటూ పసుపు బోర్డు, ఐటీఐఆర్, టెక్స్‌టైల్ పార్కు, డిఫెన్స్ కారిడార్, కాజీపేట రైల్వే కోచ్, మిషన్ భగీరథ ఫండ్స్ తదితర పథకాలు, డిమాండ్లపై ప్రశ్నలు కురిపిస్తున్న ఫ్లెక్సీలు వెలిశాయి. నోవాటెల్ సమీపంలోని పెట్రోలు బంకు పరిసరాల్లో వీటిని ఏర్పాటు చేశా రు. ఉదయం కనిపించిన ఈ ఫ్లెక్సీలు మధ్యాహ్నం వరకు ప్రసారమాధ్యమాలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతం కావడంతో భద్రతాధికారులు వీటిని సాయంత్రానికి తొలగించేశారు.

పసుపు బోర్డు.. గిరిజన వర్సిటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఇక్కడి పసుపు రైతుల సంక్షేమం కోసం తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు (నేషనల్ టర్మరిక్ బోర్డు)ను ఏర్పాటు చేస్తాం.

ములుగులో ట్రైబల్ వర్సిటీ..

ములుగు జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రూ.900 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే ఈ యూనివర్సిటీకి సమ్మక్క–సారలమ్మ పేరు పెడుతున్నాం. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో వివిధ భవనాలను ప్రారంభించాం. హెచ్‌సీయూకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదా కల్పించి, ప్రత్యేక నిధులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమే. నారీశక్తి వందన్ చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించడం ద్వారా నవరాత్రులకు ముందే శక్తి పూజ స్ఫూర్తిని నెలకొల్పాం.

వాణిజ్యం, పర్యాటకం, పరిశ్రమ రంగాలకు ప్రయోజనం

తెలంగాణ ప్రజల జీవితాల్లో పెను మార్పులు తీసుకొచ్చేలా అనేక రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం సంతోషంగా ఉంది. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్ వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయి. ఈ మూడు రాష్ట్రాల్లో వాణిజ్యం, పర్యాటకం, పారిశ్రామిక రంగాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ కారిడార్‌లో కొన్ని ముఖ్యమైన ఆర్థిక కేంద్రాలను కూడా గుర్తించాం. ఇందులో ఎనిమిది ప్రత్యేక ఆర్థిక మండళ్లు, ఐదు మెగా ఫుడ్ పార్కులు, నాలుగు ఫిషింగ్ సీఫుడ్ క్లస్టర్లు, మూడు ఫార్మా అండ్ మెడికల్ క్లస్టర్లు, ఒక టెక్స్‌టైల్ క్లస్టర్ ఉన్నాయి. దేశంలో నిర్మిస్తున్న ఐదు టెక్స్‌టైల్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయించాం. హన్మకొండలో నిర్మించే ఈ పార్క్‌తో వరంగల్, ఖమ్మం ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

వేలాది మందికి ఉపాధి ఇచ్చేలా..

ప్రపంచవ్యాప్తంగా ఇంధనం, ఇంధన భద్రతపై చర్చ జరుగుతోంది. కేవలం పరిశ్రమలకే కాకుండా ప్రజలకు కూడా ఇంధన శక్తిని అందిస్తున్నాం. దేశంలో 2014లో 14 కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు ఉంటే 2023 నాటికి 32 కోట్లకు పెరిగాయి. ఇటీవల గ్యాస్ సిలిండర్ల ధరలను కూడా తగ్గించాం. దేశంలో ఎల్పీజీ వినియోగాన్ని పెంచడంలో భాగంగా పంపిణీకి సంబంధించి నెట్‌వర్క్‌ను విస్తరించాల్సి ఉంది. ఇందులో భాగంగా హసన్-చర్లపల్లి ఎల్పీజీ పైప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఇది ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో దోహదపడుతుంది. కృష్ణపట్నం–హైదరాబాద్ మధ్య మల్టీ ప్రొడక్ట్ పైప్‌లైన్ వల్ల తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది..'' అని ప్రధాని మోదీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు ఇవీ..
- రూ.3,397 కోట్లతో మూడు ప్యాకేజీలుగా వరంగల్ నుంచి ఖమ్మం వరకు చేపట్టనున్న ఎన్‌హెచ్–163 పనులు
- రూ.3,007 కోట్లతో మూడు ప్యాకేజీలుగా ఖమ్మం నుంచి విజయవాడ వరకు నిర్మించే ఎన్‌హెచ్–163జీ పనులు
- కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు రూ.1,932 కోట్లతో చేపట్టే మల్టీ ప్రొడక్ట్ పైపులైన్ నిర్మాణ పనులు.

ప్రారంభించినవి ఇవీ..
- సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు రూ.2,457 కోట్లతో నిర్మించిన నాలుగు లేన్ల 365 బీబీ నంబర్ జాతీయ రహదారి.
- మునీరాబాద్ – మహబూబ్‌నగర్ రైల్వే లైన్‌లో భాగంగా జక్లేర్ నుంచి కృష్ణా వరకు రూ. 505 కోట్లతో పూర్తి చేసిన కొత్త లైన్.
- రూ.81.27 కోట్లతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్మించిన స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌కు చెందిన భవనాలు.
- రూ.2,166 కోట్లతో హసన్ (కర్ణాటక) నుంచి చర్లపల్లి వరకు నిర్మించిన ఎల్పీజీ పైప్‌లైన్ జాతికి అంకితం.
- నారాయణపేట జిల్లాలోని కృష్ణా స్టేషన్ నుంచి కాచిగూడ–రాయచూర్– కాచిగూడ డీజిల్, ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్ (డెమూ) రైలు సర్వీస్ ప్రారంభం.

మోదీ మార్క్ శంఖారావం!

పాలమూరు ప్రజాగర్జన సభ వేదికగా బీజేపీ ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలుత అభివృద్ధి కార్యక్రమాలు.. తర్వాత మరో వేదికపై రాజకీయ ప్రసంగం
- ఓపెన్‌టాప్ జీప్‌లో పూలు చల్లుతూ ఆహ్వానం పలికిన పార్టీ కార్యకర్తలు, ప్రజలు
- మోదీ, మోదీ నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణం
- తెలుగులో ప్రసంగం ప్రారంభించిన ప్రధాని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వాగ్బాణాలు
- పసుపు బోర్డు, గిరిజన వర్సిటీల ఏర్పాటు ప్రకటనతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం

(మహబూబ్‌నగర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో పాలమూరులో ప్రధాని నరేంద్ర మోదీ తనదైన శైలిలో బీజేపీ ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించారు. అటు అధికారిక కార్యక్రమాలతో అభివృద్ధి మంత్రం పఠిస్తూనే.. ఇటు బహిరంగ సభ వేదికగా బీఆర్‌ఎస్‌పై విమర్శలతో రాజకీయ ప్రసంగం చేసి.. ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. చాలాకాలం నుంచి ఉన్న డిమాండ్లను తీరుస్తూ పసుపుబోర్డు, గిరిజన వర్సిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడం ద్వారా.. తెలంగాణకు బీజేపీ మేలు చేస్తోంది అన్నట్టుగా సంకేతాలు పంపారు. తెలంగాణప్రజలు మార్పు కోరుకుంటున్నారంటూనే.. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలని, తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీరుస్తామని చెప్పారు. మహిళా బిల్లును ఆమోదించడం, హైవేల నిర్మాణంతో ప్రయోజనాలు, కేంద్ర ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పడం ద్వారా ఆయా వర్గాలకు మేలు చేస్తున్నట్టుగా వివరించే ప్రయత్నం చేశారు.

సభ సాంతం.. మోదీ నామస్మరణతో..

అధికారిక కార్యక్రమం, ఊరేగింపు, సభా వేదికపై ప్రసంగం సమయంలో సభా ప్రాంగణమంతా మోదీ.. మోదీ.. అంటూ నినాదాలతో హోరెత్తిపోయింది. అభిమానులు, పార్టీ కార్యకర్తలు అరుపులు, కేకలతోపాటు చప్పట్లు కొడుతూ కనిపించారు. ఇది చూసిన మోదీ.. 'మీ ప్రేమాభిమానాలు, ఆదరణకు నేను ధన్యుడిని అయ్యాను. ఇంత ప్రేమను చూసి ముగ్ధుడిని అయ్యాను. మీరు, మేము కలసి తెలంగాణను అభివృద్ధిపథంలోకి తీసుకెళదాం. ఈ సభ విజయవంతం కావడం, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మద్దతు తెలపడాన్ని వరుణదేవుడు కూడా హర్షాన్ని వెలిబుచ్చి వర్షాన్ని కురిపించాడు. (ప్రసంగం సాగుతున్నపుడు వర్షం పడుతుండటాన్ని ప్రస్తావిస్తూ..). తెలంగాణ ప్రజలను కలసిన నా జీవితం ధన్యమైంది..''అని పేర్కొన్నారు.

- సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ.. గిరిజన వర్సిటీ, పసుపు బోర్డు ప్రకటన నేపథ్యంలో అంతా లేచి మోదీకి గౌరవసూచకంగా చప్పట్లు కొట్టాలని కోరారు. దీనితో వేదికపై ఆసీనులైన నేతలు, సభికులు లేచి 'మోదీ నాయకత్వం వర్ధిల్లాలి'అంటూ నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా మోదీ రెండు చేతులు జోడించి, వంగి సభికులకు సమస్కారం చేశారు.
- సభలో ప్రసంగిస్తున్న సమయంలో ఓ చిన్నారి జోష్ చూసి మోదీ సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారికి తన ఆశీస్సులు అందిస్తున్నట్టు చెప్పారు.

పది నిమిషాల్లో మనసు విప్పుతా..!

తొలుత అధికారిక కార్యక్రమ వేదికపై సుమారు 12 నిమిషాలు ప్రసంగించిన మోదీ అభివృద్ధి అంశాలనే ప్రస్తావించారు. చివరిలో మాత్రం.. ''ఇప్పుడు అధికారిక కార్యక్రమంలో ఉన్నాను. కొన్ని అంశాలపై నన్ను నేను నియంత్రించుకున్నాను. ఓ పది నిమిషాల్లో మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటున్నా.. అక్కడ మనసు విప్పి మాట్లాడుతా.. నేను మీకు మాటిస్తున్నా.. నేను ఏం మాట్లాడినా తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా మాట్లాడుతా..''అని పేర్కొనడం గమనార్హం.

ఓపెన్ టాప్ జీప్‌లో ఊరేగిస్తూ.. పూలు చల్లుతూ..

తొలుత ఒక వేదికపై అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి మాట్లాడిన ప్రధాని మోదీ.. తర్వాత కాస్త దూరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు ఓపెన్ టాప్ జీపులో వెళ్లారు. బంజారా మహిళల నృత్యాలతో, పూలు చల్లుతూ బీజేపీ కార్యకర్తలు, ప్రజలు మోదీకి ఆహ్వానం పలికారు. ఈ సమయంలో ఓ యువతి మోదీ చిత్రపటాన్ని ఆయనకు అందజేయగా.. మోదీ దానిని తీసుకుని, తన ఆటోగ్రాఫ్ చేసి తిరిగి ఆ యువతికి అందించారు. సభా వేదికపైకి చేరుకునే వరకు మోదీ రెండు చేతులతో విజయ సంకేతాలు (వీ చిహ్నాలు) చూపుతూ, అభివాదం చేస్తూ సాగారు.



తెలుగులో ప్రసంగం మొదలుపెట్టి..

అధికారిక కార్యక్రమంతోపాటు సభ వేదికపైనా తొలుత తెలుగులోనే మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించడం.. మధ్యలోనూ పలుమార్లు తెలుగులో మాట్లాడటం ప్రజలు, కార్యకర్తలను ఆకట్టుకుంది. సభలో 'భారత్ మాతాకీ జై.. పాలమూరు ప్రజలందరికీ నమస్కారాలు'అంటూ తెలుగులో మోదీ ప్రసంగాన్ని మొదలుపెట్టారు. మొత్తం 15 సార్లు మోదీ 'నా కుటుంబ సభ్యుల్లారా'అంటూ సంబోధించారు. చివరిగా అందరూ రెండు చేతులు పైకెత్తి పిడికిలి బిగించి భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేయాలని కోరారు. తాను ఆ పదాలను గట్టిగా పలుకుతూ, సభికులతోనూ అనిపించి ప్రసంగాన్ని ముగించారు.

సభకు ముందు నేతల్లో టెన్షన్!

పాలమూరు సభ ప్రారంభానికి గంట, గంటన్నర ముందు మైదానంలో చాలా వరకు కుర్చీలు ఖాళీగా కనిపించాయి. దీనితో బీజేపీ నేతలు, సభ బాధ్యులు కొంత టెన్షన్‌కు గురయ్యారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, సభ విఫలమైందనే భావన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎమ్మెల్యే రఘునందన్‌రావు వేదికపై మైక్‌లోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు బారికేడ్లు దూకి లోపలికి రావాలని పిలుపునిచ్చారు. అయితే కాసేపటి తర్వాత పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, ప్రజలు సభా స్థలికి చేరుకున్నారు.

హెచ్‌సీయూలో కొలువుదీరిన కొత్త భవనాలు

- వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ
- రూ.81.27 కోట్లతో నిర్మాణం
- నాలుగు విభాగాలకు సొంత భవనాలు, ఒక లెక్చర్ హాల్

రాయదుర్గం, శంషాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో నూతనంగా నిర్మాణం చేసిన అయిదు భవనాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. రూ.81.27 కోట్ల వ్యయంతో నిర్మించిన స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ మేథమెటిక్స్ అండ్ స్టాటస్టిక్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, సరోజినీ నాయు డు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్(అనుబంధం)కు భవనాలతో పాటు లెక్చర్ హాల్ కాంప్లెక్స్–3 భవనాన్ని ఆదివారం మహబూబ్‌నగర్ నుంచి వర్చువల్‌గా పీఎం ప్రారంభించారు. కేంద్ర విద్యాశాఖ, యూజీసీ మంజూరు చేసిన నిధులతో వీటి నిర్మాణం పూర్తి చేశారు. ఈ భవనాల నిర్మాణంతో ఆయా విభాగాల విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి రావడమే కాకుండా సమావేశాల నిర్వహణ, తరగతుల నిర్వహణకు అవసరమైన లెక్చర్ హాల్–3 కూడా అందుబాటులోకి వచ్చింది.

కమలం టికెట్ల కసరత్తు షురూ!

- బీజేపీ అభ్యర్థుల ఎంపికపై చర్చలు
- ఆదివారం పొద్దుపోయే వరకూ కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటల భేటీ

సాక్షి, హైదరాబాద్: బీజేపీ.. అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కసరత్తును వేగవంతం చేసింది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం ఉన్న వారి నుంచి పార్టీ నాయకత్వం దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం 6,003 అప్లికేషన్లు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు 40 నియోజకవర్గాల్లో ఒకే అభ్యర్థి ఉన్న ముఖ్య నేతల స్థానాలకు గానూ మొదటి జాబితాను అగ్ర నాయకత్వం ఖరారు చేసినట్టు తెలుస్తోంది. మిగతా చోట్ల అందుబాటులో ఉన్న పార్టీ నేతలు, విజయావకాశాలు, ఇతర పార్టీల నుంచి వచ్చే అవకాశాలున్న బలమైన నేతల పేర్లు తదితర అంశాలపై పార్టీ ముఖ్య నేతలు భేటీ అయ్యారు. ఆదివారం దిల్ కుశ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నట్టు సమాచారం. చాలాచోట్ల నియోజకవర్గానికి ఇద్దరు, ముగ్గురు చొప్పున అభ్యర్థుల పేర్లను సూచిస్తూ పార్టీ ముఖ్య నేతలు ఇచ్చిన జాబితాలపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది.

సంఘ్ పరివార్ నుంచి కూడా జాబితా?

ఇక సంఘ్ పరివార్ నుంచి కూడా అభ్యర్థుల ప్రతిపాదనలతో మరో జాబితా తీసుకున్నట్టు సమాచారం. ఈ జాబితాలను సరి చూసి కామన్‌గా వచ్చిన పేర్లతో ముసాయిదా జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వ పరిశీలనకు పంపించ నున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రెండుమూడు రోజుల్లో ఈ ముఖ్యనేతలు మరో సారి సమావేశమై అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై సమాలోచనలు జరపనున్నట్టు తెలిసింది. కాగా, ఈ నెల 6న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్రానికి వచ్చి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై సమీక్ష నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆదివారం పొద్దుపోయే వరకు ఈ భేటీ సాగినట్టు సమాచారం.

మోదీ, అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు



పసుపు బోర్డుతో ప్రయోజనాలెన్నో!

కొత్త వంగడాల అభివృద్ధి.. రాయితీపై యంత్రాలు

- నాణ్యమైన, అధిక దిగుబడి సాధించే దిశగా పరిశోధనలు
- పంట నిల్వకు చాన్స్.. పసుపు శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకూ మార్గం
- రేపు జరిగే ప్రధాని సభను కృతజ్ఞత సభగా మార్చిన పసుపు రైతులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. సుగంధ ద్రవ్యాల బోర్డు కింద ఉన్న పసుపు పంటను విడదీసి, ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించడం, ఇది దేశంలోనే తొలిసారి కావడం విశేషం. దీనిపై నిజామాబాద్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మంగళవారం మోదీ పాల్గొనే జనగర్జన సభను రైతులు కృతజ్ఞత సభగా మార్చారు.

బోర్డు విధివిధానాలు ప్రకటించనున్న ప్రధాని

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని వాణిజ్య, వ్యవసాయ, ఉద్యాన శాఖల కార్యదర్శులు, ఆర్థిక శాఖ సలహాదారు సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న సుగంధ ద్రవ్యాల బోర్డు చైర్మన్ పరిధిలో పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. పసుపు బోర్డుకు ప్రత్యేకంగా సీఈవోని నియమించనున్నారు. మరో 11 మందిని పసుపుబోర్డుకు సభ్యులుగా నియమించనున్నారు. ప్రత్యేకంగా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను ఇందూరు సభలో ప్రధానమంత్రి ప్రకటించనున్నారు.

విత్తనం నుంచి మార్కెటింగ్ వరకు..

పసుపు బోర్డు ఏర్పాటైతే రైతులకు కొత్త వంగడాల అభివృద్ధి నుంచి పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ వరకు లబ్ధి కలుగుతుంది. రైతులకు పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం, డ్రై చేయడం, పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందిస్తారు. కొత్త వంగడాల అభివృద్ధితో పాటు పసుపు పంట విత్తిన తరువాత అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. తద్వారా కర్క్యుమిన్ శాతం, నాణ్యత, దిగుబడి పెంచేలా రైతులకు సహకారం అందుతుంది. ఇక పసుపు పంట మార్కెటింగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటుంది. ఈ క్రమంలో జిల్లాకు పసుపు శుద్ధి కర్మాగారాలు తరలివస్తాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం తదుపరి దశలో ఇక్కడ పసుపు శుద్ధికర్మాగారం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిజామాబాద్ మార్కెట్‌కు 7.49 లక్షల క్వింటాళ్లు

తెలంగాణ వ్యాప్తంగా గత సీజన్‌లో సుమారు 8.80 లక్షల క్వింటాళ్ల పసుపు దిగుబడి వచ్చింది. ఇందులో అత్యధికంగా నిజామాబాద్ మార్కెట్‌కు 7.49 లక్షల క్వింటాళ్లు వచ్చింది. రాష్ట్రంలో మొత్తం పసుపు సాగులో 40% ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే కావడం గమనార్హం. తరువాతి స్థానాల్లో జగిత్యాల, నిర్మల్, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయి. 2020లో ఎంపీ అర్వింద్ చొరవతో నిజామాబాద్‌లో 'సుగంధ ద్రవ్యాల బోర్డు'రీజినల్ ఆఫీస్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి రూ.30 కోట్ల బడ్జెట్ కేటాయించారు. తరువాత కర్క్యుమిన్ ఆధారిత పసుపు మార్కెటింగ్ కోసం దేశంలోనే మొదటిసారిగా నిజామాబాద్ మార్కెట్‌లో 2021లో నాంది పలికారు.



పసుపు బోర్డు వచ్చింది.. కాలికి చెప్పలొచ్చాయ్..

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన రైతు ముత్యాల మనోహర్‌రెడ్డి పన్నెండేళ్లుగా పసుపు ఉద్యమంలో పాల్గొంటున్నారు. స్థానికంగా పసుపు బోర్డు ఏర్పాటయ్యే వరకు చెప్పులు వేసుకోబోనని ప్రతినబూనిన ఆయన 2011 నవంబర్ 4 నుంచి చెప్పులు వేసుకోవడం లేదు. 2013లో పసుపు బోర్డు కోసం డిమాండ్ చేస్తూ కాలికి చెప్పుల్లేకుండానే తిరుపతికి పాదయాత్ర చేశారు. పసుపు బోర్డు సాధన పోరాటంలో భాగంగా ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద అనేక సార్లు రైతులతో కలిసి ఆందోళనల్లో పాల్గొన్నారు. తాజాగా ప్రధాని మోదీ పసుపు బోర్డు ఏర్పాటు విషయాన్ని ప్రకటించడంతో మనోహర్ రెడ్డి ఆదివారం చెప్పులు వేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పసుపు రైతులు ఆయనను ఘనంగా సన్మానించారు.

నమో అంటే.. నమ్మించి మోసగించడమే!

- ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసు
- అందుకే జాతీయ స్థాయిలో అధికార మార్పు కోరుకుంటున్నారు
- రాష్ట్రంలో రైతు రుణమాఫీ జరగలేదనడం మిలియన్ డాలర్ జోక్
- పాలమూరు సభలో ప్రధాని విమర్శలపై 'ఎక్స్'వేదికగా కేటీఆర్ కౌంటర్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ పాలమూరు సభలో కేసీఆర్ ప్రభుత్వంపై చేసిన విమర్శలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు 'ఎక్స్'(ట్విట్టర్) వేదికగా తిప్పికొట్టారు. తమది జై కిసాన్ ప్రభుత్వమని... మోదీది నై కిసాన్ సర్కార్ అని ఎద్దేవా చేశారు.

బీజేపీ స్టీరింగ్ అదానీ చేతిలోకి...

'న.మో. అంటే నమ్మించి మోసగించడమే అని దేశ ప్రజలకు తెలుసు. దేశ ప్రజలంతా జాతీయ స్థాయిలో అధికార మార్పు రావాలని కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ స్టీరింగ్ కేసీఆర్ చేతిలో భద్రంగా ఉంది. కానీ బీజేపీ స్టీరింగ్ మాత్రం అదానీ చేతిలోకి వెళ్లిపోయింది. మీరు కిసాన్ సమ్మాన్ కింద ఇచ్చింది కేవలం నామమాత్రం. కానీ ఒక చిన్న రాష్ట్రమైన తెలంగాణ, కొత్త రాష్ట్రమైనప్పటికీ 70 లక్షల మంది రైతులకు రూ. 72 వేల కోట్లను నేరుగా ఖాతాల్లో వేసిన విషయం మీరు తెలుసుకుంటే మంచిది. రైతుల రుణమాఫీ జరగలేదని మాట్లాడటం మిలియన్ డాలర్ జోక్. స్వతంత్ర భారత చరిత్రలోనే ఒక కొత్త రాష్ట్రం రెండుసార్లు రైతు రుణమాఫీకి నడుం బిగించిన ఏకైక సందర్భం తెలంగాణలోనే ఆవిష్కృతమైంది. అన్నదాత అప్పులు మాఫీ చేసిన జై కిసాన్ ప్రభుత్వం మాది. కార్పొరేట్ దోస్తులకు రూ. 14.5 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిన నై కిసాన్ సర్కా రు మీది. కర్షకుల రక్తం కళ్లజూసిన రైతు హంతక రాజ్యం మీది. మీ ఎన్నికల హామీలను గాలికి వదిలేసి ఓట్ల వేటలో ఇప్పుడొచ్చి మాట్లాడితే నమ్మేదెవరు? ప్రాజెక్టుల వల్ల చుక్క నీరు రాలేదనడం మీ అవివేకానికి నిదర్శనం. తెలంగాణలో సాగునీటి విప్లవం సాగుతోంది. తెలంగాణ రైతు పండించిన ధాన్యా న్ని కొనుగోలు చేయలేక చేతులెత్తేసిన మీరా మాట్లాడేది? తెలంగాణ రైతులు పండించిన ధాన్యా న్ని కొనమంటే నూకలు తిన మన్న మీ కేంద్ర పెద్దల అవమానకర మాటలను తెలంగాణ రైతులు మరిచి పోలేదు. మీరెన్ని చెప్పినా మీ బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లిపోయాయి. నిన్న కాళేశ్వరమైనా నేడు పాలమూరు ప్రాజెక్టయినా ప్రపంచ సాగునీటి చరిత్రలోనే అతిగొప్ప మానవ నిర్మిత అద్భుతాలు. భవిష్యత్తు ఇరిగేషన్ రంగానికే సరికొత్త పాఠాలు. వాటిపై మీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలు'అంటూ ఘాటుగా విమర్శలు గుప్పించారు.

గుజరాత్‌కో నీతి.. తెలంగాణకో నీతా?

▶ మొదటి పేజీ తరువాయి



బహిరంగ సభకు భారీగా హాజరైన ప్రజలు

వేలంలో పాల్గొని బొగ్గు బ్లాకులు దక్కించుకోవాలని మోదీ ఉచిత సలహా ఇచ్చారని పేర్కొన్నారు. ప్రధానికి సింగరేణిపై ప్రేమ ఉంటే గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బొగ్గు గనులు ఎలా రాసిచ్చారో.. అదే పద్ధతిని సింగరేణికి ఎందుకు పాటించలేదని నిలదీశారు. 'నాకు తెలుసు నీ కుట్ర.. ఏ ప్రభుత్వరంగ సంస్థ అయినా మంచిగ నడిస్తే.. దానిని నష్టాల్లోకి నెట్టేయాలి. ఆ తర్వాత నష్టాల్లోకి వచ్చిన సంస్థగా ముద్రవేసి నీ దోస్తులకు కట్టబెట్టాలి. అడ్డికి పావుసేరుకు అమ్మి అందులో చందాలు తీసుకోవాలి. ఇలా స్కీంలు పెట్టి ఒక్కో ప్రభుత్వరంగ సంస్థను అమ్ముతున్నారన్నారు. ఎయిర్ ఇండియా, రైల్వే, ఎల్ఐసీ.. ఇలా అనేక ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతున్నారు'అని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలనే ఆలోచన ముఖ్యమంత్రికే ఉందన్నారు. మోదీ అంటే అమ్మకం, కేసీఆర్ అంటే నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. 'ఎన్ని వేషాలు వేసినా, డైలాగులు కొట్టినా.. నిన్ను (మోదీ) ఎవరూ నమ్మరు. బీజేపీకి నూకలు చెల్లాయి. డిపాజిట్ కూడా రాదని' కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని... అందువల్ల ఎమ్మెల్యేలనే కాదు.. బీఆర్ఎస్ ఎంపీలనూ గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అప్పుడు ఢిల్లీ (కేంద్ర ప్రభుత్వం) జుట్టు మన చేతుల్లో ఉంటుందన్నారు.

4 కోట్ల ప్రజలంతా కేసీఆర్ కుటుంబం...

'మాది కుటుంబ పార్టీ అని మోదీ అంటుండు. అవును.. మాది బరాబర్ కుటుంబ పార్టీయే. తెలంగాణలో ఉన్న 4 కోట్ల మంది ప్రజలంతా కేసీఆర్ కుటుంబ సభ్యులే. 13 లక్షల మంది యువతులకు పెళ్లి చేసిన మేనమామ కేసీఆర్. 46 లక్షల మంది వృద్ధులకు పింఛన్ ఇచ్చే పెద్ద కొడుకు కేసీఆర్.. 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చి అండగా నిలిచిన పెద్దన్న కేసీఆర్. ప్రతి కుటుంబంలో కేసీఆర్ ఒక సభ్యుడు.. ఆ కుటుంబానికి పెద్ద దిక్కు కేసీఆర్'అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మొద్దు: మంత్రి కేటీఆర్

'వారంటీ లేని కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గ్యారంటీలు నమ్మితే ఆగమవుడు గ్యారంటీ'అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం శంకర్‌పల్లిలో రూ. 500 కోట్లతో నిర్మించే ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసిన కేటీఆర్... పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్లు, రామకృష్ణాపూర్ పరిధిలోని గాంధారీ వనంలో ఎకో అర్బన్ పార్క్, ఓపెన్ జిమ్, వంతెనల వంటి మొత్తం రూ. 312 కోట్ల అభివృద్ధి కార్యక్రమాల్లో ఆదివారం పాల్గొన్నారు. అనంతరం మందమర్రిలో రోడ్ షో చేపట్టారు. అలాగే రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో ఎమ్మెల్యే సుమన్ అధ్యక్షతన జరిగిన సభలో 304 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పే ఆరు గ్యారంటీలను నమ్మితే మళ్లీ 3 గంటల కరెంట్, రైతులు ఆగమవడం, ఏడాదికో సీఎం మారడం ఈ మూడు మాత్రం గ్యారంటీగా జరుగుతాయన్నారు. 'బడే మియాతో బడే మియా.. చోటే మియా సుబానల్లా అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ తీరు ఉంది. రాష్ట్రానికి ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వచ్చారు? దక్షణాదికి వెలుగులిస్తున్న సింగరేణిని అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. గని కార్మికులకు ఆర్మీ ఉద్యోగుల తరహాలో ఐటీ మినహాయింపు ఇవ్వమంటే ఉలుకు పలుకు లేదు'అని కేటీఆర్ విమర్శించారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణపై కాంగ్రెస్, బీజేపీ వాళ్లకు ప్రేమ ఉండదని... ఎన్నటికైనా గులాబీ జెండానే శ్రీరామ రక్ష అని పునరుద్ఘాటించారు. మూడోసారి ముచ్చటగా కేసీఆర్‌ను సీఎం చేద్దామని పిలుపునిచ్చారు.

మళ్లీ గెలిపిస్తే బాల్క సుమన్‌కు ప్రమోషన్...

'సుమన్ బాగా పని చేస్తున్నారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట తరహాలో చెన్నూరులో అభివృద్ధి ఉంది. మళ్లీ గెలిపిస్తే సీఎం ప్రమోషన్ ఇస్తారు. త్వరలో రూ. 1,658 కోట్లతో చెన్నూరు ఎత్తిపోతల పథకం, కొత్తగా రెవెన్యూ డివిజన్, ఆస్నాద్, పారుపల్లి మండలాలు ఏర్పాటు చేస్తాం'అని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. మంత్రి పర్యటనలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీలు నారాదాసు లక్ష్మణరావు, పైడిపల్లి రవీందర్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను వీడని 'రైల్వే గేటు'..

రామకృష్ణాపూర్, మంచిర్యాల మధ్య రైల్వే గేటు పడి స్థానికులు ఇబ్బంది పడుతున్నారని... నిధులు విడుదల చేసి ఆర్వోబీ పూర్తి చేసేలా చూడాలని సభలో బాల్క సుమన్ మంత్రి కేటీఆర్‌ను కోరారు. సభ అనంతరం ఆ మార్గంలోనే కేటీఆర్ కాన్వాయ్ ఎమ్మెల్యే సుమన్ ఇంటికి వెళ్తుండగా రైల్వే గేటు పడి వాహనాలు నిలిచిపోయాయి. 15 నిమిషాల తర్వాత రైలు వెళ్లాక గేటు తీయడంతో కాన్వాయ్ కదిలింది.

కేసీఆర్ ఇక.. ఫామ్‌హౌస్‌కే పరిమితం!

పాలమూరు ప్రజాగర్జన సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్

- కేంద్రం రాష్ట్రానికి రూ.9 లక్షల కోట్లు ఇస్తే.. వారి కుటుంబానికి ఏమిచ్చారని అడుగుతున్నారు
- కేసీఆర్ మాటలు కోటలు దాటుతాయి.. పనులు ప్రగతిభవన్ దాటవు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలూ మజ్లిస్‌కు తొత్తులే..
- గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేస్తామని ధీమా



ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: సీఎం కేసీఆర్‌కు ప్రజల సంక్షేమం, అభివృద్ధి అవసరం లేదని.. తాను, తన కొడుకు, తన కుటుంబ ప్రయోజనాలే లక్ష్యమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం తెలంగాణకు తొమ్మిదేళ్లలో రూ.9 లక్షల కోట్లు ఇస్తే.. 'మాకేం ఇచ్చారు? మా కుటుంబానికి ఏం ఇచ్చారు? మా ఫామ్‌హౌస్‌కు ఏమిచ్చారని అడుగుతున్నారు' అని పేర్కొన్నారు. కేసీఆర్ నిజాంలా, రజాకార్లలా ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పాలమూరు ప్రజాగర్జన సభలో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం రూ.9 లక్షల కోట్లు ఇస్తే.. కేసీఆర్ మాత్రం ఇచ్చిన హామీలేమీ అమలు చేయలేదు. దళిత సీఎం, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి వంటివేమీ ఇవ్వలేదు. అనేక పోరాటాలు, 1,200 మంది బలిదానాలతో వచ్చిన తెలంగాణ ఇప్పుడు ఎలాంటి దుస్థితిలో ఉన్నదో చూస్తున్నాం. దేశంలో సిద్ధాంతపరంగా విభేదించే సీఎంలు ఉన్నారుగానీ.. తెలంగాణ సీఎంలా ఎవరూ లేరు. తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రధాని వస్తే.. రాష్ట్ర సీఎం మాత్రం రారు. ఫామ్‌హౌజ్‌లో ఉంటారు. కేసీఆర్ మాటలు కోటలు దాటుతాయి. పనులు ప్రగతిభవన్ దాటవు. గోల్కొండ కోటపై కాషాయజెండా ఎగరవేసి కేసీఆర్‌ను ఫామ్‌హౌజ్‌కు పంపిస్తాం. ప్రజలకు నీతివంతమైన, పురోగామి పాలన అందేందుకు బీజేపీని ఆదరించాలి. మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి.

వారు మజ్లిస్ తొత్తులు

తాను ఉన్నానంటూ కాంగ్రెస్ పార్టీ మళ్లీ ముందుకు వస్తోంది. గతంలోనే వారి పాలన చూశాం. అవినీతి, కుటుంబ పార్టీ గురించి మనకు తెలుసు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలే. రెండూ మజ్లిస్ పార్టీకి తొత్తులే. వారికి గురువు అసదుద్దీన్ ఒవైసీ. ఈ మూడింటి డీఎన్ఏ ఒక్కటే.. వీటిలో ఏ పార్టీకి వేసినా మరొకరికి వేసినట్టే.

ప్రధానికి ధన్యవాదాలు చెప్తున్నా..

సమ్మక్క–సారలమ్మ పేరిట కేంద్రీయ గిరిజన వర్సిటీ ఏర్పాటు ఎంతో గొప్ప విషయం. పసుపు బోర్డు కావాలని రైతులు ఎన్నో ఏళ్లు ఉద్యమాలు చేశారు. ఇవాళ తెలంగాణ రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని చెప్పారు. వీటిపై తెలంగాణ ప్రజల తరఫున నేను ప్రధానికి ధన్యవాదాలు చెప్తున్నా..''అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సభలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర సీనియర్ నేతలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ఏవీఎస్ రెడ్డి, మురళీధర్‌రావు, నల్లు ఇంద్రసేనారెడ్డి, గరికపాటి మోహన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, టి.ఆచారి, డి.ప్రదీప్‌రావు, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు, చిత్తరంజన్‌దాస్ పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రజలను ఏడిపిస్తున్నారు: జితేందర్‌రెడ్డి

సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తూ ఏడిపిస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి ఆరోపించారు. పాలమూరు సభలో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణా రైల్వేస్టేషన్‌కు ఎన్నోఏళ్ల తర్వాత మోదీ చొరవతో మోక్షం లభించిందని పేర్కొన్నారు. పాలమూరులో రూ.13,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.

చిన్న ట్రైలర్‌కే వణికితే.. రిలీజైతే ఏమిటో?

పాలమూరులో మోదీ సభకు వచ్చిన అద్భుత ప్రజా స్పందన చూసి కల్వకుంట్ల కుటుంబం ఆగమాగం అవుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సభ అనంతరం ఆదివారం రాత్రి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ''ప్రధాని అన్నది ఫాంహౌస్ కుటుంబాన్నే. అది అర్థంకానట్టు కేటీఆర్ నటించడం నవ్వు తెప్పిస్తోంది. చిన్న ట్రైలర్‌కే గజగజ వణికిపోతుంటే.. రేపు సినిమా రిలీజైతే మీ పరిస్థితేమిటో..''అని పేర్కొన్నారు.

..ప్రజలే తేల్చుకోవాలి

▶ మొదటి పేజీ తరువాయి

భవనానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో హరీశ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేస్తే.. రాష్ట్రానికి ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు.

అప్పట్లో వారు డాక్టర్ కాలేక బాధపడ్డారు..: ''మంత్రి సబితమ్మ కూడా డాక్టర్ కావాలనుకున్నారట, ఆనాడు ఎంసెట్ రాస్తే 1200 ర్యాంకు రాగా సీటు రాకపోవడంతో డాక్టర్ కాలేకపోయారు.. అలాగే ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా ఆశయం నెరవేరక చాలా బాధపడ్డారట. కానీ ఇప్పుడు మన తెలంగాణలో లక్షా యాభై వేల ర్యాంకు వచ్చినా సీటు లభిస్తోంది. తక్కువ ఖర్చుతో పిల్లలకు ఎంబీబీఎస్ చదువుకునే అవకాశం లభించింది''అని హరీశ్‌రావు చెప్పారు.


కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ అంధకారమే..: బీజేపీతో పాటు కాంగ్రెస్ కూడా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వాళ్లు గెలిస్తే రాష్ట్రం అంధకారమే అవుతుందన్నారు. జల్‌పల్లి, ఆమనగల్లు మున్సిపాలిటీల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, గిడ్డంగుల శాఖ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాలకు పూర్వవైభవం



బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవంలో ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రంలోని ఆలయాలకు పూర్వవైభవం వచ్చిందని దేవాదాయ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో రూ.2.50 కోట్లతో నిర్మించిన విప్రహిత బ్రా హ్మణ సదన్‌ను విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ అర్చక ఉద్యోగులకు ఉత్తమ వేతన వ్యవస్థ ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ 2014కు ముందున్న పాలకుల హయాంలో నిరాదరణకు గురైన బ్రాహ్మణులను, రైతులను సీఎం కేసీఆరే గుర్తించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.





బలహీనులు ఎప్పటికీ క్షమించలేరు.
క్షమాగుణం బలవంతుల లక్షణం.
– మహాత్మా గాంధీ

సాక్షి

సోమవారం, 2 అక్టోబర్ 2023

మనుషులు చేజారుతారు

'హమ్ తుమ్ ఏక్ కమరే మే బంద్ హో'.... భారత సినీ ప్రేక్షకుల్ని ఉర్రూతలూపిన 'బాబీ' మొన్నటి సెప్టెంబర్ 28కి యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇవాళ్టికీ దేశంలోని అన్ని భాషల్లో ఏదైనా టీనేజ్ ప్రేమకథ తీస్తూంటే గనక అది ఏదో ఒక మేరకు 'బాబీ'కి కాపీ. ఆ సినిమా ఇచ్చిన ఫార్ములాతో వందలాది కథలు వచ్చాయి. వస్తాయి. 'మేరా నామ్ జోకర్' తీసి నిండా మునిగిన రాజ్‌కపూర్‌ను కుబేరుణ్ణి చేసిన సినిమా అది. ఆ సంపద వచ్చిన సందర్భంలోనే రాజ్‌కపూర్ ఒక మనిషిని చేజార్చుకున్నాడు. తెలిశా.. తెలియకనా?

'బాబీ'ని కనీస ఖర్చుతో తీద్దామనుకున్నాడు రాజ్‌కపూర్. హీరో తన కొడుకే రిషికపూర్. హీరోయిన్ కొత్తమ్మాయి డింపుల్ కపాడియా. ముఖ్య పాత్రలు ప్రేమ్‌నాథ్, ప్రేమ్‌చోప్రా భార్య తరఫు బంధువులు. లక్ష్మీకాంత్– ప్యారేలాల్ ఇంకా కెరీర్ ప్రారంభంలో ఉండి రాజ్‌కపూర్‌తో మొదటి సినిమా చేయడమే వరం అనుకునే రకం. ఖర్చేముంది? ఒక్కటి ఉంది... ప్రాణ్ రెమ్యూనరేషన్. ఆ రోజుల్లో ప్రాణ్ సినిమాకు రెండు, మూడు లక్షలు తీసుకుంటున్నాడు. రాజ్‌కపూర్‌తో అప్పటికి నలభై ఏళ్లుగా ప్రాణస్నేహం. 'ఒక్కరూపాయి తీసుకొని చేస్తా. సినిమా ఆడితే ఇవ్వు. ఆడకపోతే మర్చిపో' అన్నాడు ప్రాణ్. అన్నమాట ప్రకారం ఒక్క రూపాయికే చేశాడు. సినిమా రిలీజ్ అయ్యింది. ఇరవై పాతిక లక్షలు పెట్టి తీస్తే దేశంలో, బయట కలిపి 30 కోట్లు వచ్చాయి. నేటి లెక్కల ప్రకారం 1200 కోట్లు! రాజ్‌కపూర్ ప్రాణ్‌ని పిలిచి మంచి పార్టీ ఇస్తే బాగుండేది. థ్యాంక్స్ చెప్పి అడిగినంత ఇచ్చి ఉంటే బాగుండేది. ఇవ్వకపోయినా బాగుండేది. కాని రాజ్‌కపూర్ లక్ష రూపాయల చెక్ పంపాడు. లక్ష? తను అడగలేదే? పోనీ తాను అందరి దగ్గరా తీసుకునేంత కూడా కాదే. ప్రాణ్ ఆ చెక్ వెనక్కు పంపాడు. మళ్లీ జీవితంలో రాజ్‌కపూర్‌ని కలవలేదు. జారిపోయాడు.

'షోలే' రిలీజ్ అయితే మొదటి రెండు వారాలు ఫ్లాప్‌టాక్. రాసిన సలీమ్–జావేద్ ఆందోళన చెందారు. ఫ్లాప్ కావడానికి స్క్రిప్ట్ కారణమనే చెడ్డపేరు ఎక్కడ వస్తుందోనని బెంబేలెత్తారు. మాటల్లో మాటగా దర్శకుడు రమేష్ సిప్పీతో 'గబ్బర్‌సింగ్ వేషం వేసిన అంజాద్‌ఖాన్ వల్లే సినిమా పోయింది. అతడు ఆనలేదు' అన్నారు. అప్పటికే తన తొలి సినిమాకు ఇలాంటి టాక్ రావడం ఏమిటా అని చాలా వర్రీగా ఉన్న అంజాద్‌ఖాన్ బ్లేమ్ గేమ్‌లో తనను బలి చేయబోతున్నారని తెలిసి హతాశుడయ్యాడు. తీవ్రంగా కలత చెందాడు. కాని సినిమా కోలుకుంది. ఎలా? అలాంటి కలెక్షన్లు ఇప్పటికీ లేవు. అతి గొప్ప విలన్‌గా అంజాద్‌ఖాన్ ఎన్నో సినిమాలు చేశారు. కాని ఒకనాటి మిత్రులైన సలీమ్–జావేద్ రాసిన ఏ స్క్రిప్ట్‌లోనూ మళ్లీ యాక్ట్ చేయలేదు. చేజారిపోయాడు.

దాసరి నారాయణరావు తొలి రోజుల్లో నటుడు నాగభూషణాన్ని ఎంతో నమ్ముకున్నాడు. అభిమానించాడు. నాగభూషణం దాసరికి దర్శకుణ్ణి చేస్తానని చెప్పి చాలా పని చేయించుకున్నాడు. చివరి నిమిషంలో వేరొకరిని పెట్టుకున్నాడు. దాసరి ఆ తర్వాత పెద్ద దర్శకుడయ్యి 150 సినిమాలు చేశాడు. వందల పాత్రలు రాశాడు. కాని దాసరి కలం నుంచి ఒక్క పాత్ర కూడా నాగభూషణం కోసం సృజించబడలేదు. దాసరి సినిమాల్లో నాగభూషణం ఎప్పుడూ లేడు.

రామానాయుడు అవకాశం ఇస్తే ఎంతో కష్టం మీద 'ప్రేమఖైదీ' సినిమాకు దర్శకత్వం వహించాడు ఇ.వి.వి.సత్యనారాయణ. అప్పటికి అతని మొదటి సినిమా ఫ్లాప్. ఈ సినిమా కూడా పోతే భవిష్యత్తు లేదు. ఫస్ట్ కాపీ చూసిన పరుచూరి బ్రదర్స్ ఏ మూడ్‌లో ఉన్నారో 'మా స్క్రిప్ట్‌ను చెడగొట్టినట్టున్నాడే' అనే అర్థంలో రామానాయుడు దగ్గర హడావిడి చేశారు. వారు స్టార్‌రైటర్స్. వారి మాట మీద రామానాయుడుకు గురి. ఇ.వి.వి హడలిపోయాడు. స్క్రిప్ట్‌ను తన బుర్రతో ఆలోచించి మెరుగుపెట్టి తీస్తే ఇలా అంటారేమిటి అని సిగరెట్లు తెగ కాల్చాడు. సినిమాను మూలపడేస్తే ఇంతే సంగతులే అని కుంగిపోయాడు. కాని సినిమా రిలీజయ్యి సూపర్ హిట్ అయ్యింది. ఆ తర్వాత 51 సినిమాలు తీశాడు ఇ.వి.వి. ఒక్కదానికీ గురు సమానులైన పరుచూరి సోదరుల స్క్రిప్ట్ వాడాలనుకోలేదు.

బాగా చనువుగా, ఆత్మీయంగా ఉండే మనుషుల పట్ల కొందరికి హఠాత్తుగా చిన్నచూపు వస్తుంది. ఆ.. ఏముందిలే అనుకోబుద్ధవుతుంది. వారితో మనం ఎలా వ్యవహరించినా చెల్లుబాటవుతుందిలే అనిపిస్తుంది. వారితో చెప్పకుండా ఫలానా పని చేద్దాం... శుభలేఖ ఆఖరున పంపుదాం... కష్టంలో ఉన్నారని తెలిసినా చూసీ చూడనట్టు ఉందాం... ఇచ్చిన మాటను తేలిగ్గా తీసుకుందాం... వారి వీపు మీద విస్తరి పరిచి భోం చేద్దాం... అనుకుంటే ఆ క్షణంలో ఆ సదరు వారు మనం చెప్పింది విన్నట్టుగా కనపడతారు. నవ్వుతున్నట్టే ఉంటారు. కాని వారి లోపల మనసు చిట్లుతున్న చప్పుడు మన చెవిన పడకుండా జాగ్రత్త పడతారు. ఆ తర్వాత వారు మనకు కనిపించరు. జారిపోతారు. చేజారిపోతారు.

మనుషులు చేజారితే ఏమవుతుంది? వారితో మాత్రమే సాధ్యమయ్యే జీవన సందర్భాలన్నీ నాశనమవుతాయి. వారితో నిర్మించుకున్న గతం తుడిచిపెట్టుకుపోతుంది. వారితో వీలైన భవిష్యత్తు నష్టమవుతుంది. ఉంటే బాగుండు అనుకునే క్షణాల్లో వారు ఉండరు. డబ్బు, దస్కం, పలుకుబడి, క్షమాపణ ఏదీ వారిని మళ్లీ వెనక్కు తీసుకురాదు.

హాయ్, హలో బాపతు సవాలక్ష దొరుకుతారు. ఈ నిజమైన ఆత్మీయులను కాపాడుకుంటున్నారా? అసలు మీరెంత మందిని చేజార్చుకున్నారో ఎప్పుడైనా లెక్క చూసుకున్నారా?

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.2.03 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి రా.12.07 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ప.12.44 నుండి 2.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** రా.9.49 నుండి 12.21 వరకు

సూర్యోదయం: 5.53
సూర్యాస్తమయం: 5.51
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

భారత్ తప్పించుకోగలదా?

కామెంట్



కరణ్ థాపర్

ఖలిస్థానీ సానుభూతిపరుడు, నిషేధిత 'ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్' నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణ అత్యంత వివాదాస్పదం అయింది. ఈ ఏడాది జూన్‌లో కెనడాలోని బ్రిటిష్ కొలంబియా సర్రే ప్రాంతంలోని ఓ గురుద్వారా సాహిబ్ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు నిజ్జర్‌ని కాల్చి చంపిన నేపథ్యంలో... భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో ఉన్న నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉండొచ్చనేందుకు 'విశ్వసనీయమైన ఆరోపణలు' ఉన్నాయని ట్రూడో గత నెలలో తమ పార్లమెంటులో ప్రకటించారు. దరిమిలా ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్రమంగా దెబ్బతింటూ వచ్చాయి. ఈ పరిణామాలను అమెరికాపై దృష్టిని కేంద్రీకరించి చూడవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఆ దేశ స్పందన మనకు అత్యంత కీలకం కాబట్టి!

జస్టిస్ ట్రూడో (కెనడా ప్రధానమంత్రి) ఆరోపణలపై మన ప్రభుత్వ ప్రతిస్పందనను నేను విశ్వసిస్తున్నప్పటికీ, ఒక జర్నలిస్టుగా కొన్ని ప్రత్యేకమైన వాస్తవాలను కూడా మన మది పరిగణనలోకి తీసుకోవాలేమోనని నా ఆలోచన. అయితే ఆ వాస్తవాలు అవసరమైనంత మేరకైనా నివేదనకు వచ్చాయని నేను అనుకోవడం లేదు. కొన్నిసార్లు అవి ఉద్దేశపూర్వకమైన విస్మరణకు కూడా గురయ్యాయి. అందువల్ల వాటిని మీ దృష్టికి తీసుకురావడం నా కర్తవ్యంగా భావిస్తూ, ముగింపును మాత్రం మీకే వదిలేస్తున్నాను. నా వ్యక్తిగత అభిప్రాయంతో మిమ్మల్ని ప్రభావితం చేయడం నాకు ఇష్టం లేదు.

మొదటిది– ఢిల్లీలో జరిగిన జీ–20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఈ ఆరోపణలను లేవనెత్తి "ఆందోళన వ్యక్తం చేసినట్లు" 'ఫైనాన్షియల్ టైమ్స్' రాసింది. యూఎస్‌ఏ జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్ "అత్యున్నత స్థాయిల్లో ఈ అంశంపై చర్చ జరిగింది," అని చెప్పినప్పుడే ఆయన ఈ "ఆందోళన వ్యక్తం అవడాన్ని" ధ్రువీకరించి ఉండొచ్చు. భారత్‌పై కెనడా చేసిన ఈ ఆరోపణలను బైడెన్ ఎలా చూస్తున్నారన్న విషయమై ఇది మనకు ఏం చెబుతోంది?



గట్టి సాక్ష్యాలు ఉన్నాయా?

రెండవది– కెనడాలోని అమెరికన్ రాయబారి ఒకటీ లేదా అంతకన్నా ఎక్కువ 'పంచనేత్ర నిఘా కూటమి దేశాలు' (ఫైవ్–ఐస్ కంట్రీస్: యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా) రహస్య సమాచారాన్ని ఒట్టావా (కెనడా రాజధాని)తో పంచుకున్నట్లు రూఢి పరిచారు. వాటిలో ఒక దేశం యూఎస్‌ఏ అని 'న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది. ఆ పత్రిక ఇంకా ఇలా రాసింది: "చూస్తుంటే కెనడా దగ్గర 'పొగలు గక్కే తుపాకీ' (వివాదానికి తావులేని సాక్ష్యం) ఉన్నట్టు కనబడుతోంది. ఆ దేశంలోని భారతీయ దౌత్యవేత్తల సమాచార వ్యవస్థలోకి చొరబడటం అన్నది పన్నాగంలో (వారికి) ప్రమేయం ఉందన్న సంకేతాలను ఇస్తోంది." ఈ చొరబాట్లు ఏం చెబుతున్నాయి? అవి నిజంగానే పొగలు గక్కుతున్న తుపాకీతో సమానమైనవా?

మూడవది – ఆరంభంలో జేక్ సల్లివాన్, ఆ మర్నాడు యూఎస్ విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్: "మేమే మా కెనడియన్ సహోద్యోగులతో చాలా దగ్గరగా సంప్రదింపులు జరుపుతున్నాం. కేవలం సంప్రదింపులు మాత్రమే కాదు, ఈ అంశంపై వారితో సమన్వయం చేసుకుంటున్నాం" అని ప్రకటించారు. అంటే ఏమిటి? కెనడా దగ్గర ఉన్న సమాచారం ఎలాంటిదో మాత్రమే కాదు, అందులోని నాణ్యత ఎంతటిదో కూడా వాషింగ్టన్‌కు అవగాహన ఉందని ఇది సూచిస్తోందా?

నాల్గవది – ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బ్లింకెన్, "ఈ పరిశోధనలో కెనడాతో కలిసి ఇండియా పని చేయడం చాలా ముఖ్యం. దీనికి బాధ్యులెవరో చూడాలనుకుంటున్నాం. దర్యాప్తు దానికై అదే జరిగి, ఫలితం వైపునకు దారి తీయాలి" అన్నారు. ఆయన అలా అన్నది ఒక పత్రికా సమావేశంలో అయినప్పటికీ అది న్యూఢిల్లీకి ఒక సందేశం అనుకోవాలా?

ఐదవది – "ఇలాంటి చర్యలకు మీకు కొన్ని ప్రత్యేకమైన మినహాయింపులేమీ ఉండవు. దేశంతో నిమిత్తం లేకుండా మేము గట్టిగా నిలబడి, మా ప్రాథమిక సూత్రాలను కాపాడుకుంటాం" అని సల్లివాన్ అనడం చూస్తుంటే, దానిని మనం ఎలా అర్థం చేసుకోవాలి?

ఎవరిది అబద్ధం?

ఆరవది–కెనడా జాతీయ భద్రతా సలహాదారు జోడీ థామస్... కెనడా ఇంటెలిజెన్స్ సర్వీసెస్ హెడ్‌తో కలిసి ఆగస్టులో నాలుగు రోజులు, సెప్టెంబరులో ఐదు లేదా ఆరు రోజులు ఢిల్లీలో ఉండి, భారత నిఘా సంస్థలకు సమాచారం అందించినట్లు కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వెల్లడించింది. అయితే భారత ప్రతినిధి మాత్రం... 'కెనడా అప్పుడు గానీ, ఇప్పుడుగానీ, ఎప్పుడూ గానీ తమతో ఎటువంటి నిర్దిష్ట సమాచారాన్ని పంచుకోలేదు" అని పేర్కొన్నారు. మరి అలాంటి సమాచారం ఏదీ లేకుంటే జోడీ థామస్ భారత దేశంలో పది రోజుల పాటు ఎందుకు గడిపినట్లు?

ఏడవది– మన భారత ప్రతినిధి అరిందమ్ బాగ్చి కెనడాను... "ఉగ్రవాదులకు, తీవ్రవాదులకు, వ్యవస్థీకృత నేరాలకు సురక్షితమైన స్వర్గధామం" అని పేర్కొన్నారు. ఆ మాటలు సాధారణంగా పాకిస్తాన్‌ను ఉద్దేశించి వాడుతుంటారు. అలాంటిది తమ నాటో మిత్రపక్షం, జీ–7 సభ్య దేశం, మరీ ముఖ్యంగా సన్నిహిత, సాంస్కృతిక పరిచయాలు కలిగిన తమ పొరుగు దేశం అయిన కెనడా గురించి ఇండియా అలా అనడాన్ని అమెరికా ఎలా చూస్తుంది?

అమెరికా వైఖరి కీలకం

ఎనిమిదవది– అట్లాంటిక్‌కు ఇరు వైపులా ఉన్న అనేక ఆంగ్ల భాషా వార్తాపత్రికలు భారతదేశం ఇలా ఎలా మారిందీ అని ప్రశ్నల్ని లేవదీశాయి. ఉదాహరణకు, 'ది అబ్జర్వర్' పత్రిక "స్వదేశంలో, విదేశాలలో మోదీ ప్రభుత్వ విధానం ప్రజా స్వామ్యం పట్ల ఆ దేశ నిబద్ధత, భాగస్వామ్య దేశంగా తన విశ్వసనీయతల పైన సందేహాలను లేవనెత్తుతోంది" అని రాసింది. 'న్యూయార్క్ టైమ్స్' కాలమిస్ట్ నికోలస్ క్రిస్టోఫ్ పాకిస్తాన్ పాలకుడు జనరల్ జియాతో మోదీని పోల్చారు. 'ది ఎకనామిస్ట్' నిర్మొహమాటంగా "ఇది కఠిన నిర్ణయాలు తీసుకోవలసిన సమయం" అని పేర్కొంది. మన దేశం గురించి ఇలాంటి వ్యాఖ్యలన్నిటికీ మనం ఎలా స్పందించాలి?

చివరిగా– ఒక అధికారిక ప్రకటనలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ట్రూడో ఆరోపణలను "పూర్తిగా తిరస్కరించింది". వాటిని "అసంబద్ధము, ప్రేరణపూరితమూ అయినవి"గా పేర్కొంది. బైడెన్ గురించి మనకు తెలిసిన దానిని బట్టి... అలాగే సల్లివాన్, బ్లింకెన్‌ల ప్రకటనలను బట్టి చూస్తే అమెరికా ఈ ప్రతిస్పందనను అంగీకరిస్తుందని అనుకోవచ్చా?

ఇప్పుడు నేను అమెరికా పైననే నా దృష్టిని కేంద్రీకరించాను. ఎందుకంటే ఆ దేశ ప్రతిస్పందన చాలా ముఖ్యమైనది. భారత్ కేవలం ఆరోపణలను మాత్రమే ఎదుర్కొంటుండగా, బ్లింకెన్ అంటున్న 'అంతర్జాతీయ అణచివేత'లో దోషి కచ్చితంగా అమెరికానే అని నాకు తెలుసు. అయినప్పటికీ అమెరికా దీని నుంచి పదే పదే తప్పించుకుంటూ వచ్చింది. భారత్ కూడా అలా తనపై వచ్చిన ఆరోపణల నుంచి తప్పించుకోగల స్థితిలో ఉందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మైండ్‌సెట్ మారాలి!



ప్రారంభం నుంచీ ఇస్లాం పేరు మీదుగా ముస్లింలను ముస్లింలే చంపుకుంటూ వస్తున్నారు. అయినప్పటికీ (సుమారు 60 మంది ప్రాణాలు తీసిన) మస్తుంగ్ బాంబు పేలుళ్లు సహా ముస్లింలు అలాంటి తీవ్రవాద చర్యలకు పాల్పడరనే దగ్గరే పాకిస్తానీ మేధావులు ఆగిపోయారు. పాకిస్తాన్ రాజ్య ప్రాయోజిత మదరసాల్లోని బోధనలే అలాంటి జిహాదీ తీవ్రవాదానికి ఆజ్యం పోస్తున్నాయని మనం అంగీకరించేంత వరకూ మార్పు రాదు.

– తాహా సిద్ధిఖీ, పాకిస్తాన్ జర్నలిస్ట్

పారని పాచిక



ఎన్నికల్లో పెద్ద ప్రభావం ఉండదని తెలిసినా మోదీ మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చారనీ, ఆయన సంస్కర్త అనీ చెప్పేవాళ్లు దయచేసి మోదీ అలా అనుకోవడం లేదని గమనించండి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ర్యాలీల్లో దాన్ని తరచుగా ప్రస్తావిస్తున్నారు. మహిళల ఓట్ల కోసం ఆ బిల్లును తేవాలన్న ఆలోచన ఆయనకు ఉంది. కాకపోతే ఆయన ఎక్కడ పొరబడ్డారంటే, ఆ అంశం మీద ఓట్లు వేసే మహిళలు స్వల్పం.

– శాశ్వతీ సర్కార్, ప్రొఫెసర్

ఏది ప్రాధాన్యం?



బీజేపీ అధికారంలోకి వచ్చాక దేవుళ్లు, నాయకుల స్మారకంగా నూరు అడుగుల కంటే ఎత్తయిన 15 కంటే ఎక్కువ విగ్రహాలు పూర్తయినాయి. వీటిల్లో చాలావాటికి రూ. 2 వేల కోట్ల కంటే ఎక్కువ ఖర్చయింది. ఇంకా డజన్ల కొద్దీ తయారీలో ఉన్నాయి. ఇదే సొమ్ముతో వారి గౌరవంగా ఆసుపత్రులు నిర్మిస్తే సముచితంగా ఉండదా?

– థామస్ ఐజాక్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

చూసి నేర్చుకోండి!



శ్రీలంకలో చిన్న ట్రిప్ ముగించు కుని వచ్చాను. అసలు రాజధాని కొలంబో నుంచి మొదలుపెట్టి చిన్న గ్రామాల వరకు అన్ని ప్రాంతాలు ఎంత నీటుగా ఉన్నాయో ఆశ్చర్యం వేసింది. జనాలకు సివిక్ సెన్స్ అపారం. ముంబయి లాగే వేడీ, వర్షాలున్నాయి. అయినా తారు (కాంక్రీట్ కాదు) రోడ్లు చక్కగా ఉన్నాయి. రోడ్లు వేయడం, నిర్వహించడాన్ని మన మున్సిపల్ కార్పొరేషన్లు లంకేయులకు ఔట్‌సోర్సింగ్ ఇవ్వడం మేలు.

– అతుల్ కస్బేకర్, ఫొటోగ్రాఫర్

తక్షణ న్యాయం



పదేళ్లుగా నా స్నేహితురాలు చట్టబద్ధంగా అన్ని విధాలుగా ప్రయత్నించింది. అయినప్పటికీ ఆమె గ్రీన్ కార్డ్ (యూఎస్‌లో శాశ్వత నివాసితులకు ఇచ్చే కార్డు) ఇంకా పునర్విచారణలోనే ఉంది. దీనికి బదులుగా ఆమెను మెక్సికో వెళ్లి నదిని ఈదుకుంటూ రమ్మని సలహా ఇస్తాను. తక్షణం లీగల్ స్టేటస్ వచ్చేస్తుంది.

– మయీ మస్క్, రచయిత్రి

తెలుసుకుని తాగండి



పూర్తిగా తాగకూడని పానీయాలు: చక్కెరతో తీపి చేసిన డ్రింకులు (సాఫ్ట్ డ్రింక్స్), ప్యాకేజ్డ్ పళ్ల రసాలు, మద్యం. చూసుకుని తాగాల్సినవి: తాజా పళ్ల రసం (పళ్లు తినడం ఇంకా నయం), డైట్ సాఫ్ట్ డ్రింక్స్. సురక్షితం: నీళ్లు, కొబ్బరి నీళ్లు, టీ (గ్రీన్ టీ, బ్లాక్ టీ సహా), కాఫీ (బ్లాక్ కాఫీ సహా), నిమ్మకాయ నీళ్లు.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

ఇన్ బాక్స్

మహాత్ముడి అవసరం పెరిగింది

గాంధీజీ ఆలోచనలు, భావాలు, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయి. తన సిద్ధాంత బలంతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఓడించి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చారు. ఆయన పోరాట పంథా వినూత్నమైనది. అహింస అనే ఆయుధంతో, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి పోరాట రూపాలతో ఆయన యుద్ధం చేశారు. 'క్విట్ ఇండియా' ఉద్యమంలో గాంధీ ఇచ్చిన నినాదం 'డూ ఆర్ డై' ఎంద రినో ఉత్తేజితులను చేసింది. 'విజయమో, వీర స్వర్గమో' అనే నినాదంతో



యావత్ దేశ ప్రజలు ముందుకురికి భారత గడ్డ మీద నుంచి బ్రిటిష్ వారిని తరిమేశారు. మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. స్వాతంత్ర్యం సిద్ధించి సంవత్సరం తిరగకుండానే 1948 జనవరి 30న ఆయన హత్యకు గురై దేశాన్ని శోకసంద్రంలో ముంచారు. ఆయన ఘనత ప్రపంచ మంతా గుర్తించింది. అయితే భారతదేశంలో ఆయన్ని మెల్లగా మరచిపోతున్న ధోరణి కనిపించడం బాధాకరం. గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన ఆశ యాలు, సిద్ధాంతాలను మరోసారి గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. 'అర్ధరాత్రి ఒంటరిగా ఆడవాళ్లు ఎప్పుడైతే క్షేమంగా వెళతారో ఆరోజే నా దేశానికి నిజమైన స్వాతంత్ర్యం' అని ప్రకటించారు గాంధీ.

గాంధీ సహించనివి– మగువలపై అత్యాచారాలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, హత్యలు, కక్షలు, వైషమ్యాలు. కానీ ఇవే ఎక్కువైన ఈ సమాజంలో ఆయన ఆదర్శం గాలికి కొట్టుకుపోయిందని చెప్పక తప్పదు. మతసామరస్యాన్ని ఆయన ప్రగాఢంగా వాంఛించారు. కానీ ఇవాళ మత అసహనం పెచ్చరిల్లుతోంది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నవారిని వెంటాడి చంపేసే దృశ్యాలు అనేకం చూస్తున్నాం. నేడు అంతటా, అన్ని రంగాలలో అవినీతి పెచ్చరిల్లింది. గాంధీజీ స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉండాలని కోరుకున్నారు. ముఖ్యంగా గ్రామాలు స్వయం పోషకత్వం సాధించి ఏ గ్రామానికది 'స్వరాజ్యం'గా అభివృద్ధి చెందాలనుకున్నారు. మరి ఆయన కలలను మన పాలకులు ఎంతవరకు నెరవేర్చారో సమీక్షించుకోవాలి.

– కనుమ ఎల్లారెడ్డి, పౌరశాస్త్ర అధ్యాపకులు, తాడిపత్రి | 93915 23027

ప్రకృతి సమతౌల్యానికి సంరక్షణ!

తమిళనాడులో నలభై రోజుల్లో 10 పులులు మరణించాయనే తాజా వార్త దేశంలో పులుల సంరక్షణపై మరోసారి చర్చను రేకెత్తిస్తోంది. ఇటీవల బాంబే హైకోర్టు 'గోవా బెంచ్' ముందుకు వచ్చిన ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని న్యాయమూర్తులు విచారిస్తూ... స్వాతంత్ర్యం సిద్ధించిన నాటికి దేశంలో 40 వేల పులులు అరణ్యంలో స్వేచ్ఛగా విహరించేవనీ, ఈ 76 ఏళ్లలో వాటి సంఖ్య 92 శాతం తగ్గిందనీ ప్రకటించడం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రస్తుతం వ్యాఘ్రాల సంఖ్య ఆశాజనకంగా వృద్ధి చెందుతున్నా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బెంచ్ హితబోధ చేయడం గమనార్హం. అడవి లేకపోతే పులి లేదనీ, పులి లేకపోతే అడవి లేదనీ, రెండూ పరస్పరం సంరక్షించుకొనే ధోరణిలో ఉంటాయనీ కోర్టు గుర్తు చేసింది.

1947 నాటి నుంచి దేశ వ్యాప్తంగా ఉన్న అభయారణ్యాల్లో పులులు తగ్గడానికి చాలా కారణాలు ఉన్నాయి. విపరీతంగా అడవుల నరికివేత, పటిష్ఠమైన రక్షణ సిబ్బంది లేకపోవడం, వ్యాఘ్రాల అవయవాలకు విదేశాల్లో గిరాకీ ఉండడంతో ఎక్కువ మొత్తంలో వేటకు గురయ్యాయి. అడవుల్లో గడ్డి భూములు తగ్గడంతో జింకలు, అడవి పందులు వంటి పులి వేటాడే జంతువులు నానాటికీ కనుమరుగై పోతున్నాయి. దీంతో పులులకు ఆహారం దొరక్క ఆ జాతి క్షీణిస్తోంది.

భారతదేశంలో 54 పులి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వాటిలో నడవాలు (కారిడార్) కీలకం. పులులు వాటి పరిధిని దాటి బయటికి వచ్చి విహరించే ప్రదేశాలను నడవాలు అంటారు. ముఖ్యంగా సంతానోత్పత్తి కోసం పులులు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఈ క్రమంలో వాటికి మానవాళి నుంచి ప్రమాదం పొంచి ఉండే ఆస్కారం ఉంది. గత మూడు దశాబ్దాలుగా ఈ కారిడార్ల నిర్వహణ పకడ్బందీగా కొనసాగుతోంది. వేటగాళ్ళ బారి నుంచి వ్యాఘ్రాలను రక్షించేందుకు అటవీ అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. కొండలు, కోనల్లో నివసించే ఆదివాసీ బిడ్డలకు పులితో సావాసం ఎక్కువ ఉంటుంది. అందుకే 'టైగర్ కేర్ టేకర్స్'గా వారిని ఎంచుకొని ప్రభుత్వాలు 'ప్రాజెక్ట్ టైగర్' లక్ష్యాలను అందుకున్నాయి. అడవిపైనే ఆధారపడిన ఆదివాసీ తెగలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తూ పులి సహజ విహారానికి భంగం కలగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అభివృద్ధి పేరుతో అడవులను నిర్మూలించే ధోరణికి చరమగీతం పాడేందుకు ప్రభుత్వం 'అటవీ సంరక్షణ చట్టం–1980' తీసుకొచ్చింది. దీన్ని కొన్నేళ్ళుగా పటిష్ఠంగా అమలు చేస్తున్నారు. ఫలితంగా నిపుణులు సైతం ఊహించని రీతిలో పులులు తమ సంఖ్యను వృద్ధి చేసుకుంటున్నాయి.



దేశంలో నివాసయోగ్యత ఉన్నప్పటికీ అనేక రక్షిత ప్రాంతాలు పులులు లేకుండానే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా అడవుల్లో మౌలిక వసతుల కల్పన, సిబ్బందిని నియమించడం తదితర చర్యలు చేపట్టాలి.' రణథంబోర్ టైగర్ రిజర్వ్' – రాజస్థాన్, 'బాంధవ్‌గర్' – మధ్యప్రదేశ్, 'సుందర్బన్స్' – పశ్చిమ బెంగాల్, 'సరిస్కా' – రాజస్థాన్, 'జిమ్ కార్బెట్ పార్క్' – ఉత్తరాఖండ్, 'కన్హా'– మధ్యప్రదేశ్ సంరక్షణా కేంద్రాల్లో ఎక్కువ మొత్తంలో వ్యాఘ్రాలు విస్తరించాయి. ప్రపంచంలో ఎక్కడా ఈ స్థాయిలో పులి ఆవాసం ఉన్న దేశం లేదు.


పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు పులుల ప్రాధాన్యాన్ని వివరించాలి. అడవులు, పులులు ఇతర వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని సామాన్యులకు అవగతం అయ్యేలా చర్యలు చేపట్టినప్పుడే మళ్లీ పులులతో మన అడవులు కళకళలాడుతాయి.

– రాహుల్. జి

దేవుడెందుకు కనబడడు?

ఇన్ని ప్రాణులను సృష్టి చేసి, ఆ ప్రాణులకు ఇన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిన భగవంతుడు, ఆ ప్రాణులకు అప్పుడప్పుడన్నా దర్శనం ఇవ్వవచ్చు కదా? ఎందుకు కనిపించకుండా అదృశ్యంగా ఉంటాడు? ఈ ప్రశ్నకు వేదాంతులు వివిధ కోణాల నుంచి సమాధానం చెప్పడం కనిపిస్తుంది. ఒకటి – కంటికి కనిపించేందుకు ఆయనకు మన లాగా ఆకారం, నామ రూపాలు లేవు. భగవత్తత్వం నిరాకారం, అవ్యక్తం.

రెండు – ఆ భగవత్తత్వం సర్వ వ్యాపి. కానీ జగత్తు రూపంలో ఉంటుంది. అది సర్వాంతర్యామి. అందరిలోనూ ఉంటుంది. హృదయ గుహలో వెలుగుతుంటుంది కానీ, జీవుడి అవిద్య అనే ముసుగులో కప్పబడి ఉంటుంది. జగత్తంతా తానుగా వ్యాపించి ఉన్న భగవంతుడిని చూడగల జ్ఞానికి ఆయన సర్వత్రా కనిపిస్తాడు. అంతర్ముఖులై ఏకాగ్ర చిత్తంతో ధ్యానించే యోగులకు వాళ్ళలోనే కనిపిస్తాడు. ఆయన కనిపించక పోవడం అనేది లేదు. మనం సరిగా తదేకంగా చూడలేకపోవడమే!



జ్యోతిర్మయం

మూడు – సర్వత్రా పరచుకొని ఉన్న భగవంతుడు అనే ఏకత్వాన్ని మనం చూడలేక పోవడానికి కారణం మనకున్న 'అహం'కారం అనే లక్షణం. (ఇది 'నేను గొప్ప' అన్న భావనను సూచించే 'అహంకారం' కాదు). ఉన్నది బ్రహ్మమొక్కటే అయినా, 'నేను వేరు'– 'నేను కానిది వేరు' అన్న భావన కలిగించే భ్రాంతి జనితమైన, జీవ సామాన్యమైన లక్షణం. అహంకారం అనే ఈ 'మాయ'దారి లక్షణం కరిగిపోతేనే భగవత్తత్వం అనుభవమౌతుంది. అప్పుడు ఉండేదంతా బ్రహ్మమొక్కటే. 'నేనూ', 'నువ్వు', 'వాడు', 'స్వ'– 'పర', ఇలాంటి భేదాల అనుభవమే ఉండదు. ఏ భేదాలూ లేని సర్వైక్యతా స్థితి అనుభవమవుతుంది. అప్పుడు 'సర్వం బ్రహ్మ మయమ్'. అది మోక్ష స్థితి. బంధ రహిత స్థితి. దుఃఖ రహిత స్థితి. పరమ శాంత స్థితి. నిర్వాణ స్థితి.

ఈ అహంకారం ఈశ్వర మాయాజనితం. దీనితో ఉన్నప్పుడు 'నేను, 'నేను' అనే ఈ గుర్తింపు కోల్పోవడం అన్న భావననే భరించలేను. గ్రహించలేను. అందుకు నాకు మనసొప్పదు'... వైరాగ్య, అభ్యాసాల ద్వారా ఈ అహంకారాన్ని వదలగలిగిన ఘనులు... 'ఉన్నది బ్రహ్మమొక్కటే' అన్న సర్వైక్యతాస్థితిని అనుభవించగలుగుతారు. వాళ్ళకూ భగవంతుడు 'కనబడడు'. వాళ్ళే భగవంతుడిలో భాగమవుతారు!

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం కృషి చేస్తా

- డీజేహెచ్ఎస్ ప్రతినిధులకు సీఎస్ శాంతికుమారి హామీ



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) ప్రతినిధుల బృందం సచివాలయంలో శాంతికుమారితో సమావేశమైంది. ఈ సందర్భంగా డీజేహెచ్ఎస్ ప్రతినిధులు తమ సభ్యులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సీఎస్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీజేహెచ్ఎస్ అధ్యక్షుడు బొల్లోజు రవి మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల చిరకాల స్వప్నం సొంతిల్లు అని, ఈ కలను నిజం చేసే విశాల హృదయం ఈ ప్రభుత్వానికి మాత్రమే ఉందని అన్నారు. కాగా, డీజేహెచ్ఎస్ ప్రతినిధుల వినతిపై సీఎస్ స్పందిస్తూ.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల అంశం తన పరిశీలనలో ఉందని, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం చర్చించినప్పుడు డీజేహెచ్ఎస్ ప్రతిపాదనలను ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. సీఎస్‌ను కలిసిన వారిలో డీజేహెచ్ఎస్ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు దండా రామకృష్ణ, డి.కుమార్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగపదవుల్లో ఉన్నవారు పరిధి దాటుతున్నారు

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

హైదరాబాద్: రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు పరిధి దాటి వ్యవహరిస్తున్నారని.. ఇది మంచి సంప్రదాయం కాదని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగానికి లోబడి ఎవరి పరిధిలో వారు పనిచేస్తే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ- ప్రజల్లో అవగాహన'అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్, జ్యుడిషరీ, ఎగ్జిక్యూటివ్ రంగాల్లో ఒకరిపై ఒకరి పెత్తనం నేటికీ కొనసాగుతుందన్నారు. రాజ్యాంగాన్ని విధ్వంసం చేసుకునే హక్కు పార్లమెంట్‌కు లేదని, రాజ్యాంగం అనేది ఒక మూలసూత్రమని చెప్పారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే గురుతరమైన బాధ్యత న్యాయవ్యవస్థపై ఉందన్నారు. ఒడిశా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.మురళీధర్ 70 సంవత్సరాల్లో లౌకిక వ్యవస్థ గురించి రాజ్యాంగం, న్యాయవ్యవస్థల గురించి ప్రసంగించారు. ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ బార్ కమిటీ చైర్మన్ ఏ.నర్సింహ్మారెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి టి.రజని, రాజ్యసభసభ్యుడు జాన్ బ్రిటాస్, విద్యాసాగర్, పార్థసారథి పాల్గొన్నారు.

రాష్ట్ర సాంఘిక, సంక్షేమ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక


ప్రమోద్‌కుమార్


విద్యాసాగర్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర సాంఘిక, సంక్షేమ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అసోసియేషన్ ఆవిర్భావ సభ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బి.ప్రమోద్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా బి.విద్యాసాగర్, కోశాధికారిగా ఎస్.ఝాన్సీరాణి, ఉపాధ్యక్షులుగా జన్ను ప్రమోద్‌కుమార్, ఎ.మధునాయక్.. జాయింట్ సెక్రెటరీలుగా జీఎస్ రవీందర్, నరేశ్‌కుమార్, శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా శ్రీకాంత్, పరిమళ శ్రీనివాస్.. మహిళా ప్రతినిధులుగా స్నేహలత, కె.వినయకళ.. కార్యవర్గ సభ్యులుగా బొట్ల ఆంజనేయులు, అంతేశ్వర్, దానయ్య ఎన్నికయ్యారు.

తొమ్మిదేళ్ల కల తీరేలా..!

- ములుగులో యూనివర్సిటీతో గిరిజన విద్యార్థులకు ప్రయోజనం
- ఏపీలోని ట్రైబల్ యూనివర్సిటీలో ఉన్న తరహాలోనే ఇక్కడా కోర్సులు
- పరిసర ప్రాంతాల్లో అభివృద్ధికి అవకాశం
- స్థలం కేటాయింపుపై కేంద్ర, రాష్ట్రాల మధ్య పేచీతో ఇన్నాళ్లూ జాప్యం


ట్రైబల్ యూనివర్శిటీకి కేటాయించిన భూమి

సాక్షి ప్రతినిధి, వరంగల్: ములుగు జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించడంతో సుమారు తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరపడింది. ఉమ్మడి ఏపీ విభజన సమయంలోనే.. ఏపీ, తెలంగాణలలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తామని అప్పటి యూపీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏపీలోని విజయనగరం జిల్లా మర్రివలసలో 2019లోనే సెంట్రల్ ట్రైబల్ వర్సిటీని స్థాపించారు. రాష్ట్రంలో మాత్రం వర్సిటీకి స్థలం విషయంలో పేచీతో ఇన్నాళ్లూ జాప్యం జరిగింది. ఇప్పటికైనా ఈ అంశంపై స్పష్టత రావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీ ఏర్పాటయ్యే పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, గిరిజనులకు విద్యావకాశాలు పెరుగుతాయని అంటున్నారు.

ఇన్నాళ్లూ లేఖలతోనే..

గిరిజన వర్సిటీ నిర్మాణానికి 500 ఎకరాల స్థలం కావాలని, అనుకూలమైన స్థలం ఉంటే వచ్చి పరిశీలిస్తామని 2016లోనే కేంద్ర ఉన్నత విద్యామండలి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో రాష్ట్ర రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి.. ములుగు జిల్లాలోని బండారుపల్లి శివార్లలో 335.4 ఎకరాలను సేకరించారు. 2017 ఫిబ్రవరిలో రాష్ట్రానికి వచ్చిన కేంద్ర అధికారులకు ఆ స్థలాన్ని చూపించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 2018 జనవరిలో సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి కేంద్ర మానవ వనరుల శాఖకి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కు అందించింది. తరగతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. హెచ్‌సీయూ 2019లో రాష్ట్ర ఉన్నత విద్యామండలిని సంప్రదించగా.. తాత్కాలికంగా తరగతుల ప్రారంభం కోసం ములుగు మండలంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో ఏర్పాట్లు చేస్తామని చెప్పింది. ఒకేచోట 500 ఎకరాల స్థలం సమకూర్చే వీలు లేకపోవడంతో ములుగు-జాకారం ప్రాంతంలోని మేడారం జాతర సమీపంలో గట్టమ్మ గుట్ట వద్ద 335 ఎకరాలను, పసర వద్ద 165 ఎకరాలను ఇస్తామని చెప్పింది. కానీ తరగతులు ప్రారంభించడానికి కనీసం 50 ఎకరాల స్థలంలో నిర్మాణాలు ఉండాలని.. అంతేగాకుండా వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమి మొత్తాన్ని ఒకేచోట కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ అంశాలపైనే కేంద్రం–రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఇన్నాళ్లూ పేచీ కొనసాగింది. అయితే ఇప్పుడు వర్సిటీని మంజూరు చేస్తున్నట్టు ప్రధాని ప్రకటించడంతో.. సదరు స్థలంలో అవసరమైన విద్యుత్, రోడ్లు, నీళ్లు వంటి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించాల్సి ఉండనుంది.

గిరిజనులకు రిజర్వేషన్లు ఎంతశాతం?

దేశవ్యాప్తంగా గిరిజనులకు 7.5శాతం రిజర్వేషన్ అమల్లో ఉండగా.. తెలంగాణలో 10శాతంగా ఉంది. మరి గిరిజన వర్సిటీలో గిరిజనులకు ఎంత మేర రిజర్వేషన్ ఇస్తారన్న దానిపై సందిగ్ధత నెలకొంది. సూపర్ న్యూమరరీ విధానంలో సీట్లు పెంచి అయినా గిరిజన విద్యార్థులకే ఎక్కువ సీట్లు కేటాయించాలన్న డిమాండ్ ఉంది.

ఏపీలో ఉన్నట్టుగానే..!

ఏపీలో ఇప్పటికే సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నడుస్తున్న నేపథ్యంలో.. అక్కడ అమలు చేస్తున్న కోర్సులనే ములుగు వర్సిటీలోనూ అమలు చేసే అవకాశం ఉందని యూజీసీకి చెందిన ఓ ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. సాధారణ కోర్సులతోపాటు ప్రత్యేకంగా గిరిజన కళలు, సంస్కృతిపైనా కోర్సులను అందుబాటులోకి తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

గిరిజనులకు ఎక్కువ సీట్లు ఇస్తేనే ప్రయోజనం



ఇన్నాళ్లకైనా గిరిజన వర్సిటీ ఇవ్వడం సంతోషకరం. కానీ దీనివల్ల గిరిజనులకు ఒరిగేదేమీ లేదు. గిరిజనుల పేరిట యూనివర్సిటీ పెట్టి వారికి కేవలం ఏడున్నర శాతం రిజర్వేషన్ ఇవ్వడమేంటి? అదేం గిరిజన యూనివర్సిటీ? ఇదేమిటని కేంద్రాన్ని అడిగితే యూజీసీ నిబంధనలు అంటున్నారు. అలాంటప్పుడు జనరల్ యూనివర్సిటీ పెట్టుకోండి అని చెప్పా.. గిరిజనులకు అత్యధికంగా సీట్లు ఇచ్చినప్పుడే అది గిరిజన వర్సిటీ అవుతుంది. దీనిపై కేంద్రమంత్రికి మళ్లీ లేఖరాస్తా.

– అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎంపీ, కేయూసీ రిటైర్డు ప్రొఫెసర్

రాజ్యాధికారమే బీసీల లక్ష్యం కావాలి

గౌడగర్జన సభలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

- పాపన్న పోరాట స్ఫూర్తితో చైతన్యమవ్వాలి
- బీసీలకు టికెట్లు ఇవ్వకుంటే బీఆర్ఎస్ కార్యాలయానికి తాళం వేస్తాం
- గాంధీ భవన్‌ను రెడ్డిభవన్‌గా మార్చుకోండి


సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కేయూ క్యాంపస్: ''అర శాతం, ఐదు శాతం ఉన్నవాళ్లు బహుజనులపై పెత్తనం చెలాయిస్తున్నారని, బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా.. సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో బీసీలు, గౌడన్నలు చైతన్యవంతం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం గౌడ సంఘాల ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం గ్రౌండ్‌లో నిర్వహించిన గౌడ గర్జన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు కూడా బహుజన కులాలకు జనాభా ప్రతిపాదికన సీట్లు కేటాయించడంలేదని, బీసీలను ఓటర్లుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. మన హక్కులను సాధించుకోవాలంటే ఎక్కువ శాతం వాటా ఉన్న బీసీలే అధికారంలోకి రావాలన్నారు. ఇందుకు రాబోయే రోజుల్లో ఓబీసీ పార్టీ కూడా అవసరమని అభిప్రాయపడ్డారు.

ఏ పార్టీ కూడా బీసీని సీఎం చేస్తామనడం లేదు

ఏ పార్టీ కూడా బీసీని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పటం లేదని శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేశారు. ''బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే 115 సీట్లు కేటాయించగా అందులో ఐదుశాతం ఉన్న రెడ్లకు 40 టికెట్లు ఇచ్చారు.. అర శాతం ఉన్న వెలమలకు 12 సీట్లు ఇచ్చారు.. ఈ లెక్కన బీసీలకు ఇచ్చింది తక్కువే. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్క గౌడ్‌కు కూడా టికెట్ ఇవ్వరు.. ఇంకా బీఆర్ఎస్ బీఫామ్‌లు ఇవ్వలేదు కాబట్టి జనాభా ప్రాతిపదికన బీసీలకు, గౌడలకు సీట్లు కేటాయించాలి.. లేని పక్షంలో లక్షమందితో హైదరాబాద్‌కు వచ్చి ఆ పార్టీ కార్యాలయానికి తాళం వేస్తాం'అని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కూడా రెడ్లకే ఎక్కువ సీట్లు ఇచ్చి బీసీలను విస్మరిస్తే గాంధీ భవన్‌కు తరలివస్తామన్నారు. గాంధీ భవన్‌ను రెడ్డిభవన్‌గా మార్చుకోవాలని ఎద్దేవాచేశారు. బీజేపీ సైతం అదేబాటలో ఉండబోతోందని, ప్రధాని నరేంద్ర మోదీ తాను ఓబీసీ అని చెప్పుకుంటున్నారే తప్ప ఓబీసీలకు ఒరగబెట్టిందేమి లేదని ఆయన విమర్శించారు. గౌడ సంఘాల జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ బైరి రవికృష్ణగౌడ్ అధ్యక్షతన ఈ సభలో తెలంగాణ గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్, బాధ్యులు కత్తి వెంకటస్వామి గౌడ్ పాల్గొన్నారు. తొలుత ఏకశిల పార్కు నుంచి గౌడలు ర్యాలీగా ఆడిటోరియం గ్రౌండ్‌కు చేరుకున్నారు.

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ కసిరెడ్డి రాజీనామా

- అదే బాటలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ ..
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో ఇరువురి భేటీ
- త్వరలోనే కాంగ్రెస్‌లో చేరిక!


రేవంత్‌ను కలిసిన కసిరెడ్డి, బాలాజీ సింగ్. చిత్రంలో మల్లు రవి, సంపత్‌కుమార్ తదితరులు

కల్వకుర్తి/ఆమనగల్లు/సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ కూడా బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు వీరు తమ రాజీనామా లేఖలను సీఎం కేసీఆర్‌కు పంపించినట్లు సమాచారం. ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీసింగ్ భేటీ అయ్యారు. కల్వకుర్తిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి మంత్రి హరీశ్‌రావు వచ్చిన రోజే వీరు పార్టీని వీడటం చర్చనీయాంశమైంది. ప్రజల అభీష్టం మేరకే పార్టీని వీడుతున్నామని వీరు చెప్పారు. నాలుగేళ్ల ఎమ్మెల్సీ పదవీకాలం ఉన్నా ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు, ఈ ప్రాంతానికి మేలు చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నానని కసిరెడ్డి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తనకు రెండు సార్లు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, అందుకు వారికి కృతజ్ఞతలు అని తెలిపారు. కాగా ఆయన ఒకట్రెండు రోజుల్లో ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ పార్టీ తరఫున కల్వకుర్తి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని చెపుతున్నారు.

ఫలించని బుజ్జగింపులు

ఇదిలా ఉండగా అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని బుజ్జగించడానికి బీఆర్ఎస్ ముఖ్యనేతలు పలుదఫాలు మంతనాలు జరిపారు. మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత మంత్రి కేటీఆర్ రెండుసార్లు ప్రగతి భవన్‌లో మంతనాలు జరిపినా బుజ్జగింపులు ఫలించలేదని చెపుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఇస్తారనే నమ్మకంతో ఆయన బీఆర్ఎస్‌ను వీడినట్లు సమాచారం. ఆదివారం రేవంత్‌రెడ్డితో జరిగిన భేటీలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నెరవేరలేదు: కసిరెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి తొమ్మిదేళ్లు అవుతున్నా లక్ష్యం నెరవేరలేదని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలన్న సంకల్పంతో సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని, ఇటీవల తుక్కుగూడ సభలో ఆమె ప్రకటించిన ఆరు గ్యారంటీలతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుందన్న నమ్మకం తనకు కలిగిందని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. సోనియా పిలుపుతో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని ఆ లేఖలో తెలిపిన కసిరెడ్డి.. బీఆర్ఎస్‌లో తనకు ఇచ్చిన అవకాశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

బడి బ్యాగు బరువు తగ్గించాలి!

▶ మొదటి పేజీ తరువాయి

బరువుతో పిల్లలు మెట్లు ఎక్కడం వల్ల సమస్య పెరుగుతోందని తెలిపింది. ఈ క్రమంలో బడి బ్యాగుల బరువు విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు కచ్చితమైన నిబంధనలు ఉండేలా చూడాలని సూచించింది.

ఐదేళ్ల నుంచి అడుగుతున్నా..

ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో స్కూల్ విద్యార్థులపై పుస్తకాల బరువు సమస్య తీవ్రంగా ఉందని ఈ అంశంపై అధ్యయనం చేసిన యశ్‌పాల్ కమిటీ గతంలోనే స్పష్టం చేసింది. చిన్నప్పట్నుంచే విద్యార్థులు అధిక బరువు మోయడం వల్ల కండరాలపై ఒత్తిడి పడి, భవిష్యత్‌లో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉందని మరి కొన్ని అధ్యయనాలు కూడా తేల్చాయి. ఈక్రమంలో పుస్తకాల బరువు తగ్గించే చర్యలు చేపట్టాలని కేంద్ర విద్యా శాఖ ఐదేళ్ల క్రితమే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు ఇచ్చింది. ఆ దిశగా కొన్ని మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. పిల్లలు మోసే పుస్తకాల బరువు వారి బరువు లో పది శాతానికి మించి ఉండకూడదని పే ర్కొంది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా కొంత కార్యాచరణ చేపట్టాయి. స్కూళ్లలో డిజిటల్ విధానం అమలు చేయాలని నిర్ణయించాయి. కా నీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ విద్యకు ప్రాధాన్యం, అవకాశాలు పెరిగాయి. విద్యా సంస్థలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది. హోంవర్క్ సహా కొన్ని రాత పనులను డిజిటల్ విధానంలోకి మార్చడం వల్ల బరువు తగ్గించే వీ లుందని పేర్కొంది. ఐదేళ్ల క్రితం ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో స్పందించలేదని.. ఇకనైనా ఆ దిశగా అడుగువేయాలని కేంద్ర విద్యాశాఖ తాజాగా అభిప్రాయపడింది.

బ్యాగు బరువు ఇలా ఉండాలి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. రెండో తరగతి విద్యార్థులకు 1.5 కిలోలు మాత్రమే పుస్తకాల బరువు ఉండాలి. 5 తరగతి వరకూ మూడు కేజీలు, 7వ తరగతి వరకు 4 కేజీలు, 9వ తరగతి వారికి 4.5 కేజీలు, పదో తరగతి వారికి 5 కేజీలకు మించి పుస్తకాల బరువు ఉండకూడదు. తెలంగాణ విద్యాశాఖ క్షేత్రస్థాయి పరిశీలన ప్రకారం.. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల పుస్తకాల బరువు 12 కేజీల వరకు, ఉన్నత పాఠశాల విద్యార్థుల పుస్తకాల బరువు 17 కేజీల వరకు ఉంటున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో ఐదో తరగతి చదివే విద్యార్థులు ఏకంగా 40 పుస్తకాలను మోయాల్సి వస్తోంది. పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, వర్క్‌షీట్స్, నోట్‌బుక్స్ ఇలా అనేకం బ్యాగులో కుక్కేస్తున్నారు. వీటికితోడు లంచ్ బాక్స్, నీళ్ల బాటిల్ కూడా కలసి పిల్లలపై భారం పడుతోంది. ప్రైవేటు స్కూళ్లు పుస్తకాల ముద్రణ సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాల కారణంగా ప్రతిదీ కొనాల్సిందేనని విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయి.

భారంపై రాష్ట్ర విద్యాశాఖ దృష్టి

పుస్తకాల బరువు తగ్గించే అంశంపై రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇటీవల చర్చించారు. ఈ అంశంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలు, కార్యాచరణను రూపొందించేందుకు అధికారులతో ఓ కమిటీ వేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులకు పుస్తకాల బరువు అధికంగా ఉంటోందని.. అలాంటి వాటిని కట్టడి చేయడంపై దృష్టి పెట్టాలని ఆలోచనకు వచ్చారు. దీనికి సంబంధించి ఇప్పటికే కసరత్తు మొదలైందని, అన్ని అంశాలను పరిశీలించి త్వరలోనే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇస్తామని విద్యాశాఖ అధికారి ఒకరు వెల్లడించారు.

80 సీట్లకు పైగా గెలుస్తాం: భట్టి



ఖమ్మం సహకారనగర్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకు పైగా గెలుస్తుందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తంచేశారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం పర్యటనలో మంత్రి కేటీఆర్ ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేశారని, తాము అంతకంటే రెట్టింపు సంఖ్యలో మాట్లాడగలం కానీ సభ్యత, సంస్కారం అడ్డు వస్తోందని అన్నారు. 155 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీపై వారంటీ లేదు, గ్యారంటీ లేదు అని కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి వల్లే కేటీఆర్ ఇక్కడకు రాగలిగారని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాలంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, అంతా ఐక్యంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లో ఉండి నిర్ణయాలు తీసుకోవడం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రకటించిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా.. నేతలు 'కారు'దిగిపోకుండా ఉండేందుకే బీఆర్ఎస్ ముందస్తుగా టికెట్లు ప్రకటించిందని, తమకు ఆ అవసరం లేదని సమాధానమిచ్చారు.

కాంగ్రెస్‌కు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గుడ్‌బై

- మెదక్ డీసీసీ పదవితోపాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా



మెదక్: మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఆదివారం గుడ్‌బై చెప్పారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఆయన మెదక్ టికెట్ ఆశించారు. కానీ ఈ స్థానం నుంచి మైనంపల్లి హన్మంతరావు తనయుడు రోహిత్‌కు టికెట్ దక్కే అవకాశం ఉండటంతో తిరుపతిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఓ లేఖను అధిష్టానానికి పంపారు. ప్రస్తుతం ఈ రాజీనామా లేఖ వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. పార్టీకోసం చేసిన సేవలు, త్యాగాలను గుర్తించకుండా అధిష్టానం కేవలం డబ్బు సంచులకు ప్రాధాన్యమిస్తూ టికెట్లు కేటాయిస్తోందని ఆయన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిగణనలోకి తీసుకోకుండా మౌనంగా ఉండటం తనకు బాధ కలిగించిందని తెలిపారు.

జానయ్యపై కేసుల వెనుక మంత్రి: ఆర్ఎస్పీ



నాంపల్లి (హైదరాబాద్): నల్లగొండ జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్, బీసీ నేత వట్టే జానయ్యపై బనాయించిన అక్రమ కేసుల వెనుక విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హస్తం ఉందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ (ఆర్ఎస్పీ) ఆరోపించారు. ఆదివారం ఏసీగార్డ్స్‌లోని రాష్ట్ర కార్యాలయంలో వట్టే జానయ్య యాదవ్ సతీమణి రేణుక, తల్లి ఐలమ్మ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి 500 మందితో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జానయ్య ఏమైనా కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భూములు అడిగారా? లేదా జగదీశ్వర్‌రెడ్డి విద్యుత్ కొనుగోలు కుంభకోణంలో వాటా అడిగారా? అని ఘాటుగా ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులను రాజకీయంగా ఎదగకుండా సీఎం కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు.

కాళ్లు మొక్కినా.. కనికరించలేదు

- కన్నతండ్రి కళ్లెదుటే కూతురి దారుణహత్య
- బంగారు నగల కోసం ఆటోడ్రైవర్ ఘాతుకం
- కరీంనగర్ జిల్లా తాడికల్‌లో ఘటన

శంకరపట్నం(మానకొండూరు): బంగారు నగలు కాజేయాలనే దురాశతో ఓ మహిళను కన్నతండ్రి కళ్లెదుటే ఆటోడ్రైవర్ దారుణంగా హత్య చేశాడు. తన బిడ్డను చంపవద్దని ఆమె తండ్రి కాళ్లు మొక్కినా ఆ కర్కోటకుడి మనసు కరగలేదు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ శివాలయంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లికి చెందిన గుండారపు ప్రమీల(55) ఆదివారం శంకరపట్నం మండలం అర్కండ్లలో ఉండే తన తండ్రి ఇజిగిరి కొమురయ్యను తీసుకుని మొలంగూర్‌లోని నాటువైద్యుడి వద్దకు బయలుదేరింది. మొలంగూర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రమీల, కొమురయ్యకు ఓ ఆటోడ్రైవర్ తారసపడ్డాడు. తాయిత్తులు కట్టే నాటువైద్యుడు ఊరెళ్లాడని, తనకు తెలిసిన మరో నాటువైద్యుడి వద్దకు తీసుకెళ్తానని మభ్యపెట్టి ఆటో ఎక్కించుకున్నాడు. మొలంగూర్ నుంచి తాడికల్ శివాలయానికి తీసుకొచ్చాడు. ఆటోడ్రైవర్ ఒక్కసారిగా మహిళపై కత్తితో దాడి చేశాడు. పక్కనే ఉన్న ప్రమీల తండ్రి కొమురయ్య డ్రైవర్ కాళ్లు పట్టుకుని తన బిడ్డను చంపవద్దంటూ వేడుకున్నా అతడు కరుణించలేదు. ప్రమీల రక్తపుమడుగులో కుప్పకూలి ప్రాణాలు వదిలింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి అక్కడికి చేరుకొని విచారించారు. మొలంగూర్‌లోని సీసీ పుటేజీలు పరిశీలించారు. క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. బంగారు నగల కోసమే మహిళను ఆటోడ్రైవర్ హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. హుజూరాబాద్, జమ్మికుంట సీఐలు రమేశ్, సంతోష్‌కుమార్‌లతో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కన్నతండ్రిపై కొడుకులు, కూతురు దాడి

- పనిమనిషిని చెట్టుకు కట్టేసి కొట్టిన వైనం
- వివాహేతర సంబంధమని అనుమానం..
- ములుగు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు, సుమలత, రోషమ్మ

ములుగు రూరల్: మానవత్వాన్ని మరచి కన్న తండ్రిపైనే కూతురు, అల్లుడు, కొడుకులు దాడి చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేటలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గోవిందరావుపేటకు చెందిన సండ్రగుండ్ల వెంకటేశ్వర్లు, సాంబలక్ష్మి దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. వెంకటేశ్వర్లు పస్రాలో కిరాణ వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కూతురు సిరికి వరంగల్‌కు చెందిన గద్దెల లక్ష్మీనారాయణతో వివాహం అయింది. కుమారులు ఇద్దరూ ఉద్యోగ రీత్యా హన్మకొండలో స్థిరపడ్డారు. కొంత కాలంగా ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో తల్లి సాంబలక్ష్మి కూతురు వద్దే ఉంటోంది. కొద్దిరోజుల తర్వాత తన భార్యను ఇంటికి పంపించాలని వెంకటేశ్వర్లు అల్లుడితో ఫోన్‌లో మాట్లాడగా, మాటామాటా పెరిగి, చివరకు ఈ విషయం సాంబలక్ష్మి తన భర్తకు విడాకులిస్తా.. అనే వరకు దారితీసింది. ఈ క్రమంలో సాంబలక్ష్మి భర్త వెంకటేశ్వర్లుపై గృహహింస చట్టం కింద కేసు పెట్టింది. అప్పటి నుంచి ఆమె ఇంటికి వెళ్లలేదు. దీంతో వెంకటేశ్వర్లు తన తల్లి రోషమ్మ (80) బాగోగులు చూసేందుకోసం ఖమ్మం జిల్లాకు చెందిన సుమలత అనే యాచకురాలిని నెల క్రితం పనికి ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయం తెలిసిన కుమారులు వివేక్, శ్రావణ్, అల్లుడు లక్ష్మీనారాయణ, కూతురు సిరి కలసి ఆదివారం వెంకటేశ్వర్లుపై దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగక నాన్నమ్మతోపాటు పని మనిషిని కూడా చితక బాదారు. పని మనిషిని చెట్టుకు కట్టేసి తల వెంట్రుకలను కత్తిరించి, చిత్రహింసలకు గురి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆమె గ్రామస్తుల సహకారంతో తప్పించుకుని ములుగు ఏరియా ఆస్పత్రికి చేరుకుంది. కాగా, వెంకటేశ్వర్లను కూడా స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. మనవళ్లు తన కొడుకును, తనను, పనిమనిషిని కొట్టారని వెంకటేశ్వర్లు తల్లి రోషమ్మ ఆస్పత్రిలో విలపిస్తూ చెప్పింది. ఇదిలా ఉండగా.. పని మనిషితో వెంకటేశ్వర్లు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే నెపంతో కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయడంతో దాడికి పాల్పడిన కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు.

ఒక తార పేలిన వేళ...



సూపర్ నోవా. అంతరిక్షంలో సంభవించే అతి పెద్ద పేలుడు. బహుశా బ్రహ్మాండంలో దీన్ని మించిన పేలుడు మరోటి ఉండదని చెబుతారు. నిజానికి సూపర్ నోవాలు సైంటిస్టులకు ఎప్పుడూ ఆసక్తికరమైన సబ్జెక్టే. నక్షత్రాల జీవిత కాలంలోని చివరి ఏడాదిలో మనకు ఇప్పటిదాకా తెలిసిన వాటికంటే చాలా ఎక్కువ విశేషాలే జరుగుతాయని వారిప్పుడు చెబుతున్నారు. ఆ సమయంలో అవి భారీ పరిమాణంలో ద్రవ్యరాశిని కోల్పోతాయయట.

- ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ సూపర్ నోవాపై జరిపిన అధ్యయనంలో ఈ విశేషం వెలుగులోకి వచ్చింది.
- అది దాని చివరి ఏడాదిలో ఏకంగా సూర్యునికి సమాన పరిమాణంలో ద్రవ్యరాశిని కోల్పోయిందట.
- నక్షత్రాలు తమ చివరి ఏడాదిలో మనకు ఇప్పటిదాకా తెలిసిన వాటికి మించి చాలా పరిణామాలకు లోనవుతాయని ఈ దృగ్విషయం తేటతెల్లం చేసింది.
- ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ ను జపాన్ కు చెందిన ఔత్సాహిక అంతరిక్ష శాస్త్రవేత్త కోయిచీ ఇటగాకీ 2023లో కనిపెట్టాడు.
- ఇది పిన్ వీల్ గెలాక్సీలో భూమికి దాదాపు 2 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.
- మిగతా సూపర్ నోవాలతో పోలిస్తే ఇది భూమికి అత్యంత సమీపంలో ఉంది. పైగా మనకు తెలిసిన వాటిలో అత్యంత నూతన నోవా కూడా ఇదే.
- ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ ను టైప్ 2, లేదా కోర్ కొలాప్స్ సూపర్ నోవా గా పిలుస్తారు. సూర్యుని కంటే 8 నుంచి 25 రెట్లు పెద్దవైన తారలు రెడ్ సూపర్ జెయింట్స్ గా మారి తమ బరువును తామే తాళలేక భారీ పేలుడుకు లోనవుతాయి.
- ఇలాంటి సూపర్ నోవాలు సంభవించగానే వాటి నుంచి అతి విస్తారమైన కాంతి పుంజాలు వెలువడతాయి.
- వాటి తాలూకు షాక్ వేవ్స్ సూపర్ నోవా ఆవలి అంచును చేరతాయి.
- కానీ ఎస్ఎన్2023ఐఎక్స్ఎఫ్ నుంచి వెలువడ్డ కాంతి పుంజాలు మాత్రం అలా దాని చివరి అంచును చేరలేదు.
- సదరు సూపర్ నోవా దాని చివరి సంవత్సరంలో తీవ్ర అస్థిరతకు లోనయిందని దీన్నిబట్టి తెలుస్తోందని సైంటిస్టులు వివరిస్తున్నారు.
- పేలుడుకు ముందు సదరు తార నిండా అతి దట్టమైన ద్రవ్యరాశి పరుచుకుని ఉందనేందుకు ఇది ప్రత్యక్ష ప్రమాణమని ఇటగాకీ వివరించారు.
- భారీ తారల ఆవిర్భావ, వికాసాలకు సంబంధించి ఇప్పటిదాకా విశ్వసిస్తున్న పలు కీలక సిద్ధాంతాలపై ఇది పలు ప్రశ్నలు లేవనెత్తిందని సైంటిస్టులు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కోర్టులో నామకరణం



కొచ్చి: ఆ.. పేరులో ఏముందిలే అని కొందరు అనుకుంటారు కానీ ఆ పేరు కూడా ఒక ప్రహసనంగా మారిందని కేరళలో జరిగిన ఒక ఘటన నిరూపించింది. కన్నబిడ్డకు పేరు పెట్టడంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయిన తల్లిదండ్రులు కోర్టుకెక్కడంతో మూడేళ్ల వయసున్న వారి కుమార్తెకు కేరళ హైకోర్టు పేరు పెట్టాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కేరళకి చెందిన దంపతులు విభేదాలతో విడి విడిగా ఉంటున్నారు. తల్లి సంరక్షణలో వారి మూడేళ్ల వయసున్న కుమార్తె ఉంటోంది. ఆ పాప బర్త్ సర్టిఫికెట్‌లో పేరు లేదు. ఆ తల్లి కూతురికి పేరు పెట్టి సర్టిఫికెట్‌లో చేర్చాలని సదరు అధికారుల్ని సంప్రదిస్తే తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి హాజరై పేరు చెబితే రిజిస్టర్ చేస్తామన్నారు. అప్పటికే విభేదాలతో దూరమైన దంపతులు పేరు విషయంలో కూడా రాజీకి రాలేకపోయారు. భార్య చెప్పిన పేరు భర్తకి, భర్త చెప్పిన పేరు భార్యకి నచ్చలేదు. కూతురు తన వద్దే ఉండడంతో తల్లి కోర్టుకెక్కింది. చివరికి కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బెచు కురియన్ థామస్ ఆ పాపకు పేరు పెట్టారు. పాప శ్రేయస్సు, తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, వారి సంస్కృతి, సామాజిక పరిస్థితులు అన్నీ పరిగణనలోకి తీసుకొని పేరు పెట్టినట్టు న్యాయమూర్తి వెల్లడించారు. కానీ ఏం పేరు పెట్టారో మాత్రం ఆయన బయటపెట్టలేదు.

కృష్ణ 'చక్రం'



సూర్యుని కంటే 650 కోట్ల రెట్లు పెద్ద కృష్ణబిలం!

వర్తులాకృతిలో గిరగిరా తిరుగుతున్న వైనం

కృష్ణ బిలాల అధ్యయనంలో కీలక మలుపు. గెలాక్సీ ఎం87లో ఉన్న అతి భారీ కృష్ణబిలం ఒకటి భూచక్రం మాదిరిగా వర్తులాకారంలో గిరగిరా తిరుగుతోంది. ఇది మనకు 5.5 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో కన్యా నక్షత్ర రాశిలో ఉంది. దీనికి సంబంధించి రెండు దశాబ్దాల పాటు సేకరించిన డేటాను అధ్యయనం చేసిన మీదట సైంటిస్టులకు ఈ విశేషం చిక్కింది. అందులో భాగంగా ఈ కృష్ణ బిలానికి సంబంధించి నాలుగేళ్ల క్రితం ఈవెంట్ హొరైజాన్ టెలిస్కోప్ తీసిన ఫొటోను అధ్యయనం చేసి, అది నిలువుగానూ, పక్కలకూ గిరగిరా తిరుగుతోందని తేల్చారు. ఇలా తేలడం ఇదే మొదటిసారి. కృష్ణ బిలాల అధ్యయనంలో దీన్ని కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

- కృష్ణ బిలం సమీపానికి వచ్చిన ప్రతి వస్తూ రాశినీ దాని తాలూకు డిస్క్ లోనికి లాక్కునే క్రమంలో ఇలా తిరుగుతోందట.
- ఇది అచ్చం సౌర వ్యవస్థలోని గురుత్వాకర్షణ బలాల కలయిక తదితరాల ప్రభావంతో భూమి భ్రమణం, పరిభ్రమణం చేస్తున్న తీరును పోలి ఉందట.
- ఈ సరికొత్త సమాచారం చాలా థ్రిల్లింగ్ గా ఉందని దీనిపై సమర్పించిన అధ్యయన పత్రానికి లీడ్ గా వ్యవహరించిన ప్రొఫెసర్ యుజూ కుయ్ చెప్పుకొచ్చారు.
- ప్రపంచవ్యాప్తంగా 45 అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధకులతో కూడిన బృందం నాలుగేళ్ల పాటు ఈ అంశంపై లోతుగా పరిశోధించింది.

తెలిసింది గోరంతే

- అత్యంత భారీగా ఉండే కృష్ణబిలాల అధ్యయనం చాలా కష్టం.
- ఎందుకంటే అవి కాంతితో సహా అన్నింటినీ తమ లోకి లాగేసుకుంటాయి.
- వీటికి సంబంధించి ఇప్పటిదాకా మనకు అందుబాటులో ఉన్న సమాచారం కూడా చాలా స్వల్పం.

- సాక్షి, నేషనల్ డెస్క్

గాల్లోనే ఊపిరి పోశారు!

- ఆర్నెల్ల హృద్రోగ చిన్నారికి హఠాత్తుగా శ్వాస సమస్య
- వెంటనే స్పందించి చికిత్స చేసిన వైద్యులు
- వారిలో ఒకరు ఐఏఎస్ అధికారి
- ఇండిగో విమానంలో ఉద్విగ్న క్షణాలు

న్యూఢిల్లీ: అది శనివారం ఉదయం వేళ. రాంచీ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానం. బయల్దేరి అప్పటికి 20 నిమిషాలైంది. ఇంకో గంట ప్రయాణం ఉంది. ప్రయాణికుల్లో పుట్టుకతోనే తీవ్ర హృద్రోగ సమస్యతో బాధ పడుతున్న ఒక ఆర్నెల్ల చిన్నారి. తల్లిదండ్రులు తనను చికిత్స కోసం ఢిల్లీ ఎయిమ్స్ తీసుకెళ్తున్నారు. ఉన్నట్టుండి ఊపిరాడక పాప అల్లాడింది. దాంతో తల్లి పెద్దపెట్టున రోదించింది. సాయం కోసం అర్థించింది. విషయం అర్థమై ప్రయాణికుల్లో ఉన్న ఇద్దరు డాక్టర్లు హుటాహుటిన రంగంలో దిగారు. తనకు తక్షణం సాయం అందించారు. విమానంలో పెద్దలకు ఉద్దేశించి అందుబాటులో ఉండే ఆక్సిజన్ కిట్ నుంచే పాపకు శ్వాస అందించారు. ఎయిర్ హోస్టెస్ వద్ద అందుబాటులో ఉన్న ఎమర్జెన్సీ కిట్ నుంచే మందులను వాడారు. అలా ఏకంగా గంట పాటు తన ప్రాణం నిలబెట్టారు. అంతసేపూ ప్రయాణికులతో పాటు సిబ్బంది కూడా ఊపిరి బిగబట్టి దీన్నంతా ఉత్కంఠతో చూస్తూ గడిపారు. విమానం ఢిల్లీలో దిగుతూనే అక్కడ అప్పటికే అందుబాటులో ఉన్న ఎమర్జెన్సీ వైద్య బృందం చిన్నారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించింది. దాంతో ప్రయాణికులతో పాటు అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

ఆ 15 నిమిషాలు...

ఇలా చిన్నారి ప్రాణాలను నిలబెట్టిన వైద్యుల్లో ఒకరు ఐఏఎస్ అధికారి కావడం విశేషం! ఆయన పేరు డాక్టర్ నితిన్ కులకర్ణి. జార్ఖండ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. మరొకరు డాక్టర్ మొజమ్మిల్ ఫిరోజ్. రాంచీలోని సదర్ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. చిన్నారి పుట్టుకతోనే పేటెంట్ డక్టస్ అర్టరియోసిస్ అనే హృద్రోగంతో బాధ పడుతోందని వారు చెప్పారు. 'మేం వెంటనే రంగంలో దిగి పాపకు ఆక్సిజన్ అందివ్వడంతో పాటు థియోఫైలిన్ ఇంజక్షన్ ఇచ్చాం. అలాగే తల్లిదండ్రులు తమ వెంట తెచ్చిన డెక్సోనా ఇంజక్షన్ కూడా బాగా పని చేసింది. హార్ట్ బీట్ ను స్టెతస్కోప్ తో చెక్ చేస్తూ వచ్చాం. తొలి 15 నుంచి 20 నిమిషాలు చాలా భారంగా గడిచింది. పెద్దగా ఏమీ పాలుపోలేదు. కాసేపటికి పాప స్థితి క్రమక్రమంగా మెరుగైంది' అని వారు తమ అనుభవాన్ని వివరించారు. సహ ప్రయాణికుల్లో పలువురు వారి అమూల్య సేవను మెచ్చుకుంటూ ఎక్స్‌లో మెసేజ్‌లు చేశారు.

నైట్ క్లబ్‌లో అగ్ని ప్రమాదం..13 మంది సజీవ దహనం

మాడ్రిడ్: స్పెయిన్‌లోని ముర్సియా నగరంలోని ఓ నైట్ క్లబ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 13 మంది సజీవ దహనమయ్యారు. మరో నలుగురు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. ప్రముఖ టియేటర్ నైట్ క్లబ్‌లో ఉదయం 6 గంటల సమయంలో మొదలైన మంటలు భవనమంతటా వేగంగా వ్యాపించాయని అధికారులు తెలిపారు. లోపల మరికొంత మంది చిక్కుకుని ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవనం పైకప్పు కూలుతుందనే భయంతో ఫైర్ సిబ్బంది లోపలికి వెళ్లలేకపోతున్నారని చెప్పారు.

భారత్‌కు శివాజీ ఆయుధం



ముంబై-లండన్: ఛత్రపతి శివాజీకి పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని లండన్ మ్యూజియంలో ఉన్న ఆయన ఆయుధాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకురానుంది. 17వ శతాబ్దంలో శివాజీ వాడిన పులిగోళ్ల ఆకారంలో ఉండే ఆయుధాన్ని వెనక్కి తీసుకురావడానికి లండన్‌లోని విక్టోరియా అల్బర్ట్ మ్యూజియం, మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. ఇనుముతో తయారు చేసిన అత్యంత పదునైన వాఘ్ నఖ్ (పులి గోళ్లు) ఆయుధాన్ని శివాజీ ఎక్కువగా వాడేవారు. ఆ ఆయుధాన్ని చేత్తో పట్టుకొని మహారాజా శివాజీ కదనరంగంలో స్వైరవిహారం చేస్తూ ఉంటే శత్రువులు గడగ డలాడిపోయేవారు. బీజాపూర్ సేనా నాయకుడు అఫ్జల్ ఖాన్‌ను శివాజీ ఈ పులిగోళ్ల ఆయుధంతో చంపాడని చరిత్ర చెబుతోంది. తెల్లదొరల పాలనా కాలంలో 1818లో ఈస్ట్ ఇండియాకు చెందిన అధికారి జేమ్స్ గ్రాండ్ డఫ్ పులి గోళ్ల ఆయుధాల సెట్‌ను విక్టోరియా అల్బర్ట్ మ్యూజియానికి ఇచ్చేశారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత శివాజీ వాడిన ఆయుధం మన దేశానికి రానుంది. ఛత్రపతి శివాజీ పట్టాభి షిక్తుడై అక్టోబర్ 3నాటికి 350 ఏళ్లు పూర్తి కానున్నాయి. అదే రోజు మహారాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి సుధీర్ ముంగంటివార్ ఒప్పంద పత్రాలపై సంతకం చేయనున్నారు.

గ్లోబల్ టీచర్ ప్రైజ్ జాబితాలో ఏపీ టీచర్

లండన్: గ్లోబల్ టీచర్ ప్రైజ్–2023 విజేతను ఎంపిక చేసేందుకు రూపొందించిన జాబితాలో భారత్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లున్నాయి. టాప్–50 జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న పి.హరికృష్ణతోపాటు బెంగాల్‌లోని ఆసన్‌సోల్ జిల్లాకు చెందిన ప్రాథమిక పాఠశాల టీచర్ దీప్ నారాయణ్ నాయక్ ఉన్నారు. 130 దేశాల నుంచి అందిన 7 వేలకు పైగా నామినేషన్ల నుంచి ఈ 50 మందిని ఎంపిక చేశారు. తుది జాబితాలో ఉన్న 10 మంది నుంచి విజేతను ఈ ఏడాది చివర్లో గ్లోబల్ టీచర్ ప్రైజ్ అకాడమీ ప్రకటించనుంది. వర్కీ ఫౌండేషన్, యునెస్కో, యూఏఈకి చెందిన దుబాయ్ కేర్స్ కలిసి ఏటా విజేతకు ఈ అవార్డు కింద 10 లక్షల అమెరికన్ డాలర్లను అందజేస్తాయి.

మాల్దీవుల ఎన్నికల్లో చైనా అనుకూలవాది గెలుపు



ముయిజ్

మాలె: మాల్దీవుల అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష నేత మహ్మద్ ముయిజ్ 53 శాతం ఓట్లతో అనూహ్య విజయం సాధించారు. ప్రస్తుత అధ్యక్షుడు ఇబ్రహీం మహ్మద్ సోలెహ్‌కు 46 శాతం ఓట్లు రాగా, మొత్తమ్మీద 18వేల మెజారిటీతో ముయిజ్ విజయం సాధించారని అక్కడి మీడియా తెలిపింది. అధ్యక్ష బరిలోకి ఆలస్యంగా దిగిన ముయిజ్ రెండో రౌండ్‌లో విజయం సాధించడం గమనార్హం. సెప్టెంబర్‌లో జరిగిన మొదటి రౌండ్ పోలింగ్ ముయిజ్, సోలెహ్‌ల్లో ఎవ్వరికీ 50 శాతం పైగా ఓట్లు దక్కలేదు. దీంతో, శనివారం రెండో రౌండ్ పోలింగ్ జరిగింది. ముయిజ్‌కు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్‌ను చైనా అనుకూల పార్టీగా భావిస్తుంటారు. అధికారంలోకి వస్తే మాల్దీవుల్లో ఉన్న భారత్ బలగాలను వెనక్కి పంపించివేస్తానని, భారత్‌పై ఆధారపడటం తగ్గిస్తానని హామీ ఇచ్చారు.

భారత్‌లో అఫ్గాన్ ఎంబసీ మూసివేత

న్యూఢిల్లీ: భారత్‌లో రాయబార కార్యాలయాన్ని అఫ్గానిస్థాన్ మూసివేసింది. ఆదివారం నుంచి కార్యకలాపాలన్నీ నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అఫ్గానిస్తాన్‌లో అష్రాఫ్ ఘనీ ప్రభుత్వాన్ని కూల్చివేసి తాలిబన్లు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత భారత్‌లో దౌత్యపరమైన కార్యకలాపాలన్నీ నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వనరుల కొరత, సిబ్బంది కొరతతో దౌత్య కార్యాలయాన్ని నిర్వహించలేక ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. పనిలో పనిగా భారత్‌పై కూడా ఆరోపణలు గుప్పించింది. భారత ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందకపోవడం కూడా రాయబార కార్యాలయాన్ని మూసివేయడానికి కారణమని ఆ ప్రకటనలో పేర్కొంది. భారత్ సహా ఎన్నో దేశాలు అఫ్గాన్‌లో తాలిబన్ ప్రభుత్వాన్ని ఇంకా గుర్తించడం లేదని వాపోయింది.

స్వచ్ఛ భారత్.. స్వాస్థ్ భారత్

- దేశవ్యాప్తంగా 'స్వచ్ఛతా కీ సేవా'
- శ్రమదానంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలు
- ఢిల్లీలో రహదారిని శుభ్రం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- పరిసరాల పరిశుభ్రతకు ఫిట్‌నెస్, ఆరోగ్య సంరక్షణను జోడించామని వెల్లడి

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 'స్వచ్ఛతా కీ సేవా' కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఢిల్లీలో లాంఛనంగా శ్రీకారం చుట్టారు. స్వయంగా చీపురు చేతపట్టి రహదారిని శుభ్రం చేశారు. ఆయన ఈ శ్రమదాన కార్యక్రమంతో వినూత్నంగా ఫిట్‌నెస్, ఆరోగ్య సంరక్షణను కూడా జోడించారు. ప్రముఖ ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లూయెన్సర్ అంకిత్ బైయాన్‌పూరియాతో కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి పిలుపుమేరకు దేశమంతటా అన్ని రాష్ట్రాల్లో జరిగిన స్వచ్ఛతా కీ సేవాలో లక్షలాది మంది స్వచ్ఛందంగా పాలుపంచుకున్నారు. గంటపాటు శ్రమించారు. తమ పరిసరాలను శుభ్రం చేసుకున్నారు. మార్కెట్లు, జల వనరులు, బస్ స్టాండ్లు, టోల్ వసూలు కేంద్రాలు, గోశాలలు, జంతు ప్రదర్శనశాలలు, సముద్ర తీర ప్రాంతాలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, పాఠశాలలు, కళాశాలల్లోనూ శ్రమదానం చేశారు. 4 నిమిషాల నిడివి గల తన శ్రమదానం వీడియోను ప్రధాని మోదీ తన అధికారిక 'ఎక్స్'లో షేర్ చేశారు. ''నేడు దేశమంతా స్వచ్ఛతపై దృష్టి పెట్టింది. నేను, అంకిత్ బైయాన్‌పూరియా స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నాం. కేవలం పరిసరాలను శుభ్రం చేయడమే కాదు, ఫిట్‌నెస్, ఆరోగ్య సంరక్షణను కూడా జతకలిపాం. ఇదంతా స్వచ్ఛ భారత్, స్వాస్థ్ భారత్ కోసమే'' అని మోదీ ఉద్ఘాటించారు.

9.20 లక్షలకుపైగా ప్రదేశాల్లో..

స్వచ్ఛతా కీ సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు చీపుర్లకు పనిచెప్పారు. ఇళ్ల చుట్టుపక్కన, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం ఊడ్చేశారు. ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు, మార్కెట్ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, ధార్మిక సంస్థలు, వాణిజ్య సంఘాలు, ప్రైవేట్ కంపెనీలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. దేశవ్యాప్తంగా 9.20 లక్షలకుపైగా ప్రదేశాల్లో ఈ కార్యక్రమం జరిగిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ శ్రమదానం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీలోని ఝండేవాలన్ ఏరియాలో శ్రమదానంలో పాల్గొన్నారు. భారత వైమానిక దళం(ఐఏఎఫ్) చీఫ్ ఎయిర్ మార్షల్ వీఆర్ చౌదరి ఢిల్లీలో స్వచ్ఛతా యజ్ఞంలో భాగస్వాములయ్యారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సీతాపూర్‌లో 'స్వచ్ఛతా పఖ్వాడా' నిర్వహించారు.


'చెత్త రహిత భారత్'ను సాధిద్దాం

దేశాన్ని పరిశుభ్రంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం తీర్మానించుకుందని, ఇదొక పెద్ద సవాలు అయినప్పటికీ చేసి చూపిస్తామని కేంద్ర మంత్రి ఆర్‌కే సింగ్ పేర్కొన్నారు. స్వచ్ఛతా యజ్ఞంతో మహాత్మా గాంధీకి నివాళులర్పిద్దామని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా కీ సేవాలో పాల్గొన్ని, కొత్త చరిత్ర సృష్టిద్దామని ఉద్బోధించారు. 'చెత్త రహిత భారత్' అనే కలను నెరవేర్చుకుందామని సూచించారు.



స్వచ్ఛతా కీ సేవా కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో శ్రమదానం చేస్తున్న ప్రధాని మోదీ





ప్రజలు శ్రమదానంలో పాల్గొనాలంటూ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'స్వచ్ఛ భారత్' పిలుపును ప్రజలు అందిపుచ్చుకుంటారని తాము ఆశిస్తున్నట్లు బీజేపీ ఎంపీ మీనాక్షి లేఖీ చెప్పారు.

తుర్కియేలో ఆత్మాహుతి దాడి

అంకారా: తుర్కియే రాజధాని అంకారా నడిబొడ్డున ఆదివారం ఆత్మాహుతి దాడి జరిగింది. పార్లమెంట్ సమావేశాలను అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రారంభించడానికి కొద్ది సేపటి ముందే ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు విదేశాంగ శాఖ కార్యాలయ భవనంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. ప్రవేశ ద్వారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. వారిలో ఒకడు తనను తాను పేల్చేసుకోగా ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. మరో దుండగుడిని పోలీసులు కాల్చి చంపారు. దాడి వెనుక కుర్దిష్ మిలిటెంట్లు లేదా ఐఎస్ ఉగ్రవాదులు ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్లొవేకియాలో రష్యా అనుకూలవాది గెలుపు



రాబర్ట్ ఫికో

ప్రేగ్: యూరప్‌లోని చిన్న దేశం స్లొవేకియాలో ఎన్నికల ఫలితాలు అమెరికా, యూరప్ దేశాలకు కంగారు పుట్టిస్తున్నాయి. రష్యా అనుకూల మాజీ ప్రధాని రాబర్ట్ ఫికోకు చెందిన వామపక్ష స్మెర్(డైరెక్షన్)పార్టీ తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించింది. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు మొదట్నుంచీ పొరుగునే ఉన్న స్లొవేకియా మద్దతుగా నిలుస్తోంది. ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఉక్రెయిన్ శరణార్థుల కోసం సరిహద్దులను తెరిచి ఉంచింది. తాము అధికారంలోకి వస్తే ఉక్రెయిన్‌కు మద్దతు ఉపసంహరించుకుంటామని, వలసలను అడ్డుకుంటామని, రష్యాపై ఆంక్షలను ఎత్తివేస్తామని ప్రజలకు ఫికో హామీ ఇచ్చారు. గతంలో రెండు పర్యాయాలు ఫికో ప్రధానిగా పనిచేశారు. తాజా ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రానప్పటికీ ఫికోయే ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. స్లొవేకియా ఎన్నికల ఫలితాల గెలుపు ప్రభావం జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాల్లో మరికొద్ది రోజుల్లో జరగనున్న జాతీయ, ప్రాంతీయ ఎన్నికలపై పడుతుందన్నది పరిశీలకుల అంచనా.



పాత పింఛను విధానాన్ని మళ్లీ తేవాలంటూ ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల నిరసన

పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలి

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల ధర్నా

న్యూఢిల్లీ: పాత పింఛన్ పథకాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వ, ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఆదివారం 'పెన్షన్ శంఖనాథ్ మహార్యాలీ' పేరిట భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 20కిపైగా రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉద్యోగులు తరలివచ్చారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పింఛన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రిటైర్‌మెంట్ తర్వాత తమ జీవితానికి భరోసానిచ్చే పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని తేల్చిచెప్పారు. జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్, నేషనల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినట్లు నిరసనకారులు వెల్లడించారు. 2004 జనవరి 1 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరినవారు కొత్త పింఛన్ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు అలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జాతీయ కన్వీనర్ శివగోపాల్ మిశ్రా చెప్పారు.

కన్నడ సినీ నటుడు నాగభూషణ్ అరెస్టు

బెంగళూరు: కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి, ఒక మహిళ మరణానికి కారణమైన కన్నడ సినీ నటుడు నాగభూషణ్ ఎస్.ఎస్.ను పోలీసులు అరెస్టు చేశారు. నాగభూషణ్ కారు శనివారం రాత్రి బెంగళూరులోని వసంతపుర ప్రధాన రహదారిపై కృష్ణ(58), ప్రేమ(48) అనే దంపతులపైకి దూసుకెళ్లింది. వారిద్దరూ ఫుట్‌పాత్‌పై నడుస్తుండగా ఈ సంఘటన జరిగింది. తర్వాత కారు కొద్ది దూరం వెళ్లి, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ సమయంలో కారును నాగభూషణ్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో ప్రేమ మృతిచెందగా, కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. కారును నడిపిన నాగభూషణ్‌ను అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమయంలో మద్యం సేవించి ఉన్నాడో లేదో తెలుసుకొనేందుకు అతడి రక్తపు నమూనాలు సేకరించామని అన్నారు. కారును స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అమెరికా, భారత్ బంధాలకు హద్దుల్లేవ్

అమెరికాలో ప్రవాస భారతీయుల సదస్సులో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్



వాషింగ్టన్: అమెరికా, భారత్ మధ్య ద్వైపాక్షిక బంధాలకు హద్దుల్లేవని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు అత్యున్నత స్థాయికి చేరుకున్నాయని, ఇరు దేశాలు పరస్పర అవసరాలు తీర్చుకుంటూ, సౌకర్యవంతమైన, అనుకూలమైన భాగస్వామ్యులుగా మెలగుతున్నాయని పేర్కొన్నారు. చంద్రయాన్ మాదిరిగా ఇరు దేశాల మధ్య బంధాలు చంద్రుడిని తాకాయని, అంతకుమించి హద్దుల్లేకుండా సాగిపోతున్నాయని అభివర్ణించారు. అమెరికాలో పర్యటిస్తున్న జైశంకర్ శనివారం ప్రవాస భారతీయులతో ఇండియా హౌస్‌లో సమావేశమయ్యారు. ఇక్కడ నిర్వహించిన సెలబ్రేటింగ్ కలర్స్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ కార్యక్రమానికి అమెరికాలో వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో ప్రవాస భారతీయులు తరలివచ్చారు. ప్రవాస భారతీయులనుద్దేశించి జై శంకర్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సంబంధాల్ని మరో కొత్త స్థాయికి తీసుకువెళతామని చెప్పారు. ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చినా ఇరు దేశాల మధ్య సంబంధాలు పటిష్టంగా సాగుతున్నాయని, ఇక భవిష్యత్‌లో సరికొత్త రంగాల్లో అమెరికాతో కలిసి పని చేస్తామని వెల్లడించారు. భారత్‌లో నిర్వహించిన జీ–20 సదస్సుకి అమెరికా సహకారం అందించడం వల్లే విజయ వంతమైందని అన్నారు. ''దేశాలు ఒకరితో ఒకరు వ్యాపారాలు చేస్తాయి. రాజకీయాలు చేస్తాయి. మిలటరీ బంధాలు కలిగి ఉంటాయి. విన్యాసాలు నిర్వహిస్తాయి. సాంస్కృతిక బదలాయింపులు ఉంటాయి. అయినప్పటికీ రెండు దేశాలు లోతైన మానవీయ సంబంధాలు కలిగి ఉండాలి. అప్పుడే ఆ బంధం సంపూర్ణమవుతుంది. ప్రస్తుతం భారత్, అమెరికా మధ్య అలాంటి సంబంధాలే ఉండాలి'' అని జైశంకర్ వివరించారు.

అమెరికాకు తప్పిన షట్‌డౌన్ ముప్పు

స్వల్పకాలిక ద్రవ్యవినిమయ బిల్లుపై చివరిక్షణంలో బైడెన్ సంతకం



వాషింగ్టన్: అమెరికాకు షట్‌డౌన్ ముప్పు తాత్కాలికంగా తప్పింది. వార్షిక ద్రవ్య వినిమయ బిల్లుని ఆమోదించడానికి ప్రతిపక్ష రిపబ్లికన్లు ససేమిరా అనడంతో బిల్లులు చెల్లించలేక అగ్రరాజ్యం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదరకర పరిస్థితులు వచ్చాయి. అయితే శనివారం రాత్రి చివరి క్షణంలో స్వల్పకాలిక బిల్లుకి రిపబ్లికన్లు ప్రతినిధుల సభలో ఆమోదించారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చివరి క్షణంలో తాత్కాలిక నిధుల విడుదల బిల్లుపై సంతకాలు చేశారు. దీంతో దేశంలో వివిధ పథకాలు, సైనికులు, ప్రభుత్వ జీత భద్రతాలకు మరో 45 రోజులు ఢోకా లేదు. ఈ బిల్లు నుంచి ఉక్రెయిన్‌కు అందించే ఆర్థిక సాయాన్ని మినహాయించారు. అమెరికాలో కొత్త ఆర్థిక సంవత్సరం అక్టోబర్ 1 నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 30 అర్ధరాత్రి 12 గంటల్లోగా ద్రవ్యవినిమయ బిల్లుల్ని ఆమోదించాల్సి ఉంది. అయితే ప్రతినిధుల సభలో మెజార్టీ కలిగిన రిపబ్లికన్లు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుల్ని ఆమోదించడానికి నిరాకరించారు. ప్రతినిధుల సభ స్పీకర్ మెకార్థీ రిపబ్లికన్ పార్టీకి చెందినవారే అయినప్పటికీ ద్రవ్య బిల్లుల్ని అడ్డుకుంటే ప్రజలకి ఇబ్బందులకు గురవుతారని నచ్చజెప్పడంతో వారు ఒక్క మెట్టు దిగారు. స్పీకర్ ప్రతిపాదించిన స్వల్పకాలిక బిల్లుకు ఆమోదం తెలిపారు. దీంతో అమెరికాలో ఫెడరల్ ప్రభుత్వానికి ఉపశమనం లభించింది.

మణిపూర్ విద్యార్థుల హత్య కేసు.. నలుగురి అరెస్ట్

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింసాత్మక నిరసనలకు దారి తీసిన ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్, హత్య కేసుకు సంబంధించి సీబీఐ నలుగురిని అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎన్. బైరన్ సింగ్ 'ఎక్స్'లో ధ్రువీకరించారు. వారికి మరణ శిక్ష పడేలా చూస్తామని తన పోస్టులో తెలిపారు. ఇద్దరు విద్యార్థులు ఫిజమ్ హేమాంజిత్, హిజమ్ లింతోయిన్‌గాంబీల కిడ్నాప్, హత్యకు బాధ్యులైన దంపతులు సహా నలుగురిని పోలీసులు ఆదివారం చూర్ చాంద్‌పూర్‌లో అరెస్ట్ చేశారని సీఎం చెప్పారు. వారిని ప్రత్యేక విమానంలో రాష్ట్రం వెలుపలికి తరలించినట్లు వెల్లడించారు. అయితే, వారిని ఎక్కడికి తీసుకెళ్లిందీ ఆయన వివరించలేదు.

సాక్షి
కరీంనగర్

సోమవారం, 2, అక్టోబర్, 2023



ముగిసిన అథ్లెటిక్స్

కరీంనగర్ వేదికగా రెండురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ముగిశాయి. చాంపియన్‌గా నల్గొండ జట్టు నిలిచింది.

10లో▸



పత్తి విక్రయాలకు ఆధార్

కొద్దిరోజుల్లో ప్రారంభమయ్యే పత్తి విక్రయాలకు ఆధార్ తప్పనిసరి చేసింది ప్రభుత్వం. ఆధార్ ఉంటేనే విక్రయాలు చేయాలని స్పష్టం చేసింది.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పగలు ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల సమ్మె యథాతథం



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో ఆదివారం ఆర్థికశాఖ మంత్రి టి.హరీశ్‌రావుతో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు చర్చించారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అంగన్‌వాడీలకు కూడా పీఆర్సీ వర్తించేలా కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మరో ప్రధాన డిమాండ్ గ్రాడ్యుటీ సాధ్యం కాదని తేల్చిచెప్పారని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు సమ్మె కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమ్మె విరమణ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని సూచించారు. ఈనెల 4న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని, అంగన్‌వాడీలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంత్రితో సమావేశం అయిన వారిలో జేఏసీ రాష్ట్ర నాయకులు జయలక్ష్మి, సునీత, కరుణకుమారి, సాయిశ్వరి, చందన తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్ జిల్లా ఏర్పాటుపై ప్రచారం నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆవునూరి సమ్మయ్య

హుజూరాబాద్: హుజూరాబాద్ కేంద్రంగా పీవీ జిల్లా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం హుజూరాబాద్ సిటీసెంట్రల్ ఫంక్షన్‌హాల్‌లో పీవీజిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలువురు వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. హుజూరాబాద్ చుట్టపక్కల 13మండలాలతో జిల్లాను ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి మేనిఫెస్టోలో పెట్టాలని కోరతామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆవునూరి సమ్మయ్య, వేల్పుల రత్నం, పల్కల ఈశ్వర్‌రెడ్డి, చందుపట్ల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


చిగురుమామిడి ఘటనపై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బ్రసా నేతలు

కరీంనగర్ అర్బన్: నాలుగు రోజుల క్రితం చిగురుమామిడి గిర్దావర్ పూదరి రాజు విధులకు ఆటంకం కల్గించి, భయభ్రాంతులకు గురిచేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బి.గోపికి బ్రసా నేతలు ఫిర్యాదు చేశారు. ఘటన రోజునే అక్కడి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదైందని, అయితే సదరు వ్యక్తి తిరిగి గిర్దావర్‌పై కౌంటర్ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. తక్షణమే స్పందించి సీపీతో మాట్లాడి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారని, కౌంటర్ కేసు రద్దయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని బ్రసా జిల్లా కార్యదర్శి పెద్ది విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు గడ్డం సుధాకర్ తెలిపారు.

జిల్లా ఆస్పత్రికి స్వచ్ఛతా హీ సేవా ప్రశంసాపత్రం



స్వచ్ఛత కార్యక్రమాలు చేస్తున్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

కరీంనగర్‌టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత, పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాలకు స్వచ్ఛభారత్ మిషన్ ప్రశంసాపత్రాన్ని అందజేసింది.



ఏక్ రుపియా వాలా 2.0

- రెండేళ్లలో రూ.వందల కోట్లకు పడగలెత్తిన వ్యాపారి
- కరీంనగర్ నుంచి నేరుగా తమిళనాడుకు పీడీఎస్ రైస్
- సైకిళ్ల నుంచి గూడ్స్ రైళ్లలో తరలించే స్థాయికి ఎదిగిన వైనం
- రెండేళ్ల క్రితం డీజీపీ కార్యాలయం ఆగ్రహంతో అండర్‌గ్రౌండ్‌కు..
- మిల్లర్లతో కుమ్మక్కై సీఎమ్మార్ బియ్యం కూడా ఎగుమతి
- 'పుష్ప' తరహాలో మహారాష్ట్ర, తమిళనాడుకు విస్తరించిన నెట్‌వర్క్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అడవిలో చెట్లు కొట్టుకునే కూలోడు అంతర్జాతీయ స్మగ్లర్‌గా ఎదిగిన కథ 'పుష్ప' సినిమా. వాస్తవానికి అలాంటి ఘటనలు నిజజీవితంలో జరగవు. కానీ.. ఉమ్మడి కరీంనగర్‌లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి.. అధిక ధరలకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వ్యాపారిని చూస్తే నిజమే అనిపిస్తోంది. 'ఏక్ రుపియావాలా' కోడ్ నేమ్‌తో అధికారులు ముద్దుగా పిలుచుకునే ఈ స్మగ్లర్ నెట్‌వర్క్ ఒకప్పుడు పాత కరీంనగర్ జిల్లాకే పరిమితం. నేడు ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లా దాటి మహారాష్ట్రలో ఎంటర్ అయ్యాడు. ఆ సమయంలో అతడి దందా.. పీడీఎస్ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న తీరును 'సాక్షి' దినపత్రిక 'ఏక్ రుపియావాలా' శీర్షికన వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలపై డీజీపీ కార్యాలయం స్పందించి దాడులకు ఆదేశించింది. అప్పటి కరీంనగర్ సీపీ సత్యనారాయణ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు వరుస దాడులతో విరుచుకుపడ్డాయి. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న పలువురిని బైండోవర్ కూడా చేశాయి. దీంతో కొంతకాలంపాటు సదరు వ్యాపారి, అతని అనుచరులు కార్యకలాపాలు నిలిపివేశారు.

> **ఫిర్యాదు వచ్చింది చర్యలు తీసుకుంటాం**
>
> కరీంనగర్ నుంచి తమిళనాడుకు సీఎంఆర్ బియ్యం అక్రమంగా వెళ్తున్నాయని మాకు అధికారికంగా ఫిర్యాదు వచ్చింది. వెంటనే అడిషనల్ కలెక్టర్, సివిల్ సప్లయీస్ ఉన్నతాధికారులకు చేరవేశాను. వారు స్పందించి రంగంలోకి దిగారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.
>
> – రవీందర్ సింగ్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్

సైకిళ్లతో మొదలై.. గూడ్స్ రైళ్లలో తరలించే స్థాయికి..

ఒకప్పుడు గ్రామాల్లో సైకిళ్లపై తిరుగుతూ.. పీడీఎస్ బియ్యాన్ని సేకరించి వాహనాల్లో తరలించడంలో ఏక్ రూపియావాలాది అందెవేసిన చేయి. అప్పట్లో హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ ఎన్నికలు వరుసగా రావడం.. పత్రికల్లో వరుస కథనాలు రావడంతో అతడి వ్యాపారం సుప్తావస్థలోకి వెళ్లింది. ఆ తర్వాత కొత్త పద్ధతిలో వ్యాపారంలోకి దిగాడు. అధికారులకు లంచాలిస్తూ.. మహారాష్ట్రకు బియ్యం తరలించడం కన్నా అధికారికంగానే ఎగుమతి చేయాలని నిర్ణయించాడు. అదునుకోసం చూస్తున్న అతడికి తమిళనాడు రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వానికి బియ్యం కోసం చేసిన వినతి ఆసరాగా దొరికింది. రూ.37.50కు కిలో చొప్పున కావాలని తమిళనాడు కోరడం.. ఆ డీల్ రద్దు కావడంతో 'ఏక్ రుపియావాలా' రంగంలోకి దిగాడు. కిలో రూ.31.50కే ఇస్తామని డీల్ కుదిర్చినట్లు సమాచారం. ఎగుమతికి కావాల్సిన బియ్యంలో తనవంతుగా పీడీఎస్ రైస్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అతడికి కావాల్సినంత బియ్యం ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు సమ్మతించారని తెలిసింది. ఇందులో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యమే ఉన్నట్లు తెలిసింది. వారం వ్యవధిలో దాదాపు ఐదు వేల టన్నులు కరీంనగర్ నుంచి గూడ్స్ ద్వారా ఎగుమతి చేసినట్లు, వీటి విలువ దాదాపు రూ.160కోట్ల వరకు ఉంటుందని సమాచారం. డిమాండ్ నేపథ్యంలో మరో రూ.60 కోట్ల విలువైన రెండు వేల టన్నులు తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు మరో గూడ్స్ రైల్ రేక్‌ను ఇప్పటికే బుక్‌చేశారని సమాచారం. ఇంత జరుగుతుంటే ఇటు సివిల్ సప్లయీస్ అధికారులు, పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.

అటెన్షన్ డైవర్షన్‌లో అందెవేసిన చేయి..

తెలంగాణ, మహారాష్ట్రలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో 'ఏక్ రుపియా వాలా'ది అందె వేసిన చేయి. అచ్చం వీరప్పన్ తరహాలో.. పోలీసులు బందోబస్తుల్లో నిమగ్నమయ్యే సందర్భాల్లోనే భారీ వాహనాల్లో టన్నుల కొద్దీ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటిస్తాడు. ఇపుడు బహిరంగ దందా చేస్తున్న నేపథ్యంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. తమపై సివిల్ సప్లయీస్, పోలీసుల కన్ను పడకుండా.. గణేశ్ ఉత్సవాల్లో అధికారులు తలమునకలైన సందర్భాన్ని వాడుకుని రైలు ద్వారా తెలివిగా.. పకడ్బందీగా తమిళనాడుకు బియ్యం ఎగుమతి చేశాడు. త్వరలో ఎన్నికల కోడ్ రాబోతోంది. కోడ్ వస్తే వాహన తనిఖీలు పెరుగుతాయి. దానికి ముందే రెండో విడత సరుకును పంపేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని సమాచారం. కిలోకు రూపాయి బియ్యాన్ని రూ.4 లేదా రూ.5 కమీషన్ చొప్పున విక్రయించే 'ఏక్ రుపియా వాలా' నేడు రూ.వందల కోట్ల వ్యాపారానికి పడగలెత్తిన తీరు సినిమా కథను తలపిస్తోంది.

టీచర్ల తప్పుల దిద్దుబాటు

- ర్యాంకుల గోల్‌మాల్‌పై స్పందించిన డీఈవోలు
- 'సాక్షి' వరుస కథనాలపై కదలిన విద్యాశాఖ
- స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపైనా మొదలైన చర్యలు
- అన్ని డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్ ఆప్షన్ల వెరిఫికేషన్లు



కరీంనగర్‌లో వెరిఫికేషన్‌కు హాజరైన స్పౌజ్ టీచర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీచర్ల బదిలీలు, పదోన్నతులు సందర్భంగా వెలుగుచూసిన ర్యాంకుల గోల్‌మాల్, స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఇటీవల జీహెచ్‌ఎం బదిలీలలో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం అవుతున్న తీరును, టీచర్ల పదోన్నతులు–బదిలీల సందర్భంగా దరఖాస్తుల్లో డీఎస్సీ ర్యాంకులను తప్పుగా నమోదు చేసిన వైనాన్ని 'సాక్షి' గతనెల 23న 'స్పౌజ్ దుర్వినియోగంపై గుర్రు', 29న 'టీచర్ల బదిలీల్లో ర్యాంకుల గోల్‌మాల్' శీర్షికలతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో టీచర్లు చేసిన తప్పులను సరిదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో జాబితాలను అధికారులు సవరించారు. సిరిసిల్ల జాబితాను సవరించాల్సి ఉంది.

డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్ వెరిఫికేషన్..

స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై పాఠశాల డైరెక్టర్ దేవసేన ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీఈఓ కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి. స్పౌజ్ కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లంతా డీఈవో కార్యాలయాల్లో ఆదివారం వెరిఫికేషన్‌కు రావాలని సూచించింది. అందరి ఆప్షన్లను వెరిఫికేషన్ చేసి అందులో నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్‌కు దూరంగా ఆప్షన్ ఇచ్చినవారందరినీ సమీపంలోని స్కూల్‌కు ఆప్షన్‌ను ఎడిట్ చేసుకోవాలని డీఈవోలు ఆదేశించారు. దీంతో అనివార్యంగా వారంతా సమీపంలోని పాఠశాల వద్దకు ఆప్షన్ ఇచ్చుకున్నారు. ఇష్టంలేనివారు 'నాట్ విల్లింగ్' ఇచ్చుకున్నారు. కరీంనగర్‌లో 56 మంది, జగిత్యాలలో 66 మంది, పెద్దపల్లి 33 మంది, సిరిసిల్లలో 37 మంది స్పౌజ్‌లు వెరిఫికేషన్ పూర్తిచేసుకున్నారు.

గోల్‌మాల్ ర్యాంకులు సరి

పదోన్నతులు, బదిలీ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాలలో పలు తప్పులు దొర్లాయి. కొందరు టీచర్లు తాము కోరుకున్న పదోన్నతి, ఇష్టమైన చోటుకు బదిలీ దక్కేలా చక్రం తిప్పారు. 317 జీవో అమలు సందర్భంగా డీఎస్సీ ర్యాంకును ప్రామాణికంగా కేటాయింపులు చేపట్టారు. ఇప్పుడు కూడా అవే ర్యాంకులు ప్రామాణికంగా తీసుకుంటున్నారని తెలుసుకున్న టీచర్లు.. తమ డీఎస్సీ ర్యాంకులను హెచ్ఆర్ఎంఎస్ సైట్‌లో తప్పుగా చూపించారు. ఈ విషయంలో కొన్ని జిల్లాల్లో ఉన్నతాధికారులను విజయవంతంగా తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలను 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. తప్పుడు ర్యాంకులు చూపిన టీచర్లకు నోటీసులు పంపి వివరణ కోరారు. అలాగే తప్పుగా నమోదైన ర్యాంకులను తిరిగి సరిదిద్దుతున్నారు.

బదిలీలు (గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు)

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2163
జగిత్యాల	25	685	2191
జగిత్యాల	31	334	681

- పై పట్టికలో చూపినవే కాకుండా పదుల సంఖ్యలో తప్పుగా నమోదుచేసిన ర్యాంకులను డీఈవో కార్యాలయాలు ఇప్పుడు సరిచేశాయి. 317 జీవో అమలు సందర్భంలో ఉన్న ర్యాంకులనే ఉంచి, వాటినే ప్రామాణికంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. తప్పుడు ర్యాంకులను సవరించి, పాత ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్న జగిత్యాల డీఈవో జగన్మోహన్‌రెడ్డికి ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు అండగా ప్రభుత్వం



వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ బి. గోపి

- ప్రతి నాలుగో శనివారం వృద్ధులు, దివ్యాంగుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం
- కలెక్టర్ డాక్టర్ గోపి

కరీంనగర్: వృద్ధులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రతి నాలుగో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల ఫిర్యాదులు ప్రత్యేకంగా స్వీకరిస్తామని కలెక్టర్ బి.గోపి అన్నారు. ఆదివారం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. కలెక్టర్ బి.గోపి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగుల ఫిర్యాదులు ప్రతి నాలుగో శనివారం ప్రత్యేకంగా స్వీకరిస్తామని తెలిపారు. దీంతో వాళ్లు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పని ఉండదని, సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నగరంలోని డేకేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వయోవృద్ధులకు సంబంధించిన అన్ని సంఘాలు ఒకే వేదికపైకి రావాలని, అప్పుడే వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు. జిల్లా పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షుడు వుచ్చిడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీలో వృద్ధులకు 50శాతం రాయితీ కల్పించాలని కోరారు. డేకేర్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి షెడ్ నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ చట్టం ప్రకారం జిల్లాలో రెవిన్యూ డివిజనల్ అధికారి స్థాయిలో రెండు ట్రిబ్యునళ్లు పనిచేస్తున్నాయని తెలిపారు. వృద్ధులు తమ సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే న్యాయం చేస్తామని తెలిపారు. ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిద, సీడీపీవో సబిత, వయోవృద్ధుల సంఘాల బాధ్యులు సముద్రాల జనార్దన్‌రావు, బండ సత్తయ్య, వడ్లూరు వెంకటేశం, టి.రామస్వామి, మోసం అంజయ్య, పెండ్యాల కేశవరెడ్డి ఉన్నారు.

- మంత్రి గంగుల కమలాకర్

మట్టిరోడ్డు లేకుండా చేస్తాం



సభలో మాట్లాడుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో మట్టిరోడ్డు అనేది లేకుండా చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇప్పటికే వేలకోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైతే మరో రూ.500 కోట్లు తెస్తామన్నారు. ఆదివారం నగరంలో పలు అభివృద్ధి పనులకు మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్‌లో కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్యతో కలిసి సీసీ రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమి పూజచేశారు. 1,2 డివిజన్ తీగలగుట్టపల్లిలో కాశెట్టి లావణ్య శ్రీనివాస్, కొలగాని శ్రీనివాస్‌తో కలిసి పెండింగ్ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేశారు. 4,5,6,27వ డివిజన్ కార్పొరేటర్లు నుజహత్ ఫర్హీనా అలీ, జహీరాబాను, గౌసియాబేగం అబ్బాస్ సమీ, కోల మాలతితో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దున్నట్లు తెలిపారు. కేసీఆర్‌తోనే తెలంగాణకు రక్షణ అని, ఓటు తప్పి ఢిల్లీ పార్టీలకు వేస్తే నీళ్లు నిధులు వెనక్కిపోతాయని, అరిగోస పడుతామని హెచ్చరించారు. తెలంగాణ వస్తే గుడ్డి దీపమవుతుందన్న కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ ముసుగేసుకుని మళ్లీ తెలంగాణకు వస్తున్నాడన్నారు. బీఆర్ఎస్ నగర్ అధ్యక్షుడు చల్ల హరి శంకర్, దాసరి సాగర్, బోనాల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కళ్లలో పెట్టుకోండి.. కడుపులో దాచుకుంటా

కరీంనగర్ అర్బన్: తన చివరిశ్వాస వరకు ప్రజాక్షేత్రంలో ఉంటానని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కళ్లలో పెట్టుకుని చూసుకోండి కడుపులో దాచుకుంటానని భరోసానిచ్చారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో రూ.1.25కోట్లతో పండ్ల మార్కెట్‌లో కవర్ షెడ్లు, రూ.12లక్షలతో ఎండ్ల బండి, రైతు విగ్రహ పనులకు శంకుస్థాపన చేశారు. రైతులకు సేవలందించడంలో ముందుంటున్నారని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్‌ను అభినందించారు. మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లస్వరూప, డీఎంవో పద్మావతి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం, కార్యదర్శి మల్లేశం, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కరీంనగర్: మొగ్దుంపూర్ ఉపసర్పంచ్ కూకట్ల తిరుపతియాదవ్, తదితరులు మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ జక్కం నర్సయ్య, ఎంపీటీసీ పుష్ప అంజి రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మైలారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలొచ్చాయ్

- ఈ నెల 4నుంచి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ
- జిల్లాకు చేరిన 2.79లక్షల చీరలు
- పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలకు అందజేత



రెవెన్యూ ఆధ్వర్యంలో భద్రపరిచిన చీరలు రకరకాల డిజైన్లు..


కరీంనగర్ అర్బన్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. అతివలకు అత్యంత ఇష్టమైన పండుగ బతుకమ్మ. ఎంగిలిపూల నాటి నుంచి మహిళలు చేసే సందడి కనులవిందే. బతుకమ్మకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తోంది. ఇప్పటికే జిల్లాకేంద్రానికి చీరలు చేరగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భద్రపరిచారు. ఈ నెల 4 నుంచి పంపిణీకి ఏర్పాట్లు చేస్తుండగా పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలకు అందజేయనున్నారు. గతానికి భిన్నంగా చీరలు తయారుచేయించారు. ఒక్కోచీరకు సుమారు రూ.600లకు పైగా ఖర్చు కాగా, పలు రకాల డిజైన్లను జోడించారు. బంగారు, వెండి జరి అంచు చీరలు, చెక్స్ డిజైన్లు ఈ సారి ప్రత్యేకమని అధికారులు చెబుతున్నారు. చీరలను రేషన్ దుకాణాల ద్వారా డీఆర్డీవో, రెవెన్యూ, సివిల్ సప్లయ్, డీపీవో శాఖలు సమన్వయంతో పంపిణీ చేయనున్నాయి. గ్రామాల్లో రేషన్ డీలరు, వీవో, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించనున్నారు. పట్టణాల్లో రేషన్ డీలరు, మెప్మా సిబ్బంది, మునిసిపల్ అధికారులు, కౌన్సిలర్, కార్పొరేటర్ల సంయుక్త పర్యవేక్షణలో పంపిణీ జరగనుంది. జిల్లాకు 3.54లక్షల చీరలు రావాల్సి ఉండగా 2.79లక్షల చీరలు చేరాయి. మరో 45వేల చీరలు నేడో, రేపో రానున్నట్లు సమాచారం.

తగ్గిన మహిళల సంఖ్య..

ఈ సారి మహిళల సంఖ్య తగ్గింది. గత సంవత్సరం 3,54,427 మంది 18ఏళ్లు నిండినవారుగా గుర్తించారు. పలుమార్లు ఆధార్ కార్డు అనుసంధానం చేయడం, మరణించిన, వలస వెళ్లినవారిని గుర్తించి కార్డులను తొలగించడంతో 30వేలకు పైగా లబ్ధిదారులు తగ్గారు. గతంలో రెవెన్యూ డివిజన్ల వారీగా చీరలు వేరు చేసి మండలాల వారిగా సరఫరా చేయగా అక్కడి రేషన్ దుకాణాల డీలర్లు జాబితా ప్రకారం చీరలను తీసుకుని పంపిణీ చేశారు. ఆహారభద్రత కార్డులో పేరు ఉండి 18 సంవత్సరాలు నిండిన మహిళలకు చీరలను అందిస్తుండగా జిల్లాలో 2.72లక్షల కార్డులుండగా 8.10లక్షల యూనిట్లున్నాయి. అంత్యోదయ కార్డులు 11వేలు, అన్నపూర్ణ కార్డులు 102 ఉండగా 566 రేషన్ దుకాణాలున్నాయి.

రెవెన్యూ డివిజన్లు: 2 (కరీంనగర్, హుజూరాబాద్)	
జిల్లాలో రేషన్ దుకాణాలు	566
ఆహారభద్రత కార్డులు	2,72,199
మొత్తం యూనిట్లు	8,48,212
18 ఏళ్లు నిండిన మహిళలు	2.57లక్షలు

కొత్త జయపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న మిత్రులు, కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ నాయకుడు, మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. మిత్ర మండలి సభ్యులు, అభిమానులు, కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, అనాథ శరణాలయాలు, ఆస్పత్రుల్లో పలుసేవా కార్యక్రమాలు, అన్నదానాలతో పాటు సీతారాంపూర్‌లోని రెడ్డిఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నాగరాజు, శేఖర్, అగ్రిగోల్డ్ శ్రీనివాస్, నారా చందర్, శీను, శ్రీనివాస్, పోరండ్ల రాజు, సరీన్, డెటాల్ శీను, నెస్లే నాగరాజు, పరిమళ శీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

7న తెలంగాణ బాడీ బిల్డింగ్‌ పోటీలు



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ గోపి

కరీంనగర్‌స్పోర్ట్స్‌: జిల్లా బాడీ బిల్డింగ్‌ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న తిమ్మాపూర్‌లోని వాగేశ్వరీ ఇంజినీరింగ్‌ కళాశాలలో జరుగనున్న మిస్టర్‌ తెలంగాణ బాడీ బిల్డింగ్‌ పోటీల వాల్‌ పోస్టర్‌ను ఆదివారం కలెక్టర్‌ బి.గోపి ఆవిష్కరించారు. బాడీ బిల్డింగ్‌ పోటీలంటే యువతలో క్రేజ్‌ ఉందని కలెక్టర్‌ అన్నారు. సంఘం కార్యదర్శి ఎస్‌.దామోదర్‌, బాధ్యులు హతీక్‌, ఎస్‌.రవీంద్రచారి, మోయిన్‌, శ్రీనివాస్‌, సాయిరాం ప్రకాశ్‌ పాల్గొన్నారు.

వేధింపులు భరించలేకనే హత్య



సాయిలు అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యానికి బానిసై కొంతకాలంగా డబ్బుల కోసం వేధించడం, కుటుంబ సభ్యులపై తరచూ దాడులు చేసి హింసించడాన్ని తట్టుకోలేక కన్నకొడుకును తండ్రి హతమార్చాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్లారెడ్డిపేట సర్కిల్‌ కార్యాలయంలో సీఐ శశిధర్‌రెడ్డి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌ గ్రామానికి చెందిన కుంట రమేశ్‌ గతంలో విద్యుత్‌ శాఖలో లైన్‌మెన్‌గా పని చేశాడు. మద్యానికి బానిస కావడంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో మరింతగా మద్యానికి బానిసైన రమేశ్‌ అప్పుడప్పుడు కుల వృత్తిలో భాగంగా చేపల వేటకు వెళ్లి వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ.. తండ్రి సాయిలు, అంధురాలైన తల్లి మల్లమ్మ, అంగవైకల్యంతో బాధపడుతున్న సోదరుడు సత్యనారాయణను డబ్బుల కోసం వేధించసాగాడు. వారి పెన్షన్‌ డబ్బులు కూడా బలవంతంగా తీసుకునేవాడు. కొడుకు వేధింపులు భరించలేక తండ్రి విసిగిపోయాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం నిద్రలో ఉన్న రమేశ్‌ తలపై గొడ్డలితో తండ్రి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిలును ఆదివారం లింగాపూర్‌ బస్టాండ్‌లో అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. సమావేశంలో గంభీరావుపేట ఎస్సై మహేశ్‌ ఉన్నారు.

మహిళా పోలింగ్‌ కేంద్రాలొస్తున్నాయ్‌!

- జిల్లాకో దివ్యాంగ, యూత్‌ పోలింగ్‌ కేంద్రం
- నియోజకవర్గానికి 5 మహిళా పోలింగ్‌ కేంద్రాలు
- ఓటింగ్‌ పెంపు లక్ష్యంగా నిర్ణయం
- కేంద్రాల ఎంపికలో యంత్రాంగం



ఎన్నికల ప్రచార రథం

కరీంనగర్‌ అర్బన్‌: ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఆధునికతను అందిపుచ్చుకుంటూనే రానున్న శాసనసభ ఎన్నికల్లో ఓటింగ్‌ వందశాతం నమోదవడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఇప్పటికే ఓటరు విశిష్టతను తెలుపుతూ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా పోలింగ్‌ కేంద్రాలను కూడ ఆకర్షణీయంగా మలచాలని భావించింది. ఈ మేరకు జిల్లాకు ఒక దివ్యాంగుల పోలింగ్‌ కేంద్రం, యూత్‌ పోలింగ్‌ కేంద్రం ఉండేలా చర్యలు చేపట్టాలని నిర్దేశించింది. అలాగే జిల్లాలో నియోజకవర్గానికి 5 మహిళా పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్‌ డా.బి.గోపి ఆయా కేంద్రాల ఏర్పాటుకు పోలింగ్‌ కేంద్రాలను గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు. వీలైనంత త్వరగా కేంద్రాలను గుర్తించాలని సూచించారు.

నియోజకవరానికి 5 మహిళా పోలింగ్‌ కేంద్రాలు

జిల్లాలో కరీంనగర్‌ మినహా మూడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రతి నియోజకవర్గంలో 5 మహిళా పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో కరీంనగర్‌, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్‌ నియోజకవర్గాలుండగా 20 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మండలానికో మహిళా కేంద్రం ఉండనుండగా ఇందులో ఎన్నికల సిబ్బంది, పోలీస్‌, పర్యవేక్షణ, భద్రతా అధికారులు అందరూ మహిళలే విధులు నిర్వహించనున్నారు. తొలిసారిగా ఈ విధానం కర్ణాటక రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. సత్ఫలితాలు రావడంతో మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి పోలింగ్‌ సిబ్బంది, రక్షణ, పర్యవేక్షణ కలిపి మొత్తం 8మంది అవసరం. ఈ లెక్కన 160మంది అవసరం కాగా మహిళా అధికారులు, పోలీసులు, ఉద్యోగులను నియమించనున్నారు. తదనుగుణంగా జాబితాను సిద్ధం చేస్తున్నారు. కేవలం ఉద్యోగులే మహిళలు ఉండనుండగా ఓటర్లు జనరల్‌గానే ఉండనున్నారు.

దివ్యాంగులు, యూత్‌కు ఒక కేంద్రం

జిల్లాలో దివ్యాంగులు, యువతకు ఒక్కో పోలింగ్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. యువత, దివ్యాంగుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నారు. దివ్యాంగుల పోలింగ్‌ కేంద్రం మొత్తం సిబ్బంది దివ్యాంగులే ఉండనుండగా యువత కోసం ఏర్పాటు చేసే పోలింగ్‌ కేంద్రంలో యువ అధికారులు, ఉద్యోగులు, పోలీసులు పోలింగ్‌ సిబ్బందిగా వ్యవహరించనున్నారు. అయితే వీటిని జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా యువతకు కూడ నియోజకవర్గానికి 5 చొప్పున ఏర్పాటు చేసే అవకాశముందని తెలుస్తోంది.

పోలింగ్‌ కేంద్రస్థాయి ప్రణాళిక

గతంలో కన్నా భిన్నంగా కొత్త విధానాలకు శ్రీకారం చుట్టారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తుగా ఈ సారి పోలింగ్‌కేంద్ర స్థాయి ప్రణాళిక అమలు చేయబోతున్నారు. పోలింగ్‌ కేంద్రానికి సంబంధించిన పూర్తి సమాచారం, స్టాండర్డు ఆపరేటింగ్‌ ప్రొసిజర్‌(ఎస్‌వోపీ)తో ఈ ప్రణాళిక ఉంటుంది. ఒక్కో పోలింగ్‌ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు.? సదుపాయాలు, ఇతర సమాచారం క్రోడీకరిస్తున్నారు. నియోజకవర్గ ప్రణాళికకు ఇదే కొలమానం కానుంది.

సర్వీస్‌ ఓటర్లకు ఈటీబీపీఎస్‌

ఇప్పటివరకు అధికారులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్‌ బ్యాలెట్‌ విధానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు ఉండటంతో తమ ఓటు హక్కు వినియోగించే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం పోస్టల్‌ బ్యాలెట్‌ పంపే సర్వీస్‌ ఓటర్ల కోసం ఈసారి 'ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్‌ పోస్టల్‌ బ్యాలెట్‌ సిస్టం'(ఈటీబీపీఎస్‌) విధానాన్ని అమలు చేయనున్నారు. దీని ద్వారా సాంకేతికతతోనే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఇప్పటివరకు పంజాబ్‌, ఉత్తరప్రదేశ్‌, ఉత్తరాఖండ్‌, మణిపూర్‌ రాష్ట్రాల ఎన్నికల్లో అమలు చేశారు.

ఈవీఎంలపై విస్తృత ప్రచారం

ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలో వివరిస్తూ ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గానికో ప్రచార వాహనం కేటాయించగా రోజుకో ప్రాంతంలో ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. వీవీ ప్యాట్‌, బీయూ, సీయూ పరికరాలు ఎలా పని చేస్తాయి, ఓటు వేసిన తరువాత జరిగే ప్రక్రియ, ఓటుకు ముందు చేసే పనులను ప్రాక్టికల్‌గా వివరిస్తున్నారు. ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తున్నారు.

మాచనపల్లి వాసికి అరుదైన అవార్డు

- ప్రొఫెసర్‌ లింగారెడ్డికి జైపూర్‌లో టెస్ట్‌ సోషల్‌ లీడర్‌ పురస్కారం అందజేత



అవార్డు అందుకుంటున్న అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ లింగారెడ్డి

జమ్మికుంట: జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన కాటిపల్లి లింగారెడ్డి హన్మకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాలలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. విద్యా బోధన, పరిశోధన, సామాజికరంగంలో విశిష్ట సేవలు అందించినందుకు జైపూర్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రొఫెసర్లు బీపీ.శర్మ, ఎన్‌డీ.మాథుర్‌, ఎస్‌ఎస్‌.మోడీ, రవికాంత్‌మోడీ, అనిల్‌ మెహతాల చేతుల మీదుగా టెస్ట్‌ సోషల్‌ లీడర్‌ అవార్డు–2023 అందుకున్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌గా వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టిన లింగారెడ్డిని 2023 అవార్డుకు ఎంపిక చేశారు. టెస్ట్‌ సోషల్‌ లీడర్‌ అవార్డు రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పత్తి విక్రయాలకు ఆధార్‌

- నిబంధనలు కఠినతరం
- తదనుగుణంగా కొనుగోళ్లకు ఏర్పాట్లు

కరీంనగర్‌ అర్బన్‌: పత్తి విక్రయించాలంటే ఇక ఆధార్‌ తప్పనిసరి. అక్రమాలకు క్లెం వేసేందుకు ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. దళారుల ఆగడాలకు చెక్‌ పెడుతూ రైతులే విక్రయించేలా పక్కా చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇక ఆధార్‌ ఉంటేనే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయనున్నారు. 2023– 24కు గానూ భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోళ్లకు సిద్ధమవుతుండగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కనీస మద్దతు ధర రూ.7,020గా ప్రకటించగా రైతులకు బయోమెట్రిక్‌ తప్పనిసరి చేశారు. తదనుగుణంగా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవేళ ఆధార్‌ కార్డు లేకుంటే ఆధార్‌ ప్రామాణీకరణ(అథెంటికేషన్‌) చేయించాలి. లేదా ఆధార్‌ నంబర్‌ లేనివారు రిజిస్ట్రేషన్‌ చేయించుకోవడవానికి ముందే ఆధార్‌ నమోదు కేంద్రంలో గానీ అధికారిక వెబ్‌సైట్‌లో కాని నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌ నంబర్‌ కేటాయించబడే వరకు ఆధార్‌ నమోదు గుర్తింపు స్లిప్‌, ఫొటో ఉన్న బ్యాంకు లేదా పోస్టాఫీస్‌ పాస్‌బుక్‌ లేదా పాన్‌కార్డు లేదా పాస్‌పోర్టు, ఓటరు కార్డు, డ్రైవింగ్‌ లైసెన్స్‌, లబ్ధిదారుడి ఫొటో కలిగి గెజిటెడ్‌ అధికారి జారీ చేసిన గుర్తింపు పత్రాలను ఏదైనా అందజేయాలి.



పత్తి కొనుగోళ్లు

నిబంధనలు కఠినతరం

పత్తి కొనుగోళ్లలో కరీంనగర్‌, జమ్మికుంట, చొప్పదండి, గంగాధర, గోపాల్‌రావుపేట మార్కెట్లతో పాటు జిన్నింగ్‌ మిల్లుల్లో పత్తిని కొనుగోలు చేస్తుండటం పరిపాటి. అయితే దళారులు గ్రామాల్లో రైతుల వద్ద కొనుగోలు చేసి అదే రైతుల పేరుతో సీసీఐ అధికారులకు, వ్యాపారులకు లాభసాటిగా విక్రయిస్తుండటం జరిగే తంతు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కఠినతరం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ సారి సీసీఐ రంగంలోకి దిగనుండగా జిల్లాలో 19 కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు చేయనుంది. ఈ క్రమంలో ప్రతి కేంద్రంలో ఆధార్‌ ప్రామాణీకరణకు ఏర్పాట్లు చేశారు. వేలిముద్ర రాకుంటే ఐరిస్‌ ద్వారా నిర్ధారించనున్నారు. ఆధార్‌ కార్డు లేనివారి వివరాలను అధికారులు తనిఖీ చేయనున్నారు. వేలిముద్ర, ఐరిస్‌ రాకుంటే వన్‌టైం పాస్‌వర్డ్‌ను ఉపయోగించనున్నారు. ఇది సాధ్యం కానపుడు భౌతిక ఆధార్‌ కార్డుపైన ఉన్న క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయనున్నారు. క్యూఆర్‌ కోడ్‌ రీడర్‌ను కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఆధార్‌ నిర్ధారణ తరువాతే పత్తిని కొనుగోలు చేయనున్నారు. నిర్ధారణ జరగకుంటే పత్తిని తిరిగి వెనక్కి తీసుకెళ్లాల్సిందే. దీపావళి తరువాత పత్తి కొనుగోళ్లు ఊపందుకోనుండగా ఇప్పటినుంచే సిద్ధం కావాలని కలెక్టర్‌ బి.గోపి సీసీఐ అధికారులను ఆదేశించారు.

ఆధార్‌ లింక్‌ అయినా ఖాతాకే నగదు

ఇక పత్తి విక్రయాల తదుపరి రైతుల ఖాతాకు నగదు జమ కావాలంటే ఆధార్‌ అనుసంధానం ఉండాల్సిందే. ఆధార్‌ అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు మాత్రమే నగదును బదిలీ చేయనున్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్‌ లేకుంటే డబ్బులు జమ కావు. అన్నదాతలు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్‌ అనుసంధానం చేసుకోవాల్సిందే. ఆధార్‌ లింక్‌ తరువాతే పంట ఉత్పత్తులను విక్రయించడం ఉత్తమం.

హెల్త్‌ ఎమర్జెన్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవారెడ్డి

కరీంనగర్‌: జిల్లావ్యాప్తంగా సీజనల్‌ వ్యాధులు ప్రబలి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం హెల్త్‌ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్‌ చేశారు. ఆదివారం ముకుందలాల్‌ మిశ్రా భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వైద్య సదుపాయం ప్రజలకు అందుబాటులో లేదన్నారు. సీజనల్‌ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌, జాండీస్‌ లాంటి వ్యాధులు ప్రబలి ప్రతి కుటుంబంలో జ్వర పీడితులు ఉన్నారని, వారికి వైద్యం అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైద్యం పడకేయడం మూలంగా ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు వెళ్తున్నారని ఇదే ఆసరాగా చేసుకొని ప్రైవేటు యాజమాన్యాలు రోగుల నుంచి ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఫీజులను నియంత్రించాల్సిన అధికారులు ఆ వైపుగా కన్నెత్తి చూడడం లేదన్నారు. బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలు తగినంతగా లేవని, ప్రతి బస్తీలో దవాఖానాలు ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందించాలని కోరారు. దోమల నివారణకు ఫాగింగ్‌ చేయాలని, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు లేకుండా శుభ్రం చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లాలో వెంటనే హెల్త్‌ ఎమర్జెన్సీ ప్రకటించి అన్ని రోగాలకు ఆరోగ్యశ్రీ వర్తింపజేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గిట్ల ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యు శ్రీనివాస్‌, సుంకరి సంపత్‌, జి రాజేశం, నాయకులు పుల్లెల మల్లయ్య, తిప్పారపు సురేష్‌, అరవింద్‌ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



రాజేందర్‌(ఫైల్‌)

జమ్మికుంట: రైలు కింద పడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన గంగారపు రాజేందర్‌(37) మండలం భీంపల్లి రైల్వేగేట్‌ వద్ద గేట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం పట్టణంలోని ఫ్లైఓవర్‌ బ్రిడ్జి సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది. రాజేందర్‌కు భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ తిరుపతి పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

జమ్మికుంట: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రామగుండం రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ గంగారపు తిరుపతి ప్రకారం.. పట్టణంలోని హౌసింగ్‌ బోర్డుకాలనీ సమీపంలోని రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని(55) వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు గ్రే కలర్‌ ప్యాంట్‌, బ్లూ కలర్‌ షర్ట్‌ ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని హుజూరాబాద్‌ మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసినవారు 994930474 నంబరుకు సంప్రదించాలని రామగుండం రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ తిరుపతి సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



నందం మృతదేహం

జమ్మికుంట: టాటాఏస్‌ వాహనం ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు చనిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని గండ్రపల్లి గ్రామానికి చెందిన సుంకరి నందం (62) సెప్టెంబరు 26న ఇంటి నుంచి పొలానికి వెళ్తున్నాడు. దారిలో వెనకనుంచి వచ్చిన టాటాఏస్‌ వాహనం ఢీకొట్టింది. కిందపడడంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి చనిపోయాడు. నందం కొడుకు కుమార్‌ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టాటాఏస్‌ డ్రైవర్‌ పులగోర గోపిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్‌ తెలిపారు.

ట్రాక్టర్‌ ఢీకొట్టడంతో మెకానిక్‌..



సలీం(ఫైల్‌)

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం ఫకీర్‌పేటకు చెందిన మహ్మద్‌ అబ్దుల్‌ సలీం(37) రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. సలీం బైక్‌ మెకానిక్‌గా నగునూరులో పనిచేస్తున్నాడు. ఆదివారం పనిమీద నగునూరుకు వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంపై ఫకీర్‌పేటకు వస్తుండగా మార్గంమధ్యలో జూబ్లీనగర్‌ దర్గావద్ద ఎదురుగా వస్తున్న ఇటుకలోడ్‌ ట్రాక్టర్‌ ఢీకొట్టింది. రోడ్డుపై ఎగిరిపడిన సలీం తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య షగుప్త బేగం, కుమారుడు, కూతురున్నారు. భార్య ఫిర్యాదు మేరకు రూరల్‌పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధికుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి

చిగురుమామిడి: చిగురుమామిడిలోని రాజన్నపల్లెలో వీధికుక్కల దాడిలో 18గొర్రెలు మృతిచెందాయి. ఆదివారం గొర్లకాపరి అన్న సమ్మయ్య తనఇంటి నుంచి గొర్రెలను మేతకు తీసుకెళ్తున్న క్రమంలో దారిలో నాలుగు నుంచి ఐదు వీధికుక్కలు గొర్రెలమందపై దాడి చేశాయి. ఈ ఘటనలో దాదాపు 18 గొర్రెలు మృతి చెందాయని బాధితుడు అన్న సమ్మయ్య రోదిస్తూ తెలిపాడు. అధికారులు ఆదుకోవాలని కోరాడు. విషయం తెలుసుకున్న మండల యాదవ సంఘం అధ్యక్షుడు ముక్కెర సదానందం బాధితున్ని ఓదార్చాడు. గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, పలువురు గ్రామస్తులు కూడా వాటి దాడిలో గాయపడ్డారని సదానందం తెలిపాడు.



వీధికుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

గుండెపోటుతో యువజన కాంగ్రెస్‌ నాయకుడు మృతి



సహృదయ్‌(ఫైల్‌)

రామడుగు: రామడుగు మండలం కోరటపల్లి గ్రామానికి చెందిన మండల యువజన కాంగ్రెస్‌ ఆధ్యక్షుడు మన్నె సహృదయ్‌ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం గుండెపోటుకు గురైన సహృదయ్‌ని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు మార్గంమధ్యలో మృతి చెందాడు. సహృదయ్‌ మృతిపై కాంగ్రెస్‌, ఇతర పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

సోషల్‌ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కేసులు పెట్టాలి



వన్‌టౌన్‌ సీఐకి ఫిర్యాదు చేస్తున్న ఎంఐఎం నాయకులు

కరీంనగర్‌క్రైం: సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చు పెడుతున్న వారిపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకులు వన్‌టౌన్‌ సీఐ రవికుమార్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎంఐఎం పార్టీ జెండాను కాల్చివేయడం, అసదుద్దీన్‌ ఓవైసీ, అక్బరుద్దీన్‌ ఓవైసీల దిష్టిబొమ్మలను దహనం చేయడం, సోషల్‌ మీడియాలో ఎంఐఎం పార్టీపై దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంఐఎం నాయకులు అన్నెమెల్ల సురేశ్‌, సాజిద్‌, అంజద్‌ ఖాన్‌, ఫర్హాజ్‌ అలీ,కరీంఖాన్‌, అబ్దుల్లా ఆసిమ్‌, ఖాజా మజరోద్దీన్‌, ఖదీర్‌ఖాన్‌, షేఖ్‌ సమీ, ఇస్మాయిల్‌, యాకూబ్‌ ఖాన్‌, అహ్మద్‌ ఖాన్‌, తదితరులు పాల్గొన్నారు.

రజాకార్‌ సినిమాను నిషేధించాలి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

కరీంనగర్‌: తెలంగాణలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీజేపీ కొత్త ఎత్తుగడలు వేస్తోందని, రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు రజాకార్‌ సినిమాను తీసి ఒకవర్గం మనోభావాలు దెబ్బతీసే విధంగా చూస్తోందని, సినిమాను నిషేధించాలని ముస్లిం జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌ ఎన్నికల సమయంలో కశ్మీర్‌ఫైల్స్‌ సినిమాను తీసుకువచ్చిన బీజేపీ ప్రభుత్వం, కర్నాటక ఎన్నికల్లో కేరళ స్టోరీని దింపిందని, తాజాగా తెలంగాణలో ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ముస్లింలను టార్గెట్‌ చేస్తూ.. రజాకార్‌ సినిమాను తీసి వివాదస్పదానికి దారితీసే విధంగా ఉందని ఆరోపించారు. ఈ ట్రైలర్‌ను గమనిస్తే ముస్లింలే పెద్ద నేరస్తులుగా చూపించే ప్రయత్నం చేశారన్నారు. బీజేపీవాళ్ల స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణలో మత విద్వేషాలు సృష్టించాలని శాయశక్తులా ప్రయత్నిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌ మైనార్టీ సీనియర్‌ నాయకులు సయ్యద్‌ నయీం, ఎండీ.సయ్యద్‌ జమీలుద్దీన్‌, ఆరిఫ్‌ సయ్యద్‌ మౌలానా సహబ్‌, సాజిద్‌ భాయ్‌, హాజి భాయ్‌,షేక్‌ నబీ, ఇస్మాయిల్‌ పాల్గొన్నారు.

దారి అడిగి.. ఏమార్చి..

ముస్తాబాద్‌(సిరిసిల్ల): 'అమ్మా రామలక్ష్మణపల్లెకు వెళ్లాలి.. దారి చెప్పు' అంటూ ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గుర్తు తెలియని ఇద్దరు యువకులు అడ్రస్‌ అడిగారు. 'చెప్తా బిడ్డా' అంటూ అరుగు దిగిన వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును తెంపుకుని బైక్‌పై పరారయ్యారు. బాధితుల కథనం ప్రకారం.. ముస్తాబాద్‌ మండలం గూడెం గ్రామానికి చెందిన బొప్ప మల్ల వ్వ(80) శనివారం రాత్రి ఇంటి బయట నిలబడి ఉంది. ఈక్రమంలో అటువైపు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు.. అమ్మా రామలక్ష్మణపల్లెకు వెళ్లాలే.. దారి చెప్పు అంటూ ఆగారు. మల్లవ్వ దారి చెబుతుండగానే ఓ యువకుడు ఆమె మెడలోని మూడు తులాల (36 గ్రాములు) బంగారు పుస్తెలతాడును తెంపగా, బైక్‌పై ఇద్దరూ పరారయ్యారు. వృద్ధురాలు దొంగ అంటూ అరిచేలోగా కొండాపూర్‌ వైపు వెళ్లిపోయారు. మల్ల వ్వ భర్త చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. గూడెంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.


చెత్తను ఎత్తిపోస్తున్న మేయర్, కమిషనర్


కలెక్టరేట్‌లో పరిశుభ్రత చర్యల్లో బ్యాంకు ఉద్యోగులు


విద్యుత్ భవన్‌లో ఎస్ఈ, ఇంజనీర్లు, ఉద్యోగులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్/సప్తగిరికాలనీ/కరీంనగర్ అర్బన్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని మేయర్ సునీల్‌రావు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆదివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో శ్రమదానం నిర్వహించారు. అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కమిషనర్ ప్రవుల్ దేశాయి, పారిశుధ్య కార్మికులు, వాకర్స్, మెప్మా సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. స్వయంగా చీపురు పట్టి ఊడ్చి శుభ్రం చేశారు. పరిసరాల్లో ఉన్న కలుపుమొక్కలను తొలగించారు. తడి పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య వాహనంలో పడవేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నగరంలో నిరంతరం కొనసాగించాలన్నారు.

పలు ప్రాంతాల్లో..

స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛతా హీ సేవ, ఏక్ దిన్ ఏక్ గంటలో భాగంగా ఆదివారం పలు కార్యాలయాలు, వీధుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శ్రమదానం చేసి శుభ్రపర్చారు.

- కలెక్టరేట్ పరిసరాల్లో పలు బ్యాంకుల ఉద్యోగులు శ్రమదానం చేశారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, ఎస్‌బీఐ ఏజీఎం రవిశేఖర్, నాబార్డు ఏజీఎం ప్రకాశ్, వివిధ శాఖల బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించి విద్యుత్ భవన్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్, డీఈలు చంద్రమౌళి, కాళిదాసు, గోపీకృష్ణ, ఎస్ఏవో రాజేశం, సుధీర్‌కుమార్, అంజయ్య, శ్రీనివాస్, ఏఓలతో పాటు మహిళా ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.
- 49వ డివిజన్ గంజ్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్ సోహన్ సింగ్ శ్రమదానం చేశారు.
- 30వ డివిజన్‌లో కార్పొరేటర్ నేతికుంట యాదయ్య ఆధ్వర్యంలో వీధులు ఊడ్చి శ్రమదానం చేశారు. 59వ డివిజన్ జ్యోతినగర్‌లో కార్పొరేటర్ గందె మాధవి ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి వీధులను శుభ్రం చేశారు. 1వ డివిజన్‌లో కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు.
- మానేరు వాకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మానేరు డ్యాం వాకింగ్ ట్రాక్ కట్టపై పెరిగిన పిచ్చి చెట్లు, చెత్తను తొలగించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, లేక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సురేశ్, మానేరు వాకర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఆనందం, అధ్యక్షులు కనకాచారి, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.
- సీడబ్ల్యూసీ గోదాంలో శ్రమదానం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు మొక్కలు నాటారు. వేర్‌హౌస్ మేనేజర్ శశిధర్, సిబ్బంది స్పందన, ప్రభురాకుమార్, ప్రదీప్, రవికుమార్,శివ పాల్గొన్నారు.
- యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు మానేరు డ్యాం పరిసరాల్లోని చెత్తను తొలగించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ అపర్ణరెడ్డి బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కరీంనగర్ మండలంలో..

- కరీంనగర్ మండలం చేగుర్తిలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రధాన వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. గ్రామపంచాయతీ ఎదుట స్వచ్ఛభారత్‌పై అవగాహన కోసం స్వశక్తి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ సీహెచ్.అరుణ, ఉప సర్పంచ్ విజయ, ఐకేపీ ఏపీఎం భువనచంద్ర, ఈజీఎస్ ఏపీవో శోభ, మహిళలు పాల్గొన్నారు.
- చెర్లభూత్కూర్‌లో నిర్వహించిన శ్రమదానంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.
- చామనపల్లిలో ఎంపీపీ లక్ష్మయ్య, సర్పంచ్ లక్ష్మిఐలయ్య, కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.
- బొమ్మకల్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఏఈ తిరుపతి ఆధ్వర్యంలో సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రపర్చారు.

కొత్తపల్లి మండలంలో..

- కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో నిర్వహించిన శ్రమదానంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- చింతకుంటలో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

- కొత్తపల్లిలోని 6వ వార్డులో శ్రమదానం చేపట్టి వార్డులను పరిశుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్ గున్నాల విజయ, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రమేశ్, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


శ్రమదానం చేస్తున్న వేర్‌హౌస్ సిబ్బంది


చేగుర్తిలో ముగ్గులు పరిశీలిస్తున్న ఎంపీడీవో


మల్కాపూర్‌లో శ్రమదానం చేస్తున్న ఎంపీడీవో


చెర్లభూత్కూర్‌లో శుభ్రపరుస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ


శ్రమదానంలో యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

'కాల్వ' ఆశయాలు నెరవేర్చాలి

- మంత్రి గంగుల కమలాకర్
- బొమ్మకల్‌లో కాల్వ నర్సయ్య విగ్రహావిష్కరణ


బొమ్మకల్‌లో యాదవ కమ్యూనిటీహాల్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌రూరల్: యాదవుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసిన సీపీఐ నేత కాల్వ నర్సయ్య యాదవ్ ఆశయాలు నెరవేర్చాలని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాల్వ నర్సయ్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. అనంతరం సీడీపీ నిధులు రూ.10లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీహాల్‌కు భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ సీపీఐ నాయకుడిగా పేదల సంక్షేమానికి కాల్వ నర్సయ్య చివరివరకు పనిచేసినట్లు తెలిపారు. యాదవ సంఘానికి గతంలోనే స్థలాన్ని కేటాయించి రూ.15 లక్షలు మంజూరు చేశామని, ప్రస్తుతం మరో రూ.10లక్షలు మంజూరు చేశామని అన్నారు. శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కాల్వ మల్లేశం, ప్రతినిధులు కాల్వ అశోక్, శ్రీనివాస్, బూస శంకర్, శ్రీకాంత్, రవీందర్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జ్ఞాపకశక్తి పోటీల్లో ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

సప్తగిరికాలనీ: బెంగళూరులో ఆదివారం జరిగిన జాతీయ జ్ఞాపకశక్తి పోటీల్లో కరీంనగర్‌లోని ఛేంజ్ లర్నింగ్ అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు ట్రైనింగ్ చీఫ్, మెమోరీ కోచ్ వేణుకుమార్ తెలిపారు. అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాండం కార్డ్స్, నేమ్స్ అండ్ ఫేసెస్, బైనరీ నెంబర్స్, స్పీడ్ స్పోకెన్ నెంబర్స్ వంటి పలు విభాగాల్లో జ్ఞాపక శక్తిని, మేధస్సును పరిశీలించి పోటీలు నిర్వహించి జాతీయ స్థాయి ర్యాంకులు, ప్రోత్సాహకాలను అందించినట్లు తెలిపారు. జిల్లాకు చెందిన శ్రీక్షేత్ర, ప్రభవ షణ్ముఖ్, భ్రువన్, మన్వీంద్ర, శ్రీజన్‌రెడ్డి (6వ తరగతి), హర్షిత్, అక్షయ కృష్ణ, మణిదీప్‌లు ప్రతిభ కనబర్చారని అన్నారు.

అలరించిన రేసో దివస్ 2023


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని రేసోనేన్స్ కోటా ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం రేసో దివస్ 2023 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆహుతులను అలరించింది. విద్యార్థులు కేరింతలు కొడుతూ నృత్యాలు చేస్తూ సంబురంగా గడిపారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని మేయర్ సునీల్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశంలోనే ప్రముఖ విద్యా సంస్థ అయిన రేసోనేన్స్ కోటా ఇన్‌స్టిట్యూట్‌ను కరీంనగర్‌లో ఏర్పాటు చేసి ఐఐటీ, నీట్ విద్యను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఐలెందర్ యాదవ్, రేసోనేన్స్ సంస్థ చైర్మన్ అంజిరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌కు చెందిన పలువురు యువకులు వార్డుసభ్యుడు తోట కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం బొమ్మకల్‌కు చెందిన సురేశ్, శ్రీకాంత్, వెంకటేశ్, వెంకటరమణ, సంపత్, లక్ష్మణ్, రాము, సాయివిష్ణు, అజయ్, సిద్ధు, జగదీశ్, హరీశ్, నవీన్, రాజశేఖర్ తదితరులకు మంత్రి గంగుల కమలాకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దాది సుధాకర్, వార్డుసభ్యుడు శంకర్, కాల్వ మల్లేశం, మల్లయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు త్వరగా ఇవ్వండి

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ అర్బన్: ప్రచార రథాల వాహనదారులకు బిల్లులను త్వరితగతిన చెల్లించాలని కలెక్టర్ బి.గోపి ఆదేశించారు. సెప్టెంబర్ 30న 'సాక్షి'లో 'బిల్లు తకరారు.. వాహనదారుల బేజారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రెండు నెలలకు పైగా బిల్లులు రాకుంటే ఏం చేస్తున్నారని మందలించినట్లు తెలిసింది. ఈవీఎం ప్రచార రథాల ద్వారా ప్రజలకు ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తుండగా పక్షం రోజుల్లోనే బిల్లులు ఇవ్వాల్సి ఉండగా నెలల తరబడి జాప్యం చేయడం విడ్డూరం.

ఆశా కార్యకర్తల మానవహారం


మానవహారంగా ఆశా కార్యకర్తలు

కరీంనగర్: ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. ఆదివారం ఆశా కార్యకర్తలు తెలంగాణ చౌక్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు అనేక పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందించటం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు వచ్చాయన్నారు. కనీస వేతనం నిర్ణయించాలని సమ్మె చేస్తుంటే నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా కోశాధికారి విజయలక్ష్మి, నాయకులు పద్మ, శోభ, విజయలక్ష్మి, రాజమణి, లలిత, శైలజ, శ్యామల, శంకరమ్మ, పరిమిత, లత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఈ–పంచాయతీ ఆపరేటర్ల దీక్షలు


దీక్షలో పాల్గొన్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

కరీంనగర్: ఈ–పంచాయతీ టెక్నికల్ వింగ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్లు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట చేస్తున్న శాంతియుత నిరాహార దీక్షలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం దీక్షా శిబిరాన్ని పలువురు సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ఈ–పంచాయతీ వింగ్ రాష్ట్ర ప్రధాన సలహాదారుడు రాజ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సంధ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ బొట్ల అంజయ్య, నారాయణదాసు, వెంకటస్వామి, రాంప్రసాద్, నిమ్మల శ్రీనివాస్, మంగ, నిర్మల, సతీశ్, నూనె శ్రీనివాస్, బండ ప్రవీణ్, వేదాంతం రాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

'స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలి'


మాట్లాడుతున్న పొలాడి రామారావు

కరీంనగర్: హరిత విప్లవ పితామహుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి దేశ వ్యవసాయ రైతాంగానికి తీరని లోటని, స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలని రైతు ప్రజా సంఘాల నాయకుడు పొలాడి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో రైతు ప్రజా సంఘాలు నిర్వహించిన స్వామినాథన్ సంతాప సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన కొత్తలో దేశంలో సరైన పంటలు పండక, ఆకలితో అలమటించి లక్షల మంది చనిపోయిన పరిస్థితిని చూసి చలించిన స్వామినాథన్ వైద్య విద్యను వదిలేసి వ్యవసాయ పరిశోధకుడిగా మారి అత్యుత్తమ వరి వంగడాలను సృష్టించి అన్నార్తుల ఆకలి తీర్చిన గొప్ప శాస్త్రవేత్త అని కొనియాడారు. అంతకుముందు స్వామినాథన్ చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చండుపట్ల నర్సింహారెడ్డి, నాయకులు పెండ్యాల రాంరెడ్డి, జున్నూతుల రాజిరెడ్డి, కేశవరెడ్డి, చెన్నమనేని పురుషోత్తమరావు, తాటిపల్లి రాజన్న, గోపాల్‌రెడ్డి, రూప్‌రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పారమిత' విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్: ఎన్నికల ఓటింగ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. నాటిక ప్రదర్శనలో ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారన్నారు. గెలుపొందిన గోలి సాయిచరణ్, చల్ల సాయిచరణ్, నట్ల అభిజయ్, బిళ్ల మణిదీప్, తొగరి రోహిత్, బబ్లీ లీయోనారో, పసుల్ల సాయికుమార్, కడారి సాయిచరణ్, చెప్యాల శ్రీతేజ్, అణాసు రాంపవణ్, కరవుజ శ్రీనిక్, బీరవెల్లి రిషికీర్తన్ విద్యార్థులకు కలెక్టర్ గోపి, డీఈవో జనార్దన్‌రావులు ప్రశంసాపత్రాలు, నగదు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత ప్రసాదరావు, డైరెక్టర్లు, ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వీయూఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రశాంత్, తిరుపతిరావు, కవిత, ప్రభాకర్‌రెడ్డి, షాదుల్లాలు అభినందించారు.

జైపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు


బర్త్ డే కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆదివారం కాంగ్రెస్ నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నారాయణగౌడ్ ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి బర్త్ డే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సదానందం, మల్లేశం, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్, శ్రీనివాస్, కుమారస్వామి, గణేశ్, రాజిరెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రవహించిన పెట్టుబడే ఆర్థిక చరిత్ర

కరీంనగర్ కల్చరల్: వలసవాదులు, దేశీయ వ్యాపారుల నుంచి విస్తరించిన పెట్టుబడి సంగతే భారత ఆర్థిక చరిత్ర అని స్వతంత్ర పరిశోధకుడు ఎస్‌ఏ. విద్యాసాగర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఫిలింభవన్ ।భారత ఆర్థిక చరిత్ర॥ అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. భారతదేశంలో ఐదాకులైన తేయాకు, పత్తి, నీలి మందు, నల్ల మందు, మల్బరీ ఆ వ్యాపారాల ద్వారా బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ తన పెట్టుబడిని ప్రారంభించిందన్నారు. పెట్టుబడికి, శ్రామికుడికి సరిహద్దులు ఉండవని, కష్టజీవం పేర్లను పెట్టుబడిదారుడు తుంచివేస్తూ ఉంటాడన్నారు. అనంతరం కార్ల్ క్లాట్స్కి రచన ×వ్యవసాయ సమస్య పుస్తకాన్ని ఎస్సారార్ ఆచార్యులు డాక్టర్ కె.రాజేంద్రం ఆవిష్కరించారు. సదస్సులో కందుకూరి అంజయ్య, సీపీ కుమార్, వి.పెంటయ్య, రవీంద్రనాథ్, చైతన్య, కూచికూరి కనకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



కరీంనగర్: తెలంగాణ విద్య చైతన్య వేదిక గౌడ విభాగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మంకమ్మతోటలో గల మాచర్ల గార్డెన్‌లో ఈనెల 2న జరిగే గౌడ ఉత్తమ ఉపాధ్యాయ ఆత్మీయ సన్మాన కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణగౌడ్ ఆవిష్కరించారు. గౌడ బాంధవులు, నాయకులు, యువత, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్‌గౌడ్, గౌరవ సలహాదారు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు మాచర్ల కిశోర్‌గౌడ్, బుర్ర విజయ్, బండారి రఘుగౌడ్, కోశాధికారి వడ్లకొండ హరీష్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగుల కిరణ్‌గౌడ్, కల్చరల్ సెక్రెటరీ వంగ శ్యాంగౌడ్, సంయుక్త కార్యదర్శులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, దూలం రమేశ్‌గౌడ్, కార్యదర్శి బండారి లక్ష్మణ్,పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

కరీంనగర్ కల్చరల్: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం నగరంలోని వాసవీ వృద్ధాశ్రమంలో పాటలు, భజనలు, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి వృద్ధాశ్రమం అధ్యక్షుడు చిట్టుమల్ల కొండయ్య బహుమతులు ప్రదానం చేశా రు. కార్యక్రమంలో తోట లక్ష్మణరావు, గంజి స్వరాజ్ బాబు, నారాయణ, రాజేంద్రప్రసాద్, కిషన్, వీరేశం, చిరంజీవి, ప్రభాకర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


అనిత (ఫైల్)

కరీంనగర్‌క్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన భూపతి అనిత తన భర్తతో గొడవ జరగగా గతనెల 27 తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


హర్డిల్స్‌లో క్రీడాకారిణి పరుగు


60 మీటర్ల పరుగు చేసేందుకు తొలి స్టెప్ వేస్తున్న క్రీడాకారులు

వారెవ్వా.. ఫీట్స్.. అదిరెన్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 9వ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శనను కనబరుస్తూ అదిరేటి విన్యాసాలు, వారెవ్వా అనిపించే ఫీట్లను జంప్స్, రన్స్ త్రోస్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాగా పలువురు క్రీడాకారిణిలు లాంగ్ జంప్, హర్డిల్స్, షార్ట్ రన్స్, స్టిపుల్ చేజ్, జావెలిన్‌త్రో చేసే క్రమంలో తీసిన చిత్రాలు అబ్బురపరిచేలా ఉన్నాయి.


లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి


జావెలిన్‌త్రో చేస్తున్న క్రీడాకారుడు

'ఎస్‌వీజేసీ'లో ఫ్రెషర్స్ డే


విద్యార్థుల నృత్య ప్రదర్శన

కరీంనగర్: ఎస్‌వీజేసీ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు తమ అనుభవాలను జూనియర్ ఇంటర్ విద్యార్థులతో పంచుకున్నారు. భారత సంస్కృతి, నాగరికత చాటి చెప్పే విధంగా నృత్య ప్రదర్శనలు, నాటికలతో అలరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మహిపాల్, వరప్రసాద్, రామిరెడ్డి, హరికృష్ణ, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం ఉదయం రాజ్‌భవన్ ప్రాంగణంలో శ్రమదానం చేశారు. రాజ్‌భవన్‌లోని పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి స్పందనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు శిల్పకళా వేదికగా 'మంథన్-2023'

సాక్షి, హైదరాబాద్: ప్రతీ ఏడాది అక్టోబర్ 2న నగరం వేదికగా నిర్వహించే 'మంథన్-2023' కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు. మంథన్ సంవాద్ ఆధ్వర్యంలోని ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని శిల్పకళా వేదికగా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ ఏడాది చర్చా కార్యక్రమాల్లో ఒడిశా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎస్.మురళీధర్, న్యూఢిల్లీ పాలసీ రీసెర్చ్ సెంటర్ ప్రెసిడెంట్ యామిని అయ్యర్ తదితరులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐటీ హబ్‌గా విశాఖ

- వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం
- ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోనే 50,000 ఉద్యోగాలు వైజాగ్‌లో..
- రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు
- ఏటా 3.5 లక్షల మంది తాజా గ్రాడ్యుయేట్స్ వస్తుండటమే రాష్ట్ర బలం
- పల్సస్ గ్రూపు అధ్యయన నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: రానున్న కాలంలో విశాఖ నగరం ఐటీ ఉద్యోగాలకు కేంద్రంగా మారనుంది. ఈ రంగంలో కొత్తగా కెరీర్ ప్రారంభించే వారికి అది అవకాశాల గని కానుంది. ముఖ్యంగా ఐటీ, ఐటీ ఆధారిత రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి. వచ్చే ఐదేళ్ల కాలంలో ఐటీ రంగంలో ఒక్క విశాఖపట్నంలోనే ఐదులక్షలకు పైగా ఉపాధి అవకాశాలు వస్తాయని పల్సస్ గ్రూపు తన అధ్యయన నివేదికలో వెల్లడించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశాఖపట్టణాన్ని పరిపాలన రాజధానిగా ప్రకటించడంతో పాటు ఇక్కడ ఉపాధి అవకాశాలపై అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించడంతో ఐటీ హబ్‌గా విశాఖ వేగంగా ఎదుగుతోందని పల్సస్ గ్రూపు సీఈఓ శ్రీనుబాబు గేదెల తెలిపారు. ఇప్పటికే ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, అమెజాన్, అదానీ డేటాసెంటర్ వంటివి రావడంతో పాటు ఆంధ్రయూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, పారిశ్రామిక రంగంలో నాలుగో తరం టెక్నాలజీని ప్రోత్సహించేందుకు కల్పతరువు పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు ఇక్కడ ఏర్పాటుకావడంతో అంతులేని ఉపాధి అవకాశాల నిధిగా విశాఖ ఎదుగుతోందన్నారు. ఈ ఏడాది భారతదేశం జీ20 సమావేశాలకు వేదికగా ఎంపిక కావడంతో ఆ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుని ఫార్మాస్యూటికల్, హెల్త్‌కేర్, ఐటీ, ఐటీ ఆధారిత సేవల్లో విశాఖపట్నానికి ఉన్న అవకాశాలు, అందుబాటులో ఉన్న మానవ వనరులను ప్రపంచ దేశాలకు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఏటా మూడు లక్షలకు పైగా విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకుంటుంటే అందులో ఒక్క విశాఖ చుట్టుపక్కల నుంచే 1.5 లక్షల మంది వస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశాఖకు ఇది కలిసొచ్చే అతిపెద్ద అంశమని ఆ నివేదికలో పేర్కొన్నారు.

వచ్చే ఐదేళ్లలో కొలువుల పండుగ..

ఇక రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు రానుండగా అందులో ఒక్క విశాఖలోనే 5 లక్షల ఉద్యోగాలు రానున్నట్లు పల్సస్ గ్రూపు అంచనా వేసింది. ఇందులో ఒక్క ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలోనే విశాఖలో 50,000 ఉద్యోగాలు వస్తాయని ఆ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం విశాఖలోని ఐటీ రంగం 25,000 మందికి ఉపాధి కల్పిస్తుంటే హెల్త్‌కేర్, ఫార్మా, మెరైన్ ఇండస్ట్రీస్, పర్యాటకం, రక్షణ, విద్య వంటి రంగాలు లక్ష మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ సంఖ్య ఐదేళ్లలో ఐదు లక్షలకు చేరుతుందని శ్రీనుబాబు వివరించారు.

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు



శ్రీవారి ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది



ఏపీ హైకోర్టు జస్టిస్ జైసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, అలహాబాద్ హైకోర్టు జస్టిస్ సంగీత చంద్ర



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జైసూర్య, జస్టిస్ రవినాథ్ తిలహరి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంగీత చంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించి సత్కరించారు.

ఓపీఎస్ అమలు చేయాల్సిందే

రాంలీలా మైదాన్ సభలో ఎన్‌ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ



ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. సీపీఎస్ నుంచి విరమించుకోవాలనుకునే రాష్ట్రాలకు ఆ అవకాశం ఇచ్చి రాష్ట్రాల స్వేచ్ఛను కాపాడేవిధంగా సమాఖ్య స్ఫూర్తిని చాటుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులతో భారీ బహిరంగ సభను నిర్వహించారు. జాతీయ కిసాన్ సంఘ్ నాయకుడు రాకేశ్ టికాయత్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలు హాజరైన ఈ సభలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ...ఉద్యోగుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టే విధంగా సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసుకుంటున్న రాష్ట్రాలకు పెన్షన్ నిధి ఇవ్వకపోవడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడమేనని దుయ్యబట్టారు. సీపీఎస్ కారణంగా రిటైర్ అయిన ఉద్యోగులు కేవలం నెలకు రూ.1,200-1,800 పింఛను పొందుతున్నారని, తద్వారా జీవనోపాధితో పాటు సామాజిక భద్రతను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భద్రతలో కీలకపాత్ర పోషించే పారామిలటరీ బలగాలకు కూడా పాత పింఛను విధానాన్ని నిరాకరించడం దారుణమని, వెంటనే అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభకు విజయ్‌కుమార్ (ఉత్తరప్రదేశ్), సుఖ్జీత్ సింగ్ (పంజాబ్), కల్వల శ్రీకాంత్, నరేశ్‌గౌడ్ (తెలంగాణ), వితేశ్ కండేల్కర్ (మహారాష్ట్ర), దారివాల్ (హరియాణ), ప్రదీప్ ఠాకూర్ (హిమాచల్ ప్రదేశ్), శాంతారం (కర్ణాటక)లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, రైల్వే, అటానమస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

- నారా లోకేశ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సవాల్
- మీ బాబు అన్నం తిని కాదు.. స్టీలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా?



సాక్షి, అమరావతి: చంద్రబాబు అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆయన తనయుడు నారా లోకేశ్ సిద్ధమా అని మాజీ మంత్రి పేర్ని నాని సవాల్ విసిరారు. చంద్రబాబు అన్నం తిని కాకుండా.. స్టీలు తెచ్చుకుని బతుకుతోంది వాస్తవం కాదా అని నిలదీశారు. అవినీతి కేసుల్లో విచారణ జరిగితే ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడటం ఖాయమన్నారు. విచారణకు సిద్ధంగా లేకుంటే నొక్కేసిన ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడని ప్రజలే కాదు.. టీడీపీ కార్యకర్తలు కూడా విశ్వసిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆత్మావలోకనం చేసుకోకుండా చంద్రబాబుపై అక్రమ కేసులు పెడుతున్నారని నారా లోకేశ్‌తోపాటు టీడీపీ నేతలు తెగ గగ్గోలు పెడుతున్నారని పేర్నినాని మండిపడ్డారు. బాబు అవినీతిపరుడు కాదు సచ్ఛీలుడని ఆయన కుటుంబం నమ్మితే 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

జూబ్లీహిల్స్ కొంప ఎవరు కట్టారు లోకేశ్?

హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్, మాదాపూర్ ఇళ్లు, ఎన్టీఆర్ ట్రస్టు భవనం, ఉండవల్లి కరకట్ట, మంగళగిరిలో పార్టీ కొంపలు ఎవరు కట్టారో చెప్పాలని లోకేశ్‌ను నిలదీశారు. కరకట్ట నివాసం ప్రభుత్వానిదని స్వయంగా చంద్రబాబే చెప్పారు. మరి ఓడిపోగానే ప్రభుత్వానికి ఎందుకు అప్పగించలేదని ప్రశ్నించారు. జనం సొమ్ము దోచుకున్నాడని బాబును అరెస్టు చేస్తే మాత్రం గంటలు మోగించాలా అని నిలదీశారు. మరోవైపు పవన్ కళ్యాణ్ లక్ష్యం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమేనన్నారు. 2019లో ఇదే పవన్.. చంద్రబాబు వెధవ, లుచ్చా అని, ప్రజల డబ్బు దోచేశాడని ప్రచారం చేశారని గుర్తు చేశారు. కాపులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లోనే పవన్ పర్యటిస్తున్నారని.. వారిని తాకట్టు పెడతావని కాపులకు తెలియదనుకుంటున్నావా అని మండిపడ్డారు. హరీశ్ రావు చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ మాట్లాడుతున్నారని.. చంద్రబాబు చేతిలో ఎన్టీఆర్‌కి అయినట్టే, హరీశ్ రావు చేతిలో కేసీఆర్‌కు కూడా అదే జరగొచ్చన్నారు.

పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గింది



శనగ పప్పు పంపిణీ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

- పప్పుల ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి
- ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది
- రాయితీపై శనగ పప్పు పంపిణీ మంచి నిర్ణయం
- వినియోగదారులకు మేలు చేసేలా హాకా నిర్ణయం
- 'భారత్ దాల్'ఆవిష్కరణలో మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలో పప్పుల వినియోగం పెరిగిందని..అదే సమయంలో ఉత్పత్తి భారీగా తగ్గిపోయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. దీంతో దేశ అవసరాలకు ఇతర దేశాల నుంచి పప్పులు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ నేపథ్యంలో దేశంలో పప్పుల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హాకా 'భారత్ దాల్'పేరుతో పంపిణీ చేస్తున్న రాయితీ శనగపప్పు కార్యక్రమాన్ని ఆదివారం హెచ్‌ఐసీసీలో కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ విదేశాల నుంచి కందిపప్పును పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నామన్నారు. కంది పండిస్తే మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత్‌దాల్ పేరుతో హాకా చేస్తున్న కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. మధ్యతరగతి, పేద వినియోగదారులకు ఇది ఎంతో మేలు చేస్తుందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.90 ఉన్న శనగపప్పును రూ.60కే అందించడంపై అభినందనీయమని తెలిపారు. కేంద్ర వినియోగదారులశాఖ కార్యదర్శి రోహిత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ రాయితీ శనగ పప్పు పంపిణీకి సంబంధించి తొలుత తమ జాబితాలో హాకా లేదన్నారు. అయితే హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాస్‌రావు తన వద్దకు పలుమార్లు వచ్చి హాకా గొప్పతనాన్ని, తెలంగాణ ప్రభుత్వ మద్దతు వివరించారని తెలిపారు. ఒక అవకాశం ఇచ్చి చూద్దామని హాకాకు శనగల పంపిణీ బాధ్యత అప్పగించామన్నారు. హాకా పనితీరు, ఏర్పాట్లు చూశాక మరింత నమ్మకం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, హాకా ఎండీ సురేందర్, జీఎం రాజ మోహన్, ఆగ్రోస్ ఎండి కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌గా ఆదిలాబాద్

- ఎమ్మెల్యే జోగు రామన్న
- సీఐఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



ఆవిష్కర్తలకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌ను పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఇందుకు పారిశ్రామికవేత్తలు, పట్టణ ప్రముఖుల సహకారం అవసరమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని డబ్ల్యూ కన్వెన్షన్ హాల్‌లో భారతీయ పారిశ్రామిక సమాఖ్య(సీఐఐ) ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపనపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని వనరులు, పెట్టుబడులు ఉన్నాయని, ఔత్సాహికులైన యువత అవకాశాలను అందిపుచ్చుకొని పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా గతంలో పత్తి ఉత్పత్తిలో ఆసియా ఖండంలోనే నంబర్ వన్‌గా ఉండేదన్నారు. 12.5లక్షల బేల్స్ నుంచి 2లక్షల బేల్స్ ఉత్పత్తి చేసే స్థాయికి జిన్నింగ్ పరిశ్రమ పడిపోవడంతో వ్యాపారులు అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వారి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటయ్యేలా కృషి చేస్తానన్నారు. అలాగే సింగరేణి కంపెనీ ఆధ్వర్యంలో మూతపడ్డ జిల్లా కేంద్రంలోని సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించేలా ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఐటీరంగంలో ప్రస్తుతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, పరిశ్రమల స్థాపనతో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు కోసం జిల్లా కేంద్రంలో 4వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేలా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఐటీ రంగంతోపాటు పరిశ్రమల ఏర్పాటుపై స్థానిక యువతకు అవగాహన కల్పించేందుకే ఈ సదస్సు నిర్వహించినట్లుగా సీఐఐ చైర్మన్ శేఖర్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ అడవులు, సంస్కృతితో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆదిలాబాద్ పారిశ్రామికంగానూ పురోగతి చెందాల్సిన అవసరముందన్నారు. యువత పారిశ్రామిక పెట్టుబడులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం నూతన ఆవిష్కర్తలకు ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, ఐటీ కోకన్వీనర్ రామకృష్ణ, సభ్యులు షేక్ షమీఒద్దీన్, బీడీఎన్‌టీ కంపెనీ ఎండీ సంజీవ్ దేశ్ పాండే, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్ నల్గొండ

- ముగిసిన రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు
- విజేతలకు ట్రోఫీలు అందించిన మంత్రి గంగుల కమలాకర్



చాంపియన్ జట్టుకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లో రెండురోజులు నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో నల్గొండ జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. అండర్-16 బాలబాలికల విభాగం, వ్యక్తిగత విభాగం, అండర్-14, 18, 20 విభాగాల్లో మొత్తం 101 పాయింట్లు సాధించింది. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 1220 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 15 నుంచి 17 వరకు హన్మకొండలో జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14, 18, 20 విభాగాల్లో వ్యక్తిగత చాంపియన్లుగా రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, ఖమ్మం, హన్మకొండ, ఆదిలాబాద్, కొత్తగూడెం జిల్లాలు నిలిచాయి. ఆదివారం రాత్రి ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

తెలంగాణలో సింథటిక్ ట్రాక్‌లు..

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో కూడా సింథటిక్ ట్రాక్‌లు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సమైక్య రాష్ట్రంతో పోలిస్తే రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. సింథటిక్ ట్రాక్‌ల ఏర్పాటు ఫలితంగా రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. కరీంనగర మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ నేటి ఓటమే రేపటి గెలుపునకు నాంది కావాలన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు నందెల్లి మహిపాల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హాజరైన వారందరికి రెండు రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, జిల్లా యువజన క్రీడాశాఖాధికారి కీర్తి రాజవీరు, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు స్టాన్లీజోన్స్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి నందెల్లి మహిపాల్, కడారి రవి, ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, పెటా సంఘం బాధ్యులు ఎండీ యూనిష్ పాష, వీర్‌పాల్ తో పాటు పలువురు కార్పొరేటర్లు, పీఈటీలు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన మనుషా (జగిత్యాల), ప్రదీప్తి (పెద్దపల్లి), శ్రావ్య (జగిత్యాల)



కాంస్యం సాధించిన బ్లెస్సీ (కరీంనగర్)

ట్రయల్ రన్ విజయవంతం



నీరు వస్తున్న డెలివరీ చానల్ వద్ద అధికారులు

దిలావర్‌పూర్: కాళేశ్వరం 27వ ప్యాకేజీ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఎత్తి పోతల పథకాన్ని ఆదివారం సంబంధిత నీటి పారుదలశాఖ అధికారులు ట్రయల్ రన్‌తో పరిశీలించారు. మండలంలోని గుండంపల్లి గ్రామ పరిసర గోదావరి పరీవాహక ప్రాంతంలో గల పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ పంపింగ్ మోటర్లను విడతలవారీగా ఆన్ చేసి ట్రయల్ రన్ చేపట్టారు. ఎక్కడా ఎలాంటి ఆటంకాలు లేకుండా డెలివరీ చానల్ వరకు నీరు రావడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 4న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పథకం ప్రారంభోత్సవానికి రానుండగా చకచకా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి తనయుడు, బీఆర్‌ఎస్ నాయకుడు అల్లోల గౌతంరెడ్డి పంప్‌హౌస్ ప్రాంతం, కేటీఆర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కే దేవేందర్‌రెడ్డి, బన్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు పాల్దె అనిల్, నీటి పారుదల శాఖ ఈఈ రామారావు, ఎంపీడీవో మోహన్, పాపహరేశ్వరాలయ కమిటీ మాజీ చైర్మన్ నార్వాడి భుజంగ్‌రావుపాటిల్, నాయకులు ధని రవి, కోడె నవీన్, సప్పల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన అర్చకులకు శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న నవీన్‌కుమార్

భైంసా: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధూపదీప నైవేద్యం కింద ఎంపికైన నూతన అర్చకులకు దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదిలాబాద్ జిల్లా సహాయ కమిషనర్ నవీన్‌కుమార్ బాసరలో శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. మరో రెండురోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. దేవస్థాన వైది కబృందం ఆగమశాస్త్ర పండితులతో శిక్షణ ఇస్తుండగా ఈవో విజయరామారావు పాల్గొన్నారు.

నిధులు కాపాడితే వేటా..?

- రాజన్న ఆలయ ఉద్యోగుల్లో అంతర్మథనం

వేములవాడ: వేములవాడ రాజన్న ఖాతా నుంచి రూ.5 కోట్లు తరలిపోతుండటాన్ని బయటకు లీక్ చేశాడంటూ ఆలయంలో పని చేస్తున్న పీఆర్వో చంద్రశేఖర్‌ను రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ డెప్యూటేషన్‌పై వేములవాడ నుంచి కొండగట్టుకు బదిలీ వేటు వేయడం ఆలయ ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. తమ ఆలయానికి సంబంధించిన నిధులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడాన్ని గమనించిన ఉద్యోగి ఇచ్చిన సమాచారంతోనే ప్రతిపక్షాలు, జేఏసీ వేములవాడ బంద్‌కు పిలుపునిచ్చాయని అధికార పార్టీ నేతలు గుర్రుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సదరు ఉద్యోగికి స్పెషల్ ఆర్డర్‌తో డెప్యుటేషన్‌పై కొండగట్టుకు బదిలీ చేశారు. కాగా ఉద్యోగి చేసిన తప్పేంటంటూ స్థానికంగా, ఉద్యోగ వర్గాల్లో ఆదివారం చర్చ సాగింది. రాజన్న భక్తులు చెల్లించిన డబ్బులను ఇక్కడ అవసరాలకు కేటాయించకుండా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడాన్ని అడ్డుకోవడంలో తప్పేంటని, ఉద్యోగిపై వేటు సరికాదన్న వాదన సర్వత్రా వినవస్తోంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ మూడుసార్లు వేములవాడ రాజన్నను దర్శించుకుని ఏటా బడ్జెట్‌లో రూ.100 కోట్లు చెల్లిస్తానని హామీ ఇచ్చారని, హామీ మేరకు డబ్బులు ఇవ్వకుండా ఏకంగా రాజన్న ఖాతాపైనే కన్నేసి రూ.5 కోట్లు తీసుకెళ్లేందుకు ప్రయత్నించడం విడ్డూరమంటూ ప్రతిపక్షాలు, జేఏసీ నాయకులు, స్థానికుల్లో చర్చ జరుగుతోంది. ఉద్యోగిపై వేటును విరమించుకోవాలన్న డిమాండ్ ఉద్యోగ సంఘాల నుంచి మొదలైనట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట

- అండర్-14 బాలుర చాంపియన్‌గా ఆదిలాబాద్



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ఆదిలాబాద్: కరీంనగర్‌లోని రీజినల్ స్పోర్ట్స్ స్కూల్లో సెప్టెంబర్ 29 నుంచి ఆదివారం వరకు నిర్వహించిన తొమ్మిదో సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. మొత్తం 13 పతకాలను గెలుచుకోగా, అండర్- 14 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. అండర్-14 విభాగంలో జావెలిన్ త్రోలో సతీశ్‌కుమార్ స్వర్ణ పతకం, లింగు రజత పతకం, 600 మీటర్ల పరుగులో పరశురాం రజత పతకం, 60 మీటర్ల పరుగులో రాథోడ్ విక్రమ్ కాంస్య పతకాలు సాధించారు. అండర్-16 విభాగంలో మెస్రం జగ్జీవన్ 80 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం, సోము లాంగ్‌జంప్, హైజంప్ ఈవెంట్లలో స్వర్ణ పతకాలను, జావెలిన్‌త్రోలో శ్రీకాంత్ స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. అండర్-18 విభాగంలో 2వేల మీటర్ల పరుగు పందెంలో అనిల్ రజత పతకం సాధించగా, అండర్-20 విభాగంలో హామర్ త్రోలో కరణ్‌చంద్ స్వర్ణ పతకం, అరుణ కాంస్య పతకం సాధించారు. మెన్స్ విభాగంలో రమేశ్ 10వేల మీటర్ల పరుగు పందెంలో రజత పతకం గెలుపొందాడు. అండర్-14 బాలురు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, కోచ్ విజయ రాకేశ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలురి గోవర్ధన్ రెడ్డి, పెటా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, స్వామి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- టీడీఎఫ్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి
- కస్టమ్ హైరింగ్ సెంటర్ ప్రారంభం



కస్టమ్ హైర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఉత్తమ రైతులు

చొప్పదండి: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని టీడీఎఫ్ భారత్ కార్యదర్శి మట్టా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని రుక్మాపూర్‌లో ఆదివారం కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. రుక్మాపూర్ సెంటర్‌లో 25 రకాల యంత్ర పనిముట్లను ఇవ్వడం జరిగిందన్నారు. మండల వ్యవసాయాధికారి వంశీక్రిష్ణ, సర్పంచ్ లింగయ్య, ఉప సర్పంచ్ చిరంజీవి, ఏఈవో ప్రసన్నకుమార్‌రెడ్డి, జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మావురం మల్లికార్జున్ రెడ్డి, సోమ రాజేశ్వర్ రెడ్డి, టీడీఎఫ్ కోఆర్డినేటర్ గాండ్ల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

మంచిమాట



గౌరవ మర్యాదలు

మర్యాద అనే మాటకి హద్దు, చెలియలికట్ట అనే అర్థాలున్నాయి. వ్యవహారంలో గౌరవమర్యాదలని కలిపి జంటపదాలుగా వాడుతాము. ఇతరుల చేత చెప్పించుకోకుండా తన హద్దుల్లో తాను ఉండటం మర్యాద. చెలియలికట్ట అంటే సముద్రానికి ఒడ్డు. నదులు, చెరువులు మొదలైన వాటికి ఒక ఒడ్డు ఉంటుంది. అవి కొన్ని సార్లు ఒడ్డుని తెగ కొట్టి విజృంభించటం చూస్తాం. కాని, సముద్రానికి ఎవరు ఒక ఒడ్డుని తయారు చేయలేదు. 'ఈ గీత దాటవద్దు' అని ఎవరూ కట్టడి చేయ లేదు. అయినా ఎటువంటి సమయంలోనూ చెలియలికట్టని దాటి సముద్రుడు భూభాగంలో ప్రవేశించటం చూడం మనం. మనిషి విషయం కూడా అంతే!

కొన్ని రకాలైన రీతి, రివాజులని, తీరు తెన్నులని ప్రవర్తనా నియమావళిని నేర్పే పద్ధతులు అనేకం ఉన్నాయి. చిన్నతనంలో ఇంట్లో పెద్దలు ఏం చేయాలి? ఏం చేయకూడదు? మొదలైన విషయాలని కొన్ని మాటలతోనూ, కొన్ని చేతలతోనూ నేర్పిస్తారు. కొన్ని చదువుకోటం వల్ల తెలుస్తాయి. కొన్ని ఎవరూ చెప్పరు. చెప్పాలని కూడా తెలియదు. ప్రతివ్యక్తి తనంతట తానుగా తెలుసుకుని అమలు చేయవలసి ఉంటాయి. ఎదుటి వారికి ఆ విషయం చెప్పటానికి ఇబ్బందిగా ఉంటుంది. అవతలి వారిని ఇబ్బంది పెట్టకుండా ధర్మబద్ధంగా ఉండే ప్రవర్తనని మర్యాద అనవచ్చునేమో! ఎవరి చేతా చెప్పించుకోకుండా తన పరిమితుల్లో తాను ఉండటం మర్యాద. సముద్రం గట్టు లేకపోయినా తన హద్దు తాను దాటనట్టు.

ఉదాహరణకి – ఒక గదిలోకి ప్రవేశించాం అనుకోండి. ముందు వెళ్ళిన వారు లోపలికి వెళ్ళాలి. వెనక నున్న వారు అప్పుడే కదా లోపలికి అడుగు పెట్టటానికి వీలు కలిగేది. అదే కాస్త పదవో, అధికారమో ఉన్న వాళ్ళు అయితే, కదలమని చెప్పలేరు. బహుళ అంతస్థుల భవనాల్లో లిఫ్ట్ దగ్గర తరచూ ఎదుర్కొనే సమస్య ఇది. చెపితే,"మాకు తెలియదా? మీరు చెప్పాలా? జరుగుతాం లెండి. అంత తొందర ఎందుకు?" అని పెద్ద బోధ చేస్తారు. నిజానికి చెప్పించుకున్నామే, అని సిగ్గుపడాలి. ముందు లోపలికి వెళ్ళిన వారు వెనక ఉన్న వారికి అవకాశం కలిగించాలనే నియమం ఎక్కడా రాసి లేదు. అయినా పాటించాలని తెలుసు కనకనే నీది తప్పు అనలేక ఎదురు దాడికి దిగటం.

ఎవరైనా నిద్రపోతూ ఉంటే గట్టిగా పాటలో, టీవీనో పెట్టుకోవటం గురించి ఎక్కడా ప్రస్తావన లేదు కనక నా ఇష్టం వచ్చినట్టు చేస్తాను అనటం మూర్ఖత్వం అవుతుందా? కాదా? నలుగురి మధ్యలో ఉన్నప్పుడు చికాకు కలిగించే చేష్టలు, శబ్దాలు చేయటం, జుగుప్సావహంగా ప్రవర్తించటం ఆమోదయోగ్యం కాదు కదా! వెకిలి చేష్టలు ఎప్పుడైనా, ఎక్కడైనా అమర్యాదగా పరిగణించ బడతాయి.

> సున్నితమైన విషయాలు ప్రస్తావించక పోవటం ఒక మర్యాద. ఏ విషయం ప్రస్తావిస్తే బాధ కలుగుతుందో దానిని తనంత తాను ఎత్తక పోవటం మర్యాదస్తుల లక్షణం. మర్యాద ఇచ్చి పుచ్చుకోవలసినది. వస్త్రధారణ, మాటతీరు, నడతలలో మర్యాద వ్యక్తమౌతుంది. మర్యాదస్తులకి మాత్రమే సమాజంలో గౌరవం లభిస్తుంది.

సభల్లో, సమావేశాలలో కొన్ని పాటించవలసిన పద్ధతులు నిర్దేశించ బడతాయి. కొన్ని పేర్కొనక పోయినా అమలు జరుగుతూ ఉంటాయి. సమాజంలో కూడా అంతే! ఉదాహరణకి పెద్దలు మాట్లాడుకుంటుంటే పిల్లలు మధ్యలో కలిగించుకో కూడదు. అసలు ఆ ప్రాంతంలో ఉండకూడదు. ఒక వేళ ఉండటం తటస్థిస్తే, పేరు పెట్టి పిలిచి మాట్లాడమంటే తప్ప నోరు విప్పకూడదు. రామాయణంలో రాముడు బాలకాండ మొత్తం మీద మాట్లాడిన మాటలు వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. మర్యాదాపురుషోత్తముడు కదా! సభల్లో కూడా ఇదే పాటించ వలసిన నియమం. మర్యాద ప్రవర్తన వల్ల లభిస్తుంది. అడిగితే రాదు. కనుకనే మర్యాద గౌరవంతో జత కలిసి ఉంటుంది.

– డా. ఎన్. అనంతలక్ష్మి


బౌద్ధవాణి

నీ మనసే నిన్ను ప్రశ్నిస్తుంది!

పోతలియుడు అనే వ్యక్తి ఆపణం అనే పట్టణంలో పెద్ద ధనవంతుడు. వ్యాపారం వ్యవసాయం మీద చాలా ధనం సంపాదించాడు. వెండి, బంగారు నగలు, వజ్రాలు పెట్టెల కొద్దీ ప్రోవు చేశాడు. వయస్సు మళ్ళగానే తాను సంపాదించినదంతా తన కొడుకులకి పంచేశాడు. సంపాదన కార్యక్రమాన్ని విరమించుకున్నాడు. కనీసం వారికి సలహాలు కూడా ఇవ్వడం మానేశాడు.

"మీ మీ ఆలోచనల్ని బట్టి, మీ అవసరాల్ని బట్టి మీరే వ్యాపారాల్ని నడుపుకోండి. వ్యవసాయం చేసుకోండి" అని చెప్పేవాడు. దానితో తాను కుటుంబాన్ని పరిత్యజించినట్లుగా భావించి, అలాగే కాలం గడుపుతూ ఉన్నాడు. తాను అన్నింటినీ వదులుకుని "సన్యసించాను" అనుకుంటూ ఉండేవాడు. కనిపించిన వారందరికీ– "నాదేముంది? నేను ఇప్పుడు ఒక సర్వం వదిలేసిన పరిత్యాగిని"అంటూ ఉండేవాడు. ఒకరోజున పోతలియుడు ఉదయం భోజనం ముగించుకుని వ్యాహ్యాళికి బయలు దేరాడు. శుభ్రమైన, విలువైన వస్త్రాలు ధరించాడు. కిర్రు చెప్పులు తగిలించుకున్నాడు. గొడుగు పట్టుకుని ఊరి చివరకు వెళ్ళాడు. అక్కడ ఎత్తైన సాలవృక్షాల వనానికి చేరాడు. ఆ వనంలో ఒక విశాల సాలవృక్షం కింది అరుగు మీద బుద్ధుడు కూర్చొని ఉన్నాడు. ఆయన అప్పుడే భిక్ష స్వీకరించి, భిక్షాపాత్ర కడిగి, ఆ అరుగు మీద ఒక పక్కన బోర్లించి, విశ్రాంతిగా కూర్చున్నాడు. పోతలియుడు బుద్ధుని దగ్గరకు వచ్చాడు. నమస్కరించి నిలబడ్డాడు.

"గృహపతీ! ఇదిగో ఇక్కడ కూర్చోవడానికి ఆసనాలు ఉన్నాయి గదా! కూర్చో" అన్నాడు. కానీ, పోతలియుడు అక్కడే అలాగే నిలబడ్డాడు. బుద్ధుడు మరో రెండు సార్లు చెప్పాడు. పోతలియుడు కూర్చోలేదు. అది గౌరవంతో కాదు. కోపంతో."తాను అన్నీ వదిలివేసినప్పటికీ తనని పరివ్రాజకునిగా గుర్తించక ఈ గౌతముడు పదే పదే "గృహపతీ" అంటున్నాడు ఏమిటి?"అనే ఆలోచన అతనిలో అసహనాన్ని కలిగించింది.



"గౌతమా! ఇప్పుడు నా దగ్గర ధనం లేదు. ధాన్యం లేదు. వెండి బంగారాలు లేవు. వజ్రాలు లేవు. అన్నీ నా వారసులకి ఇచ్చేశాను. ఇంటికీ, తిండికీ, కొద్దిపాటి అవసరాలకీ, వస్త్రాలకీ మాత్రమే వారి మీద ఆధారపడుతున్నాను. ఇప్పుడెవర్నీ తిట్టడం లేదు. అది చెయ్యండి ఇది చెయ్యండి అని కోపగించుకోవడం లేదు. ఇన్ని వదిలిన నన్ను ఇంకా 'గృహపతీ' అనే పిలుస్తున్నారు మీరు, ఇది తగునా?" అని ప్రశ్నించాడు కొద్దిగా అసహనంగా.

"పోతలియా! వ్యవహారాల్ని వదిలిపెట్టడం అంటే ఇవి కాదు. హింసను మానడం ద్వారా జీవహింసను వదిలిపెట్టాలి. ఇచ్చిన దాన్నే తీసుకోవాలి. ఇవ్వని దాన్ని దేన్నీ తీసుకోకూడదు. సత్యాన్ని పలకడం ద్వారా అసత్యాన్ని వదిలివేయాలి. చాడీలు చెప్పకుండా ఉండటం ద్వారా చాడీలు చెప్పడాన్ని వదిలేయాలి. అలోభం ద్వారా లోభాన్ని వదిలిపెట్టాలి. శాంతం ద్వారా కోపాన్ని వదులుకోవాలి. నిందలు మానడం ద్వారా నిందించే విధానానికి దూరం కావాలి. నిరహంకారం ద్వారా అహంకారాన్ని వదులుకోవాలి.

ఈ ఎనిమిది ధర్మాల్ని సాధించుకుంటే నీవు పరిత్యాగిని కాగలవు. "ఓ పోతలియా! హింస చేసే నీవు హింసను మానాక, మరలా ఎప్పుడైనా హింసకు పూనుకుంటే.. నీ మనస్సే నిన్ను ప్రశ్నిస్తుంది. హింస విషయం ఒక్కటే కాదు. నేను ఇప్పుడు చెప్పిన ఎనిమిది విషయాల్లోనూ అంతే... తప్పుగా, అకుశలంగా తలచి వదిలి పెట్టిన వాటిని తిరిగి పాటిస్తే నీ మనస్సే నిన్ను ప్రశ్నిస్తుంది. ఆ సంఘర్షణే నిన్ను సంస్కరిస్తుంది. సరైన దారిలో పెడుతుంది" అన్నాడు.

అకుశల ధర్మాల్ని వదలడమే పరిత్యాగం అని పోతలియుడు గ్రహించాడు. బుద్ధునికి ప్రణమిల్లాడు!

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

రాజోపచారాలు అందుకు...

"గీతం వాద్యం తథా నృత్యం త్రయ సంగీతముచ్యతే"... అన్నట్లు గీతం, వాద్యం, నృత్యం .. ఈ మూడూ సంగీతంలో అంతర్భాగాలే. అది త్రివేణీ సంగమం. అది ఎప్పుడూ ప్రశాంతంగా ఉండగలిగిన స్థితిని ఇస్తుంది. మొట్టమొదట సంగీతాన్ని ఎవరు పట్టుకున్నారు... అంటే భగవంతుడే. పరమశివుడికన్నా బాగా నృత్యం చేసేవారెవరు! శ్రీకృష్ణ పరమాత్మకన్నా వేణువు వాయించగల విద్వాంసుడెవరు! శంకరుడికన్నా దక్షిణా మూర్తిగా వీణ వాయించేదెవరు! వైదికమైన రూపాలు వేరయినా సరస్వతీ దేవి కూడా ఎప్పుడూ వీణ తోనే కన్పిస్తుంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అయితే మనసుకు ఒక లక్షణం ఉంటుంది. దానికున్న శక్తి – వేగం, యాంత్రీకరణ. ఇక్కడున్నట్టుంటుంది... క్షణాల్లో ఎక్కడికో వెళ్ళిపోతుంది. పూజలో కూర్చుంటాం.. శివాయనమః అంటూ చేతితో పువ్వును శివలింగం మీద ఉంచుతాం. తరువాత.. మంత్రాలు నోరు చెబుతుంటుంది, చెయ్యి పూలు వేస్తుంటుంది... కానీ మనసు మాత్రం మెల్లగా జారుకుని ఎక్కడికో వెళ్ళిపోతుంది. దేముడికి ఇది కాదు కావలసింది. ఆయన వీటితో సంతోషించడు. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యాప్రయచ్ఛతి/తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః... భక్తితో ఆకులు, పండ్లు, పూలు, నీళ్ళిస్తే నేను తీసుకుంటా... అవి చాలు నాకు... అంటాడు. కానీ చంచలమైన మనసును ఒకేచోట నిలబెట్టడం అంత తేలికయిన పనేమీ కాదు.




అందుకే ఏకాగ్రత లేనప్పుడు గంటలకొద్దీ పూజలొద్దు... సమయం ఉంటే 16 రకాలుగా సేవించు... లేదా 'పంచసంఖ్యోపచారిణీ'... అన్నారు.. గంధ, పుష్ప, ధూపం, దీపం, నైవేద్యాలతో చేయి.. దానికీ మనసు మొండికేస్తుందా... రాజోపచారాలు చెయ్యి. ... చామరం వెయ్యి, పాట విను, నృత్యం చెయ్యి... ఇవి మనసును బాగా పట్టుకుంటాయి. కంజదళాయతాక్షీ కామాక్షీ... అని కీర్తన అందుకున్నాడు శ్యామ శాస్త్రి..... కుంజరగమనే.. అని పాడాడు వాసుదేవాచార్యులవారు. శుక్రవారం మంటపంలో కామాక్షీ పరదేవత నడచివస్తుంటే ఏనుగు నడిస్తే ఎంత గంభీరంగా ఉంటుందో అంత నయనానందకరంగా ఉంటుందన్నాడు... అంటే ఆ కీర్తన వింటూంటే మనం అమ్మవారి నడకనే చూస్తున్నాం.. మనసుకు కళ్ళెం పడింది. ఆ తత్త్వం మనసును అలరించి శాంతినిస్తుంది. అందుకే గీతం, వాద్యం, నృత్యం మనసుకి ప్రశాంతతను ఇస్తాయి. అందుకే వాటిని రాజోపచారాల్లో చేర్చారు.

అసలు మనకంటే ప్రశాంతంగా ఉండాల్సింది .. భగవంతుడు. ఉద్వేగాలు ఎవరికి ఉండాలి? అదీ ఆయనకే. అందరి మనసుల్లో భగవంతుడున్నప్పుడు మన ఉద్వేగాలు, అశాంతి అన్నింటి సెగ ఆయనకే కదా తగులుతుంటుంది. ఆ వేడిని తట్టుకోవడానికే ఆయన అభిషేకం స్వీకరిస్తున్నాడట. నెత్తిన చల్లటి చంద్రుడిని కూడా ఉంచుకున్నాడని చమత్కారంగా చెప్పారు.

అమ్మవారు శక్తి స్వరూపం. శక్తి అంటే కదలిక. మరి అన్ని కదలికలతో అమ్మవారు ప్రశాంతంగా ఎలా ఉండగలుగుతారు... దానికి కాళిదాసు ... టారు కదా... సరిగమపదనిరతాం తాం... వీణా సంక్రాంత హస్తాంతాం... ఆ తల్లి చేతిలో వీణ పట్టుకుని సప్త స్వరాల్లో రమిస్తూ ఉంటుంది. అందుకే ఆమె ప్రశాంతంగా ఉంటుంది... అంటే సంగీతం మనసుకు ఏకాగ్రతను, శాంతిని ఇస్తుంది... చివరిదయిన మోక్ష సాధనకు వాగ్గేయకారులు కూడా సంగీతాన్నే సాధనంగా చేసుకుని తరించారు.

సినిమా



'లాల్ సలాం' పోస్టర్

సంక్రాంతికి సలాం

సంక్రాంతికి 'లాల్ సలాం' అంటున్నారు రజనీకాంత్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా రజనీకాంత్, కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లాల్ సలాం'. ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు. ఈ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. "లాల్ సలాం' చిత్రంలో ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్ పాత్రలో కనిపిస్తారు రజనీకాంత్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

సినిమా అంటే సులభం కాదు – నిర్మాత ఏఎం రత్నం



రత్నం కృష్ణ, నేహాశెట్టి, కిరణ్ అబ్బవరం, ఏఎం రత్నం

"రాజకీయం, వ్యాపారం.. ఇలా అన్నిరంగాలపై అవగాహన ఉన్నవాళ్లే మూవీస్ చేయగలరు. సినిమా అంత సులభం కాదు.. ఖర్చు, రిస్క్‌తో కూడిన పని. అయినా నేను ఇండస్ట్రీలో ఉన్నందుకు గర్విస్తున్నాను. కిరణ్‌తో మరో సినిమా చేస్తా.. ఆ చిత్రానికి నేనే దర్శకత్వం చేస్తాను" అని నిర్మాత ఏఎం రత్నం అన్నారు. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాతలు ఏఎం రత్నం, అంబికా కృష్ణ, దర్శకుడు అనుదీప్ కేవీ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. "పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'రూల్స్ రంజన్'. నేను సిక్స్ కొట్టడానికి దొరికిన లాస్ట్ బాల్ ఇది.. తప్పకుండా సిక్సర్ కొడతా" అన్నారు రత్నం కృష్ణ. "నిర్మాణ రంగంలో ఏఎం రత్నంగారు మాకు అండగా ఉన్నారు" అన్నారు మురళీకృష్ణ వేమూరి. "నేను నటించిన పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా ఇది" అన్నారు కిరణ్ అబ్బవరం.

మేడమ్ చీఫ్ మినిస్టర్



సూర్య రేవతి, మహేందర్ రెడ్డి

డా.సూర్య రేవతి మెట్టకూరు కథానాయికగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'మేడమ్ చీఫ్ మినిస్టర్'. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ– "ఇది సామాజిక చిత్రంలా అనిపిస్తోంది. ఐదు భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా హిట్టవ్వాలి" అన్నారు. "అమెరికాలో చదువుకుని, ఓ సంస్థ స్థాపించి, ఇండియాకొచ్చి ఐదు గ్రామాలను దత్తత తీసుకున్నాను. సమాజంలో జరుగుతున్న పరిస్థితులను చెప్పాలని ఈ సినిమా ఆరంభించాను. ఇది పొలిటికల్ చిత్రం కాదు.. పబ్లిక్ మూవీ" అన్నారు డా.సూర్య రేవతి. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ బి.కొండకండ్ల, కెమెరా: వల్లెపు రవికుమార్.



విగ్రహావిష్కరణలో అల్లు రామలింగయ్య కుటుంబ సభ్యులు

అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ

తెలుగు సినిమా గర్వించే లెజెండరీ సీనియర్ నటులు, దివంగత పద్మశ్రీ డా.అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆదివారం ఆయన 101వ జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అల్లు బిజినెస్ పార్క్‌లో అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని హీరో అల్లు అర్జున్ కుమారుడు అల్లు అయాన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లు రామలింగయ్య కుమారుడు, నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ– "వెయ్యి సినిమాలకుపైగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప నటులు నాన్నగారు. తనదైన నటనతో యాభై ఏళ్లపాటు ప్రేక్షకుల్ని అలరించిన ఆయన తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు" అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు రామలింగయ్య కుమార్తె సురేఖ, హీరో అల్లు శిరీష్‌తో పాటు అల్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జెంటిల్‌మన్‌లో భాగమవడం సంతోషం – ప్రాచీ తెహ్లాన్

"జెంటిల్‌మన్ 2' సినిమాలో నటించాలని నిర్మాత కేటీ కుంజుమోన్‌గారు ఫోన్ చేసినప్పుడు చాలా ఎగ్జయిటింగ్‌గా ఫీలయ్యాను. ఓ బ్లాక్ బస్టర్ మూవీ ఫ్రాంచైజీలో భాగమవుతున్నందుకు సంతోషంగా ఉంది" అని హీరోయిన్ ప్రాచీ తెహ్లాన్ అన్నారు. అర్జున్, మధుబాల, శుభశ్రీ ప్రధాన పాత్రల్లో శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'జెంటిల్‌మేన్'. కేటీ కుంజుమోన్ నిర్మించిన ఈ సినిమా 1993లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'జెంటిల్‌మన్ 2' నిర్మిస్తున్నారు కుంజుమోన్. చేతన్ చీను హీరోగా ఎ.గోకుల్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా అవకాశం రావడంపై ప్రాచీ తెహ్లాన్ మాట్లాడుతూ– "జెంటిల్‌మన్ 2' లో ఇప్పటి వరకు చేయనటువంటి పాత్ర చేస్తున్నాను. యాక్షన్ సన్నివేశాల్లోనూ మెప్పించబోతున్నాను. ఈ సీక్వెన్స్‌లో నటించటం సవాల్‌తో కూడుకున్నది.. ఇందుకోసం శిక్షణ తీసుకున్నాను. త్వరలోనే షూటింగ్‌లో పాల్గొనబోతున్నాను" అన్నారు.

మనసులను కదిలిస్తేనే గొప్ప చిత్రం – నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి

"ప్రేక్షకుల మనసులను కదిలిస్తేనే గొప్ప సినిమా అవుతుందని నమ్ముతున్నాను. అలా మా 'పెదకాపు 1' చిత్రం ప్రేక్షకుల మనసులను కదిలించింది. మా మూవీని ఆదరిస్తున్న ఆడియన్స్‌కి థ్యాంక్స్" అని నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి అన్నారు. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల



శ్రీకాంత్ అడ్డాల, ప్రగతి, విరాట్ కర్ణ, రవీందర్ రెడ్డి, ఛోటా కె.నాయుడు

రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 29న విడుదల అయింది. ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో శ్రీకాంత్ అడ్డాల మాట్లాడుతూ–"ప్రేక్షకులకి మంచి చిత్రాన్ని అందించాలని మా యూనిట్ అంతా చాలా కష్టపడి పని చేశాం" అన్నారు. "మా సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులకు థ్యాంక్స్" అన్నారు విరాట్ కర్ణ, ప్రగతి శ్రీ వాస్తవ. "పెదకాపు' చిత్రం నాకు పునర్జన్మ ఇచ్చింది" అన్నారు కెమెరామేన్ ఛోటా కె.నాయుడు.

రెండు భాగాలు?



విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ యాక్షన్ ఫిల్మ్ రూపొందనున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. అయితే ఈ చిత్రం రెండు భాగాలుగా రానున్నదనే టాక్ తాజాగా ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఓ సాధారణ కానిస్టేబుల్ గ్యాంగ్‌స్టర్‌గా ఎందుకు మారాల్సి వచ్చిందనే కోణంలో ఈ సినిమా కథనం ఉంటుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రీలీలను అనుకున్నారు. కానీ కాల్షీట్స్ సర్దుబాటు విషయంలో ఇబ్బందులు రావడంతో శ్రీలీల ఈ సినిమా నుంచి తప్పుకున్నారని, ఆమె స్థానంలో రష్మికా మందన్నాను తీసుకున్నారనే టాక్ వినిపిస్తోంది. గతంలో విజయ్–రష్మిక కాంబినేషన్‌లో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే.

రీల్స్

ప్రేమ పంచాయితీ



విషిక, శ్రీకాంత్, భరత్

భరత్, విషికా లక్ష్మణ్ జంటగా టి. గంగాధర దర్శకత్వంలో తెరకెక్కిన విలేజ్ లవ్ ఎమోషనల్ లవ్‌స్టోరీ 'ఏందిరా ఈ పంచాయితీ'. ఎం.ప్రదీప్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేసి, మాట్లాడుతూ– "ట్రైలర్ బాగుంది.. సినిమా పెద్ద హిట్ కావాలి" అన్నారు. 'సాక్ష్యాలు ఉన్నవన్నీ నిజం కావు.. ఆధారాలు లేనివి అబద్ధాలు కావు', 'కొన్ని ప్రేమలు పెళ్లితో మొదలవుతాయి, కొన్ని పెళ్లికి ముందే ఆగిపోతాయి.. ఆగిపోయిన ప్రేమను వద్దనుకుంటే.. పెళ్లితో మొదలయ్యే ప్రేమను నేను నీకు ఇవ్వాలనుకుంటున్నా' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

ఓ ఊరి ఆత్మకథ



శివ కంఠమనేని

శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా మల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. జి.రాంబాబు యాదవ్ సమర్పణలో కేఎస్ శంకర్ రావు, ఆర్. వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న రిలీజ్ కానుంది. మల్లి మాట్లాడుతూ– "ఒక ఊరికి ఆత్మ ఉంటే.. ఆ ఆత్మ తన కథ తానే చెబితే ఎలా ఉంటుంది? అనేది చిత్రకథాంశం" అన్నారు. "మంచి యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: సురేష్ భార్గవ్.

తలకోనలో ఏం జరిగింది?



అప్సరా రాణి


అప్సరా రాణి ప్రధాన పాత్రలో నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'తలకోన'. నగేష్ నారదాసి దర్శకత్వం వహించారు. స్వప్న శ్రీధర్ రెడ్డి సమర్పణలో దేవర శ్రీధర్ రెడ్డి (చేవెళ్ల) నిర్మించిన ఈ చిత్రం నవంబరులో విడుదల కానుంది. "కొంతమంది స్నేహితులతో కలిసి అడవికి వెళతారు హీరోయిన్. ఎంతమంది వెళ్లారు? ఎందరు తిరిగొచ్చారు? అక్కడ ఏం జరిగింది? అనే అంశాలతో ఈ చిత్ర కథ సాగుతుంది" అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సుభాష్ ఆనంద్ సంగీత దర్శకుడు.



క్వాలిఫయింగ్‌లో జ్యోతి సురేఖ ‘టాప్’

ఆసియా క్రీడల ఆర్చరీ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల కాంపౌండ్ క్వాలిఫయింగ్‌లో విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ 704 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ అదితి స్వామి 696 పాయింట్లతో నాలుగోర్యాంక్‌ను దక్కించుకుంది. టీమ్ విభాగంలోనూ భారత్‌కు టాప్ ర్యాంక్ దక్కింది. టీమిండియా 2087 పాయింట్లు స్కోరు చేసి నేరుగా క్వార్టర్ ఫైనల్లో పోటీపడనుంది. పురుషుల కాంపౌండ్ క్వాలిఫయింగ్‌లో ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే 709 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో, అభిషేక్ వర్మ 708 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచారు. పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్‌లో అతాను దాస్ 678 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ 675 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచారు. మహిళల రికర్వ్ క్వాలిఫయింగ్‌లో అంకిత 649 పాయింట్లతో పదో ర్యాంక్‌లో, భజన్ కౌర్ 640 పాయింట్లతో 14వ ర్యాంక్‌లో నిలిచారు.

పదిహేను పతకాలతో పండుగ



అవినాశ్ సాబ్లే

ఆసియా క్రీడల్లో ఆదివారం భారత క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు.... ఏకంగా 15 పతకాలతో పండుగ చేసుకున్నారు. అథ్లెటిక్స్‌లో అత్యధికంగా తొమ్మిది పతకాలు రాగా... షూటింగ్‌లో మూడు పతకాలు... బ్యాడ్మింటన్, గోల్ఫ్, బాక్సింగ్‌లో ఒక్కో పతకం లభించాయి. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ క్రీడాకారులు కూడా తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ రజతం, తెలంగాణ అథ్లెట్ అగసార నందిని కాంస్యం... తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ కాంస్యం... తెలంగాణ షూటర్ కైనన్ చెనాయ్ స్వర్ణం, కాంస్యంతో మెరిపించారు. రజత పతకం నెగ్గిన భారత బ్యాడ్మింటన్ జట్టులో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్ సభ్యులుగా ఉన్నారు. ఎనిమిదో రోజు పోటీలు ముగిశాక భారత్ 13 స్వర్ణాలు, 21 రజతాలు, 19 కాంస్యాలతో కలిపి మొత్తం 53 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

- ఆసియా క్రీడల్లో ఆదివారం ఒక్కరోజే భారత్‌కు 15 పతకాలు
- 9 పతకాలతో అదరగొట్టిన అథ్లెట్స్
- స్వర్ణాలతో మెరిసిన సాబ్లే, తజీందర్
- జ్యోతి యర్రాజీకి రజతం
- కాంస్యం సాధించిన నందిని

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అంచనాలను అందుకున్నారు. అటు సీనియర్లు, ఇటు జూనియర్లు కూడా సత్తా చాటడంతో భారత్ ఖాతాలో ఆదివారం ఒక్క అథ్లెటిక్స్‌లోనే 9 పతకాలు చేరాయి. ఇందులో 2 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ రేసు విషయంలో కాస్త వివాదం రేగినా... చివరకు రజతంతో కథ సుఖాంతమైంది. తెలంగాణకు చెందిన అగసార నందిని కూడా ఏషియాడ్ పతకాల జాబితాలో తన పేరును లిఖించుకుంది.

సత్తా చాటిన సాబ్లే

3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో అవినాశ్ సాబ్లే కొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల విభాగంలో గతంలో ఏ భారత అథ్లెట్‌కూ సాధ్యంకాని రీతిలో స్వర్ణ పతకంతో మెరిసాడు. 8 నిమిషాల 19.50 సెకన్లలో ఈవెంట్‌ను పూర్తి చేసిన సాబ్లే మొదటి స్థానంలో నిలిచాడు. 29 ఏళ్ల సాబ్లే ఈ క్రమంలో కొత్త ఆసియా క్రీడల రికార్డును నమోదు చేశాడు. 2018 జకార్తా క్రీడల్లో హొస్సేన్ కేహని (ఇరాన్: 8 నిమిషాల 22.79 సెకన్లు) పేరిట ఉన్న ఘనతను అతను సవరించాడు. 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ మహిళల విభాగంలో మాత్రం భారత్ నుంచి 2010 గ్వాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో సుధా సింగ్ స్వర్ణం గెలుచుకుంది.

తజీందర్ తడాఖా


తజీందర్‌పాల్

పురుషుల షాట్‌పుట్‌లో తజీందర్‌పాల్ సింగ్ తూర్ సత్తా చాటడంతో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. 2018 జకార్తా క్రీడల్లో స్వర్ణం గెలుచుకున్న అతను ఈసారి తన మెడల్‌ను నిలబెట్టుకున్నాడు. ఇనుప గుండును 20.36 మీటర్ల దూరం విసిరిన తజీందర్ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. తొలి రెండు ప్రయత్నాల్లో అతను ఫౌల్ చేసినా మూడో ప్రయత్నంలో 19.51 మీటర్ల దూరం గుండు వెళ్లింది. తర్వాతి ప్రయత్నంలో దానిని 20.06 మీటర్లతో అతను మెరుగుపర్చుకున్నాడు. ఐదో ప్రయత్నం కూడా ఫౌల్ అయినా... ఆఖరి ప్రయత్నంలో తన అత్యుత్తమ ప్రదర్శనతో పసిడిని ఖాయం చేసుకున్నాడు. పర్దుమన్ సింగ్, జోగిందర్ సింగ్, బహదూర్ సింగ్ చౌహాన్ తర్వాత వరుసగా రెండు ఆసియా క్రీడల్లో షాట్‌పుట్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన నాలుగో భారత అథ్లెట్‌గా తజీందర్ నిలిచాడు.

సిల్వర్ జంప్


మురళీ శ్రీశంకర్

పురుషుల లాంగ్‌జంప్‌లో భారత ఆటగాడు మురళీ శ్రీశంకర్ తనపై ఉన్న అంచనాలను నిలబెట్టుకున్నాడు. ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన మురళీ ఇక్కడ ఆసియా క్రీడల్లోనూ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. 8.19 మీటర్లు దూకిన శ్రీశంకర్ రెండో స్థానంలో నిలిచాడు. జియాన్ వాంగ్ (చైనా–8.22 మీ.), యుహావో షి (చైనా–8.10 మీ.) స్వర్ణ, కాంస్యాలు సాధించారు.

వహ్వా హర్‌మిలన్


హర్‌మిలన్ బైన్స్

1998 జనవరి... పంజాబ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉద్యోగి అయిన మాధురి సింగ్ మూడు నెలల గర్భిణి. అయితే క్రీడాకారుల కోటాలో ఉద్యోగం పొందిన ఆమె సంస్థ నిబంధనలు, ఆదేశాల ప్రకారం తన ప్రధాన ఈవెంట్ 800 మీటర్ల నుంచి 1500 మీటర్లకు మారి పరుగెత్తాల్సి వచ్చింది. 1500 మీటర్ల ట్రయల్‌లో పాల్గొని ఉద్యోగం కాపాడుకున్న మాధురికి ఆరు నెలల తర్వాత పాప పుట్టింది. ఆ అమ్మాయే హర్‌మిలన్ బైన్స్. నాలుగేళ్ల తర్వాత 2002 ఆసియా క్రీడల్లో మాధురి 800 మీటర్ల పరుగులోనే పాల్గొని రజత పతకం సాధించింది. ఇప్పుడు 21 ఏళ్ల తర్వాత ఆమె కూతురు ఆసియా క్రీడల్లో రజత పతకంతో మెరిసింది... అదీ 1500 మీటర్ల ఈవెంట్‌లో కావడం యాదృచ్ఛికం! ఆదివారం జరిగిన 1500 మీటర్ల పరుగును హర్‌మిలన్ 4 నిమిషాల 12.74 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది.

అజయ్‌కు రజతం, జాన్సన్‌కు కాంస్యం

పురుషుల 1500 మీటర్ల పరుగులో కూడా భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ కుమార్ సరోజ్, కేరళ అథ్లెట్ జిన్సన్ జాన్సన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్యాలు సొంతం చేసుకున్నారు. 3 నిమిషాల 38.94 సెకన్లలో అజయ్ రేసు పూర్తి చేయగా, 3 నిమిషాల 39.74 సెకన్లలో లక్ష్యం చేరాడు. ఈ ఈవెంట్‌లో ఖతర్‌కు చెందిన మొహమ్మద్ అల్‌గర్ని (3 నిమిషాల 38.38 సెకన్ల)కు స్వర్ణం దక్కింది.


అజయ్


జాన్సన్

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	133	72	39	244
దక్షిణ కొరియా	30	35	60	125
జపాన్	29	41	42	112
భారత్	13	21	19	53
ఉజ్బెకిస్తాన్	11	12	17	40
థాయ్‌లాండ్	10	6	14	30
చైనీస్ తైపీ	9	10	14	33
హాంకాంగ్	6	15	20	41
ఉ. కొరియా	5	9	5	19
ఇండోనేసియా	4	3	11	18

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

సీనియర్ సీమ జోరు


సీమా పూనియా

మహిళల డిస్కస్ త్రోలో సీమా పూనియా వరుసగా మూడో ఆసియా క్రీడల్లోనూ పతకంతో మెరిసింది. 2014లో స్వర్ణం, 2018లో కాంస్యం గెలిచిన సీమ ఈసారి కూడా కాంస్య పతకాన్ని తన మెడలో వేసుకుంది. 40 ఏళ్ల సీమ డిస్కస్‌ను 58.62 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచింది. దాదాపు 20 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో కామన్వెల్త్ క్రీడల్లోనూ 3 రజతాలు, 1 కాంస్యం నెగ్గిన సీమ ఇవి తనకు ఆఖరి ఆసియా క్రీడలని ప్రకటించింది. ర్యాంకింగ్ ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తానని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొంది.


జ్యోతి యర్రాజీ (ఇన్‌సెట్‌లో రజతంతో)

కాంస్యం నుంచి రజతానికి...

దాదాపు రెండున్నర నెలల క్రితం ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం సాధించిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ ఆసియా క్రీడల్లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. ‘ఫాల్స్ స్టార్ట్’ ఘటనతో కాస్త ఏకాగ్రత చెదిరినట్లు కనిపించిన జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌ను 12.91 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. చైనాకు చెందిన లిన్ యువీ (12.74 సెకన్లు), వూ యానీ వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. అయితే ‘ఫాల్స్ స్టార్ట్’ వివాదం అనంతరం వూ యానీని నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. నిబంధనల ప్రకారం రెండో స్థానంలో నిలిచిన జ్యోతికి రజతం ఖాయమైంది. ఆసక్తికర అంశం ఏంటంటే జ్యోతి స్వర్ణం నెగ్గిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ ఇదే వూ యానీ (చైనా) ఇదే తరహాలో ఫాల్స్ స్టార్ట్ చేసి డిస్‌క్వాలిఫై అయింది.

ఏం జరిగిందంటే...

మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్స్‌లో ఎనిమిది మంది తలపడ్డారు. అయితే గన్ మోగి అధికారికంగా పరుగు ప్రారంభించక ముందే ‘ఫాల్స్ స్టార్ట్’ అయింది. దాంతో రిఫరీ ఇద్దరు అథ్లెట్లు వూ యానీ, జ్యోతిలకు రెడ్‌కార్డ్ చూపించి డిస్‌క్వాలిఫైగా ప్రకటించారు. అయితే దీనిపై జ్యోతి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. తన తప్పేమీ లేదని, సరిగ్గా విచారించమంటూ నిరసన వ్యక్తం చేసింది. అప్పటికి ఎలాంటి చర్య తీసుకోకుండా వీరిద్దరిని రేసులో పాల్గొనేందుకు నిర్వాహకులు అనుమతించారు. దాంతో పరుగు మళ్లీ ప్రారంభమైంది. రేసు ముగిసిన తర్వాత నిర్వాహకులు స్లో మోషన్ వీడియో రీప్లేల ద్వారా ఏం జరిగిందో తెలుసుకున్నారు. గన్ మోగక ముందే వూ యానీ పరుగుకు సిద్ధం కావడంతో పాటు అప్పటికే ఒక అడుగు లైన్ బయటకు కూడా వేసినట్లు ఇందులో స్పష్టంగా కనిపించింది. దాంతో జ్యోతి డిస్‌క్వాలిఫికేషన్‌ను రద్దు చేసి వూ యానీపై మాత్రమే చర్య తీసుకున్నారు. దీంతో భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధికారికంగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకపోయింది. తొలి ఆసియా క్రీడల్లోనే తాను రజతం గెలుచుకోవడం పట్ల జ్యోతి సంతోషం వ్యక్తం చేసింది.

‘నందివర్ధనం’


కాంస్యంతో నందిని

గత కొంత కాలంగా వేర్వేరు వేదికలపై మెరుగైన ప్రదర్శనలతో సత్తా చాటుతూ వచ్చిన తెలంగాణ అథ్లెట్ అగసార నందిని అసలు సమయంలో తన ఆటను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో పాల్గొన్న తొలిసారి కాంస్యంతో మెరిసింది. ఏడు క్రీడాంశాల సమాహారమైన మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో నందిని మూడో స్థానంలో నిలిచి కంచు పతకాన్ని సొంతం చేసుకుంది. రెండు రోజుల పాటు జరిగిన ఏడు ఈవెంట్లలో కలిపి నందిని 5712 పాయింట్లు సాధించింది. హెప్టాథ్లాన్‌లోని తొలి ఆరు ఈవెంట్లు ముగిసేసరికి నందిని ఐదో స్థానంలో నిలిచింది. 100 మీటర్ల హర్డిల్స్ (4వ స్థానం), హైజంప్ (9వ స్థానం), షాట్‌పుట్ (8వ స్థానం), 200 మీటర్ల పరుగు (1వ స్థానం), లాంగ్‌జంప్ (3వ స్థానం), జావెలిన్ త్రో (9వ స్థానం)... ఇలా వరుసగా ఆమె ప్రదర్శన కొనసాగింది. అయితే చివరి ఈవెంట్ 800 మీటర్ల పరుగులో సత్తా చాటడంతో కాంస్యం ఖాయమైంది. ఈ పరుగును 2 నిమిషాల 15.33 సెకన్లలో పూర్తి చేసిన నందిని అగ్ర స్థానంలో నిలిచింది. దాంతో ఓవరాల్ పాయింట్లలో ఆమె మూడో స్థానానికి ఎగబాకింది. 2018 ఆసియా క్రీడల హెప్టాథ్లాన్‌లో స్వర్ణం సాధించిన మరో భారత అథ్లెట్ స్వప్న బర్మన్ చివరి వరకు పోటీలో నిలిచినా... ఓవరాల్‌గా 5708 పాయింట్లతో నాలుగో స్థానానికే పరిమితమైంది. పేద కుటుంబం నుంచి వచ్చి నార్సింగిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదివిన నందిని అదే పాఠశాలలో నెలకొల్పిన అథ్లెటిక్స్ అకాడమీ తొలి బ్యాచ్ విద్యార్థిని. ప్రస్తుతం సంగారెడ్డిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ డిగ్రీ కళాశాలలో బీబీఏ చదువుతున్న నందినికి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ తాజా విజయానికి రూ. 1 లక్ష నగదు ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు.

సూపర్ కైనన్...

- పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో రెండు పతకాలు నెగ్గిన హైదరాబాద్ షూటర్
- టీమ్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో కాంస్యం సొంతం
- 22 పతకాలతో ఆసియా క్రీడలను ముగించిన భారత షూటింగ్ బృందం


స్వర్ణ పతకాలతో పృథ్వీరాజ్, జొరావర్ సింగ్ సంధూ, కైనన్ చెనాయ్


రజత పతకాలతో రాజేశ్వరి కుమారి, మనీశా కీర్, ప్రీతి రజక్

ఆసియా క్రీడల్లో భారత షూటర్లు తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. షూటింగ్ క్రీడాంశం చివరిరోజు భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం కలిపి మూడు పతకాలు వచ్చాయి. ఓవరాల్‌గా భారత షూటర్లు ఈ క్రీడల్లో ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, ఆరు కాంస్యాలతో కలిపి మొత్తం 22 పతకాలు గెలిచారు. ఆఖరి రోజు పురుషుల, మహిళల ట్రాప్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు జరిగాయి. పురుషుల ట్రాప్ టీమ్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన కైనన్ చెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టు 361 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల కొత్త రికార్డును నెలకొల్పింది. క్వాలిఫయింగ్‌లో కైనన్ 122 పాయింట్లు, జొరావర్ 120 పాయింట్లు స్కోరు చేసి టాప్-2లో నిలిచి వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్‌కు అర్హత పొందారు. వ్యక్తిగత విభాగంలో ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో జొరావర్ 23 పాయింట్లతో ఐదో స్థానంలో నిలువగా... కైనన్ 32 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం గెల్చుకున్నాడు. మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో రాజేశ్వరి కుమారి, మనీశా కీర్, ప్రీతి రజక్‌లతో కూడిన భారత జట్టు 337 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది.



రజతంతో ముగింపు...

ఆసియా క్రీడల్లో తొలిసారి పసిడి పతకం సాధించే అవకాశాన్ని భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు చేజార్చుకుంది. ఫైనల్లో భారత్ 2–3తో చైనా చేతిలో ఓడింది. తొలి మ్యాచ్‌లో లక్ష్య సేన్ 22–20, 14–21, 21–18 తో షి యుకీపై గెలిచి భారత్‌కు 1–0 ఆధిక్యం ఇచ్చాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ 21–15, 21–18తో లియాంగ్ వెకింగ్–వాంగ్ చాంగ్ జంటను ఓడించడంతో భారత్ 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో శ్రీకాంత్ 22–24, 9–21తో లి షిఫెంగ్ చేతిలో ... నాలుగో మ్యాచ్‌లో ధ్రువ్–సాయిప్రతీక్ ద్వయం 6–21, 15–21 తో లియు యుచెన్–జువాన్‌యి ఒయు జోడీ చేతిలో ఓడిపోవడంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో గాయంతో ఫైనల్‌కు దూరమైన భారత నంబర్‌వన్ ప్రణయ్ స్థానంలో మిథున్ ఆడాల్సి వచ్చింది. మిథున్ 12–21, 4–21 తో హాంగ్యాంగ్ వెంగ్ చేతిలో ఓటమి చెందాడు.

అదితికి రజతం

ఆసియా క్రీడల్లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా గోల్ఫర్‌గా ఘనత



రెండేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో త్రుటిలో కాంస్య పతకం కోల్పోయిన భారత మహిళా గోల్ఫర్ అదితి అశోక్ ఆసియా క్రీడల్లో మాత్రం సత్తా చాటుకుంది. ఆదివారం ముగిసిన మహిళల గోల్ఫ్ వ్యక్తిగత విభాగంలో కర్ణాటకకు చెందిన 25 ఏళ్ల అదితి 17 అండర్ 271 స్కోరుతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. తద్వారా ఆసియా క్రీడల్లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా గోల్ఫర్‌గా ఆమె ఘనత సాధించింది. గతంలో పురుషుల వ్యక్తిగత విభాగంలో లక్ష్మణ్ సింగ్ (1982), శివ కపూర్ (2002) స్వర్ణాలు, రాజీవ్ మెహతా (1982) రజతం గెలిచారు.

భారత్, కొరియా మ్యాచ్ ‘డ్రా’

ఆసియా క్రీడల మహిళల హాకీ ఈవెంట్‌లో భారత జట్టు తొలి ‘డ్రా’ నమోదు చేసింది. ఆదివారం దక్షిణ కొరియాతో జరిగిన పూల్ ‘ఎ’ మూడో లీగ్ మ్యాచ్‌ను భారత్ 1–1 గోల్‌తో ‘డ్రా’ చేసుకుంది. కొరియా తరఫున చో హైజిన్ (12వ ని.లో), భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (44వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ప్రస్తుతం మూడు మ్యాచ్‌ల తర్వాత భారత్, కొరియా ఏడు పాయింట్లతో సమంగా ఉన్నా... మెరుగైన గోల్స్ అంతరం కారణంగా భారత్ టాప్ ర్యాంక్‌లో, కొరియా రెండో ర్యాంక్‌లో ఉంది. లీగ్ దశ తర్వాత టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను హాంకాంగ్‌తో మంగళవారం ఆడుతుంది.

భారత చెస్ జట్ల గెలుపు

ఆసియా క్రీడల టీమ్ చెస్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు మూడో రౌండ్‌లో గెలుపొందాయి. ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, గుకేశ్, పెంటేల హరికృష్ణలతో కూడిన భారత జట్టు 3–1తో కజకిస్తాన్‌ను ఓడించగా... కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వంతిక అగర్వాల్, వైశాలిలతో కూడిన భారత జట్టు 3.5–0.5తో ఇండోనేసియాపై గెలిచింది. మూడో రౌండ్ తర్వాత భారత మహిళల జట్టు ఆరు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో... ఐదు పాయింట్లతో భారత పురుషుల జట్టు రెండో ర్యాంక్‌లో ఉన్నాయి.

నిఖత్ జరీన్‌కు చుక్కెదురు

- సెమీస్‌లో ఓడిన భారత స్టార్ బాక్సర్
- కాంస్య పతకంతో సరి
- సెమీస్‌లో పర్వీన్ హుడా
- జాస్మిన్‌కు నిరాశ


నిఖత్

కచ్చితంగా స్వర్ణ పతకంతో తిరిగి వస్తుందనుకున్న భారత స్టార్ బాక్సర్, ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్‌కు ఆసియా క్రీడల్లో అనూహ్య ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన మహిళల 50 కేజీల విభాగం సెమీఫైనల్లో నిఖత్ 2–3తో రక్సత్ చుథామట్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. దాంతో ఈ తెలంగాణ బాక్సర్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రక్సత్‌ను అలవోకగా ఓడించిన నిఖత్‌కు ఈసారి గట్టిపోటీ ఎదురైంది. పక్కా ప్రణాళికతో ఈ బౌట్‌లో దిగిన రక్సత్ భారత బాక్సర్‌ను నిలువరించింది. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండుసార్లు స్వర్ణాలు నెగ్గిన నిఖత్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకంతో సంతృప్తి పడింది. మరోవైపు భారత్‌కే చెందిన పర్వీన్ హుడా (63 కేజీలు) సెమీఫైనల్ చేరుకొని కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకోవడంతోపాటు పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించింది. క్వార్టర్ ఫైనల్లో పర్వీన్ హుడా 5–0తో తుర్దిబెకోవా సితోరా (ఉజ్బెకిస్తాన్)పై గెలిచింది. అయితే జాస్మిన్ (60 కేజీలు) పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ఉం గ్యోంగ్ వన్ (ఉత్తర కొరియా) సంధించిన పంచ్‌లకు జాస్మిన్ తట్టుకోలేకపోయింది. దాంతో రిఫరీ రెండో రౌండ్‌లో బౌట్‌ను ముగించి ఉం‌గ్యోంగ్‌ను విజేతగా ప్రకటించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	320	65,828
నిఫ్టీ ▲	115	19,638

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	13,219	▲ 18
డోజోన్స్	33,508	▼ 159
ఎఫ్‌టీఎస్ఈ 100	7,608	▲ 6
డాక్స్	15,387	▲ 63
షాంఘై	3,110	▲ 3
నికాయ్	31,862	▲ 11


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.53	84.39
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.34	103.16
€	యూరో	ఎస్‌బీఐ	86.56	89.45
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.67	57.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.01	55.29
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.76	63.69
SAR	సౌదీ రియాల్	[illegible]	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హమ్	[illegible]	21.71	23.51
¥	చైనా యువాన్	[illegible]	10.25	12.33

పెట్టుబడికి సోషల్ రూట్..?

ఇటీవలి స్టాక్ మార్కెట్ రికార్డుల ర్యాలీ కొత్త ఇన్వెస్టర్లను పెద్ద ఎత్తున ఆకర్షిస్తోంది. కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. డీమ్యాట్ ఖాతాల సంఖ్య 2023 జూలై నాటికి 12.3 కోట్లు దాటిపోయింది. 2020 మార్చి నాటికి ఉన్న 4 కోట్లతో పోలిస్తే మూడేళ్లలోనే మూడు రెట్లు పెరిగాయి. అంటే మార్కెట్లోకి కొత్త ఇన్వెస్టర్ల రాక ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. (టేబుల్–గడిచిన 12 నెలల్లో డీమ్యాట్ ఖాతాల తీరు). తమ పెట్టుబడులు అనతి కాలంలోనే భారీ రాబడులు ఇవ్వాలనే ఆకాంక్ష కొత్త ఇన్వెస్టర్లలో సహజంగానే కనిపిస్తుంటుంది. ఫలితంగా మల్టీబ్యాగర్ల కోసం జల్లెడ పడుతుంటారు. గతంలో అయితే స్టాక్స్‌లో పెట్టుబడి కోసం కుటుంబ సభ్యులు, బంధు మిత్రులను విచారించే వారు. సోషల్ మీడియా వ్యాప్తితో నేటితరం ఇన్వెస్టర్ల ప్రపంచం మరింత విస్తృతం అయింది. ఎన్నో యూట్యూబ్, ఫేస్‌బుక్, టెలీగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఖాతాలు తెరుచుకుంటున్నాయి. ఎంతో మంది నిపుణుల అవతారం ఎత్తుతున్నారు. ఫలానా స్టాక్స్ కొనుగోలు చేయాలనే టిప్స్‌కు ఆదరణ ఎక్కువగా కనిపిస్తోంది. అయినప్పటికీ పెట్టుబడులకు సంబంధించి కనీస ప్రాథమిక సూత్రాలను విస్మరించకూడదు. నియంత్రణల పరిధిలో లేని సామాజిక మాధ్యమ వేదికలపై చెప్పే సమాచారానికి, ఇచ్చే సలహాలకు జవాబుదారీ ఏది? ఏది నిజం, ఏది తప్పుదారి? తెలుసుకోవడం ఎలా? ఇది అవగాహనపైనే తెలుస్తుంది. ఈ దిశలో సాయపడేదే సోషల్ ఇన్వెస్టింగ్.



ఆచరణ ముఖ్యం

ఒకరి నుంచి నేర్చుకోవడం, ఆచరణలో పెట్టడం ఈ రెండు వేర్వేరు. సోషల్ ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు ట్రేడింగ్, పెట్టుబడి గురించి తెలుసుకునేందుకు సాయపడతాయి. ''ఇన్వెస్టర్‌కు ఒక ప్రణాళిక ఉండాలి. దానికి కట్టుబడి ఉండాలి. రిటైల్ ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది తాము పెట్టుబడులు పెట్టే మ్యూచువల్ ఫండ్స్ కంటే నేరుగా స్టాక్స్‌లో తక్కువ రాబడులు సంపాదిస్తున్నట్టు ఆ మధ్య నిర్వహించిన ఒక సర్వేలో తెలిసింది. దీనికి ఇన్వెస్టర్లు మార్కెట్లో అనుకూల సమయం కోసం వేచి చూసి, ఇన్వెస్ట్ చేయడం కారణం కావచ్చు. లేదంటే మ్యూచువల్ ఫండ్స్‌ను అనుకూలం కాని సమయంలో విక్రయించి, కొనుగోళ్లు చేస్తుండొచ్చు. ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టిన తర్వాత వార్తలు, ప్రతికూల విశ్లేషణలు చూసి చలించిపోకుండా, ఫండ్స్ మాదిరిగా స్థిరమైన వైఖరి అనుసరించాలి. సోషల్ ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లో తోటి ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియో చూసి పెట్టుబడులు పెట్టినట్టయితే.. మార్కెట్ల పతనాల్లో ఎంత స్థిరంగా, దృఢంగా ఉండగలరన్నది కీలకం అవుతుంది. ఆ సమయంలో భయపడి విక్రయించారంటే రాబడులు గణనీయంగా తగ్గిపోతాయి. నష్టాలూ ఎదురు చూడొచ్చు''అని సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దీపేశ్ రాఘవ్ వివరించారు.

మార్గదర్శిగానే..

ఇన్వెస్టింగ్ వేదికలను మార్గదర్శిగానే చూడాలి. గుడ్డిగా అనుసరించడం సరి కాదు. ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా తగినంత అవగాహన, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకున్న తర్వాత, విడిగా ప్రతీ ఇన్వెస్టర్ తన వైపు నుంచి లోతైన అధ్యయనం చేయాలి. ఆ తర్వాతే తనకు అనుకూలమైన పెట్టుబడుల వ్యూహాలను అనుసరించాలి. ఇతరులు కేవలం తమ అనుభవాన్ని పంచుతారే కానీ, జవాబుదారీగా ఉండరనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. సోషల్ ఇన్వెస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు స్టాక్స్, ట్రేడింగ్ గురించి నేర్చుకునే వేదికలే. ఇన్వెస్టర్లు ఎవరికి వారే తమ వంతుగా పెట్టుబడుల లావాదేవీలు నిర్వహించుకోవాలి. ఎవరో పోర్ట్‌ఫోలియో కాపీ చేసి ఇన్వెస్ట్ చేసిన తర్వాత, నష్టాలు వచ్చాయని పరిహారం డిమాండ్ చేయలేరు.

సోషల్ ఇన్వెస్టింగ్ అంటే..?

ఎన్నో తరాల నుంచి ఇది ఉన్నదే సోషల్ ఇన్వెస్టింగ్ (ఇన్వెస్టర్ల సమూహం/సమాజం). గతంలో స్నేహితులు, కుటుంబ సభ్యుల వరకే ఇది పరిమితం. ఇప్పుడు టెక్నాలజీ ఫలితంగా మరింత పెద్దదిగా అవతరించింది. ట్రేడర్లు, ప్రపంచవ్యాప్త నిపుణులు, ఇన్వెస్టర్లు ఇందులో భాగమవుతున్నారు. సోషల్ ఇన్వెస్టింగ్ యాప్స్, ప్లాట్‌ఫామ్‌లు ఇప్పుడు ప్రత్యేకంగా అందుబాటులోకి వస్తున్నాయి. ఏవి అసలైనవో, ఏవి నకిలీవో గుర్తించేందుకు ఇవి దారి చూపిస్తున్నాయి. సీనియర్ ట్రేడర్లు, తమ మాదిరే ఆకాంక్షలతో కూడిన ఇన్వెస్టర్లతో చాట్, సంప్రదింపులకు ఇవి వేదికలుగా నిలుస్తున్నాయి. ట్రేడింగ్, పెట్టుబడులకు సంబంధించిన విజ్ఞానం పంచుకునేందుకు వారధిగా పనిచేస్తున్నాయి. అనుభవజ్ఞులైన ట్రేడర్ల పోస్టులు, పోర్ట్‌ఫోలియోను వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఎప్పటికప్పుడు తాజా సమాచారానికితోడు, పెట్టుబడుల సలహాలు కూడా వీటిపై అందుకోవచ్చు. యూఎస్, యూరప్‌లో అయితే ఇన్వెస్టర్లు, నిపుణుల ట్రేడ్ పోర్ట్‌ఫోలియోను ఇతరులు కాపీ చేసుకోవచ్చు. అమెరికాకు చెందిన ఈటోరో కూడా ప్రముఖ సోషల్ ఇన్వెస్టింగ్ పోర్టల్. ధ్రువీకరించిన ట్రేడర్ల పోర్ట్‌ఫోలియోలను ఈ వేదికపై పరిశీలించొచ్చు. కానీ, మన దేశంలో ఇంకా ఈ విధమైన అవకాశం అందుబాటులోకి రాలేదు. మన దగ్గర సోషల్ ఇన్వెస్టింగ్ అన్నది ఒక చిన్న ఇన్వెస్టర్ల సమూహంగానే ప్రస్తుతం ఉంది. ''సోషల్ ఇన్వెస్టింగ్ అన్నది విస్తృతమైన పదం. ఒక ఉమ్మడి వేదికగా వ్యక్తుల మధ్య సంప్రదింపులకు వీలు కల్పించేది. స్టాక్ ఫండమెంటల్స్ (ఆర్థిక మూలాలు), కంపెనీ లాభ, నష్టాల నివేదిక విశ్లేషణ, కీలక రేషియోలు, సాంకేతిక సూచికలు, మార్కెట్ ధోరణులపై సంప్రదింపులకు అవకాశం కల్పిస్తుంది. ఇన్వెస్టర్లు తాము అనుసరించే ట్రేడింగ్ విధానాలు, పోర్ట్‌ఫోలియోను వీటిపై ఇతరులతో పంచుకుంటారు''అని స్మాల్‌కేస్ సీఈవో వసంత్ కామత్ తెలిపారు.



నేర్చుకునే మార్గం..

''కరోనా సమయంలో మార్కెట్లు కనిష్ఠ స్థాయిలను చవిచూశాయి. దాంతో అవి ఆకర్షణీయంగా మారాయి. సెబీ కేవైసీ నిబంధనలను సరళతరం చేసింది. దీంతో ఆన్‌లైన్‌లోనే వేగంగా ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాలు ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడింది. దీనికితోడు యువ జనాభా ఎక్కువ మంది ఇంటికి పరిమితం కావడం పెద్ద ఎత్తున డీమ్యాట్ ఖాతాల ప్రారంభానికి దారితీసింది''అని ప్రభుదాస్ లీలాధర్ రిటైల్ బ్రోకింగ్ సీఈవో సందీప్ రాయ్‌చురా తెలిపారు. ముంబైకి చెందిన ఉత్కర్ష్ (32) కూడా కరోనా సమయంలో మార్కెట్లోకి ప్రవేశించిన వారిలో ఒకరు. సహజంగా వ్యాపారవేత్త అయిన ఆయన ఇప్పుడు స్టాక్స్‌లో చురుగ్గా ట్రేడింగ్ చేస్తున్నారు. తొలుత మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతాను ఉపయోగించుకున్నారు. స్టాక్స్‌లో ట్రేడింగ్ చేయాలని 2021 మార్చిలో ఆయన నిర్ణయించుకున్నారు. కానీ ఇందుకు సంబంధించిన సమాచారం ఎలా తెలుసుకోవాలో ఆయనకు తోచలేదు. ఆ సమయంలో మల్టీబ్యాగర్లు అంటూ పెన్నీ స్టాక్స్ గురించి యూట్యూబ్ చానళ్లు, ట్విట్టర్ పోస్టులలో టిప్స్ కనిపించేవి. అయినా సరే వాటి ట్రాప్‌లో ఆయన పడిపోలేదు. గడిచిన రెండేళ్ల కాలంలో ఈ తరహా అనధికారిక, రిజిస్ట్రేషన్ లేని అడ్వైజర్లు, సామాజిక మాధ్యమ వేదికల అణచివేతకు సెబీ కఠిన చర్యలు తీసుకోవడం గమనించొచ్చు. ఉత్కర్ష్ స్వతహాగా కొంత అవగాహన కలిగి ఉండడంతో విశ్వసనీయత లేని ఇలాంటి బూటకపు చానళ్ల బారిన పడకుండా, సోషల్ ఇన్వెస్టింగ్ ఫోరమ్‌లలో చేరాడు. అన్నీ కాదు కానీ, కొన్ని ఉపయోగకరమైనవి అని కొంత కాలానికి ఆయనకు అర్థమైంది.
కొందరు అనుభవం కలిగిన స్టాక్ ట్రేడర్లు స్టాక్స్, ఫండ్స్, పెట్టుబడి సూత్రాల గురించి చెప్పడం తనకు నిజంగా సాయపడినట్టు ఉత్కర్ష్ వెల్లడించారు. వీటి సాయంతో ట్రేడింగ్‌పై అవగాహన మరింత పెరిగింది. ఇప్పటికీ ఈ సామాజిక మాధ్యమ ఫోరమ్‌ల సాయంతో స్టాక్స్ ట్రెండ్స్ గురించి ఆయన తెలుసుకుంటూనే ఉంటారు. సోషల్ ఇన్వెస్టింగ్ అంటే ఇదే.

''మార్కెట్‌లోని సీనియర్, అనుభవజ్ఞులైన ట్రేడర్ల నుంచి కొత్త ఇన్వెస్టర్లు, ట్రేడర్లు నేర్చుకునే వేదికగానే సోషల్ ఇన్వెస్టింగ్‌ను చూడాలి. మరొకరిని కాపీ కొట్టడం కాకుండా.. స్టాక్ పరిశోధన, వార్తలు, ట్రేడింగ్ విధానాలను రూపొందించుకోవడానికి మార్గంగా నిలుస్తుంది''అని స్మాల్‌కేస్ వసంత్ కామత్ వివరించారు. ఒక్క ఉత్కర్ష్ అనే కాదు లక్షలాది మందికి నేడు ఇలాంటి సామాజిక మాధ్యమ వేదికలు ఇన్వెస్టింగ్‌కు మెరుగైన దారి చూపిస్తున్నాయనడంలో సందేహం లేదు. కాకపోతే నిజమైన–మోసపూరిత వేదికల మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలి. సామాజిక మాధ్యమ వేదికలు ఇప్పుడు పోస్టులకు వచ్చే వ్యూస్ ఆధారంగా, ప్రకటనల ఆదాయాన్ని యూజర్లతో పంచుకుంటున్నాయి. దీంతో సీనియర్ ట్రేడర్లు తమ అనుభవాన్ని, ట్రేడింగ్, పెట్టుబడి విధానాలను తోటి యూజర్లతో పంచుకోవడం వల్ల వారికి అదొక ఆదాయ వనరుగానూ మారుతోంది. దీంతో కొత్త ఇన్వెస్టర్లు నేర్చుకునే అవకాశాలు, వేదికలు పెరిగాయి.

గుడ్డిగా అనుసరించడం సరికాదు..



కొత్త ఇన్వెస్టర్లు ఉచిత లేదా చెల్లింపుల వేదికల ద్వారా స్టాక్స్‌లో పెట్టుబడులు, ట్రేడింగ్‌కు మొగ్గు చూపించే ముందు.. ఆయా వేదికలు తమ లక్ష్యాలు, రిస్క్, రాబడుల ఆకాంక్షలకు సరిపోయేవేనా? అన్నది ఒక్కసారి తరిచి చూసుకోవాలి. ''తాము అనుసరించే తోటి ఇన్వెస్టర్ల ప్రొఫైల్‌ను జాగ్రత్తగా గమనించాలి. ఎందుకంటే వారు ఎక్కువ రిస్క్ తీసుకోవచ్చు. వారి పోర్ట్‌ఫోలియో తీవ్ర అస్థిరతలతో కూడుకుని ఉండొచ్చు. ''ప్రతి వ్యక్తి లక్ష్యాలు, అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. మీ స్నేహితులు లేదా ఇతరులు వారి కోణం నుంచి సాధారణ సూచనలు ఇవ్వొచ్చు. అది విడిగా ప్రతి ఇన్వెస్టర్‌కు అనుకూలమైనదని చెప్పలేం. మీ ప్రస్తుత పోర్ట్‌ఫోలియో, భవిష్యత్ నగదు అవసరాలు, రిస్క్ సామర్థ్యం ఇలాంటివి ఏవీ ఎదుటి వారికి తెలియవు''అని సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ పారుల్ మహేశ్వరి పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టే ముందు పోర్ట్‌ఫోలియోను ఒక్కసారి పరిశీలించుకోవాలని సూచించారు. తమకు సరిపోలని ఉత్పత్తులు, సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ట్రేడింగ్‌లో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. ఇన్వెస్టింగ్‌లో రిస్క్ తక్కువ. ఈ రెండింటిలో తమకు ఏది అనుకూలమో ఇన్వెస్టర్లే తేల్చుకోవాలి.

జీఎస్‌టీ వసూళ్లు @ రూ. 1.62 లక్షల కోట్లు

అక్టోబర్‌లో 10 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ వసూళ్లు నాలుగోసారి రూ.1.60 లక్షల కోట్లు దాటాయి. సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో 10 శాతం పెరిగి రూ. 1.47 లక్షల కోట్ల నుంచి రూ. 1.62 లక్షల కోట్లకు చేరాయి. ఆర్థిక శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. గత నెల స్థూల జీఎస్‌టీ ఆదాయం రూ. 1,62,712 కోట్లు. ఇందులో సెంట్రల్ జీఎస్‌టీ రూ. 29,818 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీ రూ. 37,657 కోట్లు, సమీకృత జీఎస్‌టీ రూ. 83,623 కోట్లు, సెస్సు రూ. 11,613 కోట్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో (ఏప్రిల్–సెప్టెంబర్) స్థూల జీఎస్‌టీ వసూళ్లు గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 11 శాతం పెరిగి రూ. 9,92,508 కోట్లకు చేరాయి. సగటున ప్రతి నెలా రూ. 1.65 లక్షల కోట్ల మేర నమోదయ్యాయి. రూ. 1.60 లక్షల కోట్ల వసూళ్లు ఇకపై సర్వసాధారణమైన విషయంగా మారవచ్చని కేపీఎంజీ పరోక్ష పన్నుల విభాగం హెడ్ అభిషేక్ జైన్ తెలిపారు. రాబోయే పండుగ సీజన్‌లో వసూళ్లు మరింత పెరగవచ్చని పేర్కొన్నారు. ఎకానమీ స్థిరంగా వృద్ధి బాటన కొనసాగుతుండటాన్ని ఇది సూచిస్తుందని ఈవై ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ తెలిపారు. జమ్మూ .. కశ్మీర్, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, లడఖ్‌లలో వసూళ్లు స్థిరంగా వృద్ధి చెందుతుండటమనేది ఆయా ప్రాంతాల్లో వినియోగం పెరుగుతోందనడానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

02-10-2023	
విశాఖ	533–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	533–00
విజయవాడ	533–00
రిటైల్ ధర (డజను)	72.00
01-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	505–00
వరంగల్	507–00
రిటైల్ ధర	5.65

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | షేర్‌ఖాన్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,526
టార్గెట్: రూ. 1,900



ఎందుకంటే: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇటీవల హెచ్‌డీఎఫ్‌సీ విలీనం తదుపరి పనితీరుకు సంబంధించిన అంశాలను వెల్లడించింది. సమీప కాలానికి గణాంకాలు ఎలా ఉండబోవచ్చునంటూ కొన్ని ప్రాథమిక వివరాలు వెల్లడించింది. అంచనాలకు మించిన సర్దుబాటు సంబంధ వ్యయాల నిష్పత్తి, తగ్గనున్న నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం), వెనకడుగు వేయనున్న ఆర్‌వోఏపై అంచనాలను తెలియజేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)తోపాటు, వచ్చే ఏడాది(2024–25)లో 1.8 శాతం ఆర్‌వోఏను సాధించవచ్చని అభిప్రాయపడింది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో విలీన సంస్థ అంచనాలకు అనుగుణంగా 3.7–3.8 శాతం ఎన్ఐఎం సాధించింది. అయితే అధిక లిక్విడిటీ బఫర్‌కు తెరతీయవలసిన అవసరాలరీత్యా హెచ్‌డీఎఫ్‌సీ ప్రారంభ ఎన్ఐఎం 2.7 శాతం నుంచి 2 శాతానికి పరిమితమయ్యాయి. దీంతో సమీప కాలానికి విలీన సంస్థ ఎన్ఐఎంపై 0.25 శాతంమేర ప్రతికూల ప్రభావం పడే వీలుంది. కాగా.. రానున్న త్రైమాసికాలలో నికర వడ్డీ మార్జిన్లు క్రమంగా మెరుగుపడనున్నట్లు అంచనా. విలీన సంస్థ ఆదాయ, వ్యయ నిష్పత్తి 40 శాతంగా నమోదయ్యే అవకాశముంది. దీనికితోడు హెచ్‌డీఎఫ్‌సీ నెట్‌వర్త్‌కు సంబంధించి అకౌంటింగ్ మార్పుల కారణంగా ఒకేసారి కోత పెట్టిన సర్దుబాటును చేపట్టారు. వీటిలో అధిక కవరేజీలో భాగంగా పెరిగిన ప్రొవిజన్లు, పన్ను సంబంధ సర్దుబాట్లు, డివిడెండ్ చెల్లింపులున్నాయి. నెట్‌వర్త్ సర్దుబాటు, రెండేళ్ల కాలంలో తగ్గనున్న మార్జిన్లుసహా ఆర్జన అంచనాలు, విలీనం కారణంగా పెరగనున్న వ్యయాల నిష్పత్తి వంటి అంశాలను పరిగణించి షేరువారీ బుక్‌వ్యాల్యూ(బీవీపీఎస్) అంచనాలలో కోత పెట్టాం.

గాంధీ జయంతి సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

శ్రీరామ్ ఫైనాన్స్ | యస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,920
టార్గెట్: రూ. 2,300



ఎందుకంటే: గ్రూప్ సంస్థల విలీనం తదుపరి ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజంగా ఆవిర్భవించిన శ్రీరామ్ ఫైనాన్స్ మల్టీ ప్రొడక్టులతో బిజినెస్‌ను విస్తరించింది. వెరసి వివిధ విభాగాలలో అధిక వృద్ధికి బాటలు వేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి క్వార్టర్(ఏప్రిల్–జూన్)లో నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) 18.6 శాతం పురోగతిని అందుకుంది. త్రైమాసికవారీగా చూసినా 4 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మిగిలిన త్రైమాసికాలలోనూ ఇదేస్థాయి పురోగతిని సాధించే అవకాశముంది. ఇందుకు వినియోగిత(యూజ్‌డ్) వాణిజ్య(ఏయూఎంలో 50 శాతం), ప్యాసింజర్(19 శాతం) వాహన విభాగ విక్రయాలతో ఊపందుకున్న ఫైనాన్సింగ్, యూజ్‌డ్ ప్యాసింజర్ వాహనాల రీప్లేస్‌మెంట్‌కు పెరుగుతున్న పటిష్ట డిమాండ్, వాహన ఫైనాన్సింగ్ బ్రాంచీల నుంచి ఎంఎస్ఎంఈ రుణాలను దశలవారీగా ఎత్తివేయడం, వాహన ఫైనాన్సింగ్ బ్రాంచీల నుంచి బంగారు ఆభరణ రుణాలు(ఏయూఎంలో 3 శాతం), వ్యక్తిగత రుణాలు(ఏయూఎంలో 4 శాతం) పుంజుకోవడం వంటి అంశాలు తోడ్పాటును అందించనున్నాయి. దీర్ఘకాలంలో వృద్ధికి దారిచూపించే పలు అంశాలు కంపెనీకి దన్నునిస్తున్నాయి. అందుబాటులోకి వస్తున్న వినియోగిత బీఎస్–6 ప్రమాణ వాహనాలు, యూజ్‌డ్ వాణిజ్య, ప్యాసింజర్ వాహన కొనుగోళ్లతో పెరుగుతున్న ఫైనాన్సింగ్, విభిన్న విభాగాల మధ్య ఫైనాన్సింగ్ కార్యకలాపాల సమన్వయంతో బలపడుతున్న లాభదాయకత, శ్రీరామ్ గ్రూప్‌యేతర కస్టమర్లను ఆకట్టుకోవడం, గ్రామీణ ప్రాంతాల బ్రాంచీలను పూర్తిస్థాయి సర్వీసులతో పటిష్ట పరచడం వంటి అంశాలు కంపెనీకి లబ్ధిని చేకూర్చనున్నాయి. కంపెనీ యాజమాన్యం రానున్న మూడేళ్లలో ఏయూఎంలో 15 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది.

రికార్డు స్థాయిలో ఆటో అమ్మకాలు

ముంబై: పండుగ సీజన్ డిమాండ్ దృష్ట్యా కంపెనీలు డీలర్లకు భారీగా నిల్వలను పంపిణీ చేయడంతో సెప్టెంబర్ సంబంధించి వాహన పరిశ్రమలో అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. గత నెల ప్యాసింజర్ వాహనాల విభాగంలో 3,63,733 యూనిట్ల హోల్‌సేల్ విక్రయాలు నమోదయ్యాయి. చిప్ సప్లై సరఫరా అంతరాలు తొలగడం కూడా కలిసొచ్చింది. కాగా ఈ ఏడాది ఆగస్టులో నమోదైన 3,60,700 యూనిట్ల సరఫరాయే ఇప్పటి వరకు అత్యుత్తమం. దేశ ప్యాసింజర్ వాహన చరిత్రలో ఇవే మెరుగైన హోల్‌సేల్ అమ్మకాలని మారుతీ సుజుకి ఇండియా మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ అన్నారు.



- ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ సెప్టెంబరు నెల 1,81,343 యూనిట్ల కార్ల అమ్మకాలతో 3 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఒక నెలలో అత్యధిక అమ్మకాలు ఇవే కావడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ ముగిసే నాటికి మొత్తం వాహనాల్లో 10,50,085 యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది.

8 నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

హైదరాబాద్: అమెజాన్ 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2023' అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానుంది. స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, సౌందర్య ఉత్పత్తులు, గ్రోసరీ విభాగాల్లో ఆకర్షణీయ ఆఫర్లు అందించనుంది. శామ్‌సంగ్, వన్‌ప్లస్, ఎల్‌జీ, సోనీ, బోట్, ఇంటెల్, ఫాస్ట్‌ట్రాక్, విప్రో, యురేకా ఫోర్బ్స్, ఏషియన్ పెయింట్స్, జిల్లెట్‌తో పాటు మరెన్నో బ్రాండ్ల ఉత్పత్తులను అందుబాటులో ఉంచనుంది. ప్రైమ్ సభ్యత్వం కలిగిన వారికి 24 గంటల ముందే యాక్సెస్ ఉంటుంది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం తక్షణ రాయితీ అందించనుంది. అమెజాన్ పే లేటర్ ఎంపికతో ఇప్పుడు ఉత్పత్తులు కొని వచ్చే నెలలో బిల్లు చెల్లించే సదుపాయం కల్పిస్తోంది. అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఖాతాదార్లకు 5 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉంది.



చెత్త పనితీరు చూపిస్తే.. వైదొలగాలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నిఫ్టీ ఇండెక్స్ ఫండ్స్‌లో మంచి పథకం ఎంపిక చేసుకోవడం ఎలా? - స్వామినాథన్


ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునే విషయంలో పరిశీలించాల్సిన ముఖ్య అంశాలు రెండున్నాయి. ఒకటి ఎక్స్‌పెన్స్ రేషియో. ప్రస్తుతం ఇండెక్స్ ఫండ్స్ మధ్య చాలా పోటీ ఉంది. 10–15 బేసిస్ పాయింట్ల (0.1–0.15 శాతం) ఎక్స్‌పెన్స్ రేషియోకే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనుక యాక్టివ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకుంటే ఎక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాల్సిన అవసరం ఉండదు. రెండోది ట్రాకింగ్ ఎర్రర్. ఒక ఇండెక్స్ ఫండ్.. తాను పెట్టుబడులను అనుసరించే ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంత మెరుగ్గా పనిచేసిందో చెబుతుంది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణ బృందం సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియోతోపాటు.. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉన్న పథకం మెరుగైనది అవుతుంది. ఈ రెండు అంశాలను ప్రామాణికంగా చేసుకుని చూస్తే ఎస్‌బీఐ, యూటీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సంస్థల పథకాలు మెరుగ్గా పనిచేస్తున్నాయి.

నేను పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ వరుసగా రెండేళ్లపాటు చెత్త పనితీరు చూపించినట్టయితే, నా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం సరైనదేనా? - మునావర్

ఏదైనా ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి వైదొలగేందుకు, ఆ పథకం తక్కువ రాబడులను ఇస్తుండడం అన్నది ముఖ్యమైన అంశం అవుతుంది. తక్కువ పనితీరు అంటే ఇతర పథకాలతో పోలిస్తే తక్కువ రాబడులు ఇవ్వడం. వైదొలిగే నిర్ణయానికి ముందు.. మీరు పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ పథకం విభాగంలోని ఇతర పథకాల పనితీరు కూడా విశ్లేషించాలి. వాటి పనితీరు కూడా తగ్గిందా..? లేక మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం పనితీరు మాత్రమే తగ్గిందా? చూడాలి. మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్ ఎన్‌ఏవీ క్షీణించడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. స్టాక్ మార్కెట్ పడిపోయినా రాబడులు తగ్గుతాయి. అన్ని పథకాలు ఏదో ఒక సమయంలో కొన్ని ప్రతికూలతలను ఎదుర్కొంటూ ఉంటాయి. అది చూసి ఒక పథకం నుంచి మరో పథకంలోకి మారిపోవడం సరైన నిర్ణయం కాబోదు. ఈ ప్రతికూల, తక్కువ పనితీరు అనేది ఒక పథకంలో కనీసం నిరంతరాయంగా రెండేళ్లపాటు కొనసాగాలి. అప్పుడు ఆ పథకంలో పెట్టుబడులను సమీక్షించుకోవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం తక్కువ పనితీరు చూపించడం వెనుక కారణాన్ని గుర్తించాలి. ఫండ్ మేనేజర్‌లో మార్పు జరిగిందా? అందుకే పనితీరు మందగించిందా? అని చూడాలి. అదే నిజమైతే ఆ పథకం నుంచి మీ పెట్టుబడులను తీసుకుని బయటకు రావచ్చు. ఒకవేళ ఫండ్ మేనేజర్‌లో మార్పు లేకపోతే.. రాబడులు మందగించడానికి గల కారణాన్ని సాధారణంగా వారు మీడియాకు వెల్లడించే ప్రయత్నం చేస్తుంటారు. లేదంటే ఆయా ఫండ్ సంస్థ నెలవారీ న్యూస్‌లెటర్‌లోనూ సమాచారాన్ని వెల్లడిస్తుంటారు. పథకం పెట్టుబడుల విధానం వల్ల కూడా తాత్కాలికంగా రాబడులు మెరుగ్గా ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో పథకం పనితీరును తప్పుబట్టడం సరైనది కాకపోవచ్చు. ఉదాహరణకు గ్రోత్ ఆధారిత విధానంతో పోలిస్తే వ్యాల్యూ ఆధారిత పెట్టుబడుల విధానం కాస్త ఆలస్యంగా ఫలితాలను ఇస్తుంది. అటువంటప్పుడు మీరు పెట్టుబడులను దీర్ఘకాలం పాటు కొనసాగించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్క ఇన్వెస్టర్ తాను ఎంపిక చేసుకున్న పథకం అన్ని కాలాల్లోనూ అద్భుత పనితీరు చూపించాలని ఆశిస్తుంటారు. కానీ, ఆచరణలో ఇది సాధ్యం కాదు. అన్ని పథకాలు సానుకూల, ప్రతికూల సందర్భాలను ఎదుర్కొంటూ వెళుతుంటాయి. కనుక పెట్టుబడులను వెనక్కి తీసుకునే ముందు ఈ అంశాలన్నింటినీ చూడాలి.

క్లుప్తంగా...

దసరాకు 5,265 ప్రత్యేక బస్సులు



ఖమ్మం మయూరిసెంటర్: బతుకమ్మ, దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా 5,265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. అక్టోబర్ 13 నుంచి 25 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. వీటిలో 536 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. అక్టోబర్ 22న సద్దుల బతుకమ్మ, 23న మహర్నవమి, 24 దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లాలకు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక బస్సులకు కూడా సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tsrtconline.inలో చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం టీఎస్ ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

ఈనెల రోజులూ 'సైబర్ సవాల్'

సైబర్ నేరాల నియంత్రణపై కేంద్ర హోంశాఖ అవగాహన కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: సైబర్ మోసగాళ్ల బారి నుంచి ప్రజలను కాపాడడంలో అత్యంత కీలకం.. ఆ తరహా మోసాలపై అవగాహన పెంచడమే. ఈ లక్ష్యంతోనే కేంద్ర హోంశాఖ అక్టోబర్ నెలను జాతీయ సైబర్ భద్రత అవగాహన నెలగా ప్రకటించింది. ఈ నెల రోజుల పాటు 'సైబర్ సవాల్' పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను వివరిస్తూ వాటిని ఎలా ఎదుర్కొనవచ్చన్న అంశాలను ప్రశ్న, జవాబులుగా కొన్ని వీడియోల రూపంలో రూపొందించి సైబర్ దోస్త్ ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ ద్వారా ప్రచారం చేయనున్నారు. ఆన్‌లైన్ వినియోగంలో భద్రత, ఆన్‌లైన్ చెల్లింపులు, ఆన్‌లైన్ బ్యాంక్ లావాదేవీల సమయంలో మోసపోకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలన్న అంశాలను ఈ నెలంతా ప్రచారం చేస్తారు.


పండిట్, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వాలి

సాక్షి, హైదరాబాద్: స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేసిన 10,479 భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులకు హైకోర్టు తీర్పు ప్రకారం ప్రస్తుత షెడ్యూల్లోనే పదోన్నతులు కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. అదేవిధంగా అప్‌డేట్ అయిన పోస్టుల్లో ప్రమోషన్ రానివారికి సమాన సంఖ్యలో ఎస్జీటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సర్వీసు నిబంధనలు సవరించకుండా లేదా కొత్త సర్వీసు నిబంధనలు రూపొందించకుండా భాషాపండితులకు న్యాయం జరగదని నాడు టీఎస్‌యూటీఎఫ్ గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 2017లో ఒకసారి, 2019లో మరోసారి అప్‌గ్రేడ్ చేసిన ఫలితంగా ఏర్పడిన న్యాయవివాదం పరిష్కారం కావటానికి ఆరేళ్లు పట్టిందన్నారు.

పవర్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గం



ఖైరతాబాద్ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర పవర్ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడిగా సీఎస్ రమేశ్, ప్రధాన కార్యదర్శిగా టీఎల్ నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వి.ఎం.స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎల్.టి.కుమారస్వామిలను ఎన్నుకున్నారు. 2022 సంవత్సరం పే స్కేల్ రివిజన్‌లో రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ బోర్డు పెన్షనర్స్‌కు 7 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. దీంతో తమకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేసేందుకు ఆదివారం లక్డీకాపూల్‌లోని హోటల్ డీసెంట్‌లో పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పవర్ పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ అయిన 28 వేల ఉద్యోగులను కలుపుకొని ముందుకు సాగుతామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, సీఎండీలకు వినతిపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు.



ఆదుకుంటాయా?

- స్పేస్ బ్రీడింగ్‌తో జీవ భద్రతకు ముప్పేనంటున్న స్వతంత్ర శాస్త్రవేత్తలు
- అంతరిక్షంలోకి పంపి తెచ్చిన వంగడాలతో లబ్ధి: చైనా వెల్లడి
- ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం

(సాక్షి, సాగుబడి డెస్క్)

విత్తన జన్యువ్యవస్థను సంపూర్ణంగా ప్రభావితం చేసే స్పేస్ బ్రీడింగ్... జన్యుమార్పిడి/సవరణకన్నా మెరుగైన ఫలితాలను అందిస్తుందని కొందరు శాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. 15 ఏళ్లుగా స్పేస్ బ్రీడింగ్ ద్వారా కొత్త వంగడాలు రూపొందిస్తూ బహుళ ప్రయోజనాలు పొందుతున్నట్లు చైనా చెబుతోంది. మరోవైపు తొలిసారిగా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ), ఐక్యరాజ్య సమితి చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) సంయుక్తంగా స్పేస్ బ్రీడింగ్ ప్రాజెక్టుకు 2022 నవంబర్ 7న శ్రీకారం చుట్టాయి. 'నాసా'కు చెందిన వాల్లప్స్ ఫ్లైట్ ఫెసిలిటీ రోదసీ నౌక ద్వారా భూమికి 175 మైళ్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తెల్లజొన్న విత్తనాలు, అరాబిడోప్సిస్ అనే ఆకుకూర విత్తనాలను అంతరిక్షంలోకి పంపాయి. కొన్ని విత్తనాలను అంతరిక్ష కేంద్రం లోపల భారరహిత స్థితిలో ఉంచగా మరికొన్నింటిని కేంద్రం బయట కాస్మిక్ రేడియేషన్‌కు గురిచేశాయి. ఆర్నెల్ల తర్వాత వాటిని 2022 ఏప్రిల్‌లో తిరిగి భూమిపైకి తీసుకొచ్చాయి. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఏర్పాటైన ఐఏఈఏ, ఎఫ్ఏఓ ఉమ్మడి ప్రయోగశాలలోని పాలిహౌస్‌లో వాటిని ప్రయోగాత్మకంగా పెంచుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు కేరళకు చెందిన జన్యుశాస్త్ర నిపుణురాలు డా. శోభ శివశంకర్ సారథ్యం వహిస్తుండగా, మరో భారతీయ శాస్త్రవేత్త అనుపమ హింగనె ప్రయోగాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అనేక సీజన్లపాటు సాగు చేసి వాటి జన్యుమార్పులను నిర్ధారించాక సరికొత్త వంగడాలను రైతులకు అందించనున్నాయి.

చైనా పొలాల్లో 260 'అంతరిక్ష వంగడాలు'!

అంతరిక్షంలోని రేడియేషన్‌లో కొన్నాళ్లు ఉంచి భూమిపైకి తెచ్చిన విత్తనాల (స్పేస్ ఇండ్యూస్డ్ మ్యుటేషన్ బ్రీడింగ్ లేదా స్పేస్ బ్రీడింగ్)తో సరికొత్త వంగడాలను రూపొందిస్తూ చైనా కొన్ని దశాబ్దాలుగా ప్రయోజనం పొందుతోంది. చైనా వ్యవసాయ పరిశోధనా సంస్థ (సీఏఏఎస్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, చైనా అణు వ్యవసాయ శాస్త్రాల సంస్థ అధ్యక్షుడు కూడా అయిన డా. లూక్సియాంగ్ లియు చెబుతున్న మాట ఇది. 'ప్లాంట్ బ్రీడింగ్ అండ్ జెనెటిక్స్' న్యూస్‌లెటర్ 2023 జనవరి సంచికలో స్పేస్ బ్రీడింగ్ ప్రయోజనాలను వివరిస్తూ ఆయన ఓ వ్యాసం రాశారు. వరి, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, నువ్వు, క్యాప్సికం, టొమాటో తదితర పంటలకు చెందిన 260 వంగడాలను ఇప్పటివరకు విడుదల చేసినట్లు డా. లియు ఆ వ్యాసంలో వెల్లడించారు. 2011లో విడుదల చేసిన 'లుయుయాన్ 502' గోధుమ వంగడంతో 12% దిగుబడి పెరగడంతోపాటు కరువును, ప్రధాన తెగుళ్లను తట్టుకుంటోందని పేర్కొన్నారు. హెక్టారుకు 12.18 టన్నుల గోధుమ దిగుబడినిస్తున్నదని డా. లియు చెప్పారు. 2016 తర్వాత 21 గోధుమ, 15 వరి, 7 మొక్కజొన్న వంగడాలను అధికారికంగా విడుదల చేశామన్నారు.

స్పేస్ బ్రీడింగ్ అవసరమే!



అంతరిక్షంలో ఉత్పరివర్తనాలు (మ్యుటేషన్లు) ఎక్కువ సంఖ్యలో వస్తాయి. కాస్మిక్ ఎనర్జీ వల్ల విత్తనాల్లోని డీఎన్ఏలో పెనుమార్పులు సంభవిస్తాయి. కొత్త వేరియంట్స్ ఆవిష్కరణకు, విస్తృత జీవ వైవిధ్యానికి ఇది అవసరం. 1960వ దశకంలో ఎక్స్‌రేస్, గామారేస్‌తో మ్యుటేషన్ బ్రీడింగ్‌పై విస్తృత పరిశోధనలు జరిగాయి. వరిలో జగన్నాథ్ రకం అలా వచ్చిందే.

– డా. రాఘవరెడ్డి, మాజీ కులపతి, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

సమస్యల పరిష్కారం భ్రమే!



అంతరిక్షంలోకి పంపిన విత్తనాల్లో వచ్చే పెను మార్పులు మంచివి లేదా చెడువి కావొచ్చు. జన్యుమార్పిడి మాదిరిగానే మ్యుటేషన్ బ్రీడింగ్ వల్ల కూడా జీవ భద్రతకు ముప్పు ఉంటుంది. దీని వల్ల ఉపయోగం 0.0001% మాత్రమే. దీంతో రైతుల సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతుందనుకోవడం భ్రమ. 60 ఏళ్లుగా మ్యుటేషన్ బ్రీడింగ్ అనుభవాలు చెబుతున్నది ఇదే.

– డా. జీవీ రామాంజనేయులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం, కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ

అంగన్‌వాడీలకూ పీఆర్సీ ఫలాలు

- మిగతా డిమాండ్లనూ పరిశీలించి పరిష్కరిస్తాం: మంత్రి హరీశ్‌రావు
- అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ నేతలతో భేటీ
- డిమాండ్లపై నివేదిక సమర్పించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాన్ని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా స్థిరీకరిస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. త్వరలో ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటిస్తామని, ఇందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు పెరుగుతాయన్నారు. ఆదివారం అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు, సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధులు మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్లు, ఇతర సమస్యలను మంత్రి ముందు ఉంచారు. దీనిపై హరీశ్ సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు త్వరలో ప్రభుత్వం ఇవ్వనున్న పీఆర్సీలో అంగన్వాడీలను చేర్చుతామని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జీతాలను కూడా పెంచుతామని భరోసానిచ్చారు. ఇతర డిమాండ్లపై సానుకూలంగా స్పందించి వాటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని, ఈ డిమాండ్లపై నివేదికను సమర్పించాల్సిందిగా మహిళా శిశు సంక్షేమ కార్యదర్శి భారతి హోలికేరినీ ఆయన ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులను కూడా ప్రభుత్వం విడుదల చేసిందని, రెండు రోజుల్లో ఆయా ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి హరీశ్ వెల్లడించారు.

అంగన్‌వాడీల సమ్మె యథాతథం

- మంత్రి హరీశ్‌తో చర్చలు జరిగాయే కానీ స్పష్టత రాలేదు
- ఈనెల 4న చలో హైదరాబాద్ నిర్వహిస్తాం
- సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దు
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్, ముషీరాబాద్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె యథాతథంగా కొనసాగుతుందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రానందువల్లే సమ్మెను కొనసాగిస్తున్నామని, సామాజిక మాధ్యమాల్లో సమ్మె విరమించినట్లు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని పేర్కొంది. ఈ మేరకు జేఏసీ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆయన వేతనాలను ఏమేరకు పెంచుతామనే అంశాన్ని స్పష్టం చేయలేదని పేర్కొంది. వేతనాల అంశాన్ని సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించినప్పుడు అంగన్వాడీలకు కూడా పెంచుతామని హామీ ఇచ్చారని వివరించింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించి టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష ఇస్తామన్న మంత్రి సత్యవతి రాథోడ్ ప్రతిపాదనలు అమలు చేయాలని కోరితే మంత్రి హరీశ్‌రావు పరిశీలిస్తామని చెప్పారని, స్పష్టతనివ్వలేదని జేఏసీ నేతలు తెలిపారు. గ్రాట్యుటీ అంశాన్ని సాధ్యం కాదని మంత్రి తేల్చి చెప్పారని పేర్కొన్నారు. సమ్మె విరమించాలని మంత్రి హరీశ్‌రావు కోరారని, కానీ జేఏసీ మంత్రికి నిర్ణయాన్ని వెల్లడించలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో సమ్మె విరమిస్తున్నట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఈ నెల 4న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి హరీశ్‌తో భేటీ అయిన వారిలో సీఐటీయూ నేతలు పి.జయలక్ష్మి, సునీత, ఏఐటీయూసీ నేతలు ఎస్.కరుణకుమారి, ఎం.సాయిశ్వరి, కె.చందన, జేఏసీ నేతలు భూపాల్, ఓ.ఈశ్వరరావు, ఏఐటీయూసీ కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ఉన్నారు.

మరింత పట్టుదలతో సమ్మె: ఏఐటీయూసీ నేత విజయలక్ష్మి

అంగన్వాడీలు మరింత పట్టుదలతో సమ్మె కొనసాగించాలని ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు బి.వి.విజయలక్ష్మి, ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.డీ.యూసఫ్, ఎస్.బాలరాజులు పిలుపునిచ్చారు. వేతనాల పెంపుపై ప్రభుత్వం నుంచి సరిగ్గా హామీ రాకపోవడం, మిగిలిన డిమాండ్లపైనా స్పష్టత లేకపోవడంతో సమ్మె కొనసాగించాలని నిర్ణయించామని చెప్పారు. సోషల్ మీడియాలో సమ్మె విరమిస్తున్నట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం సాధించిన విజయాలకు అక్షర చిహ్నం

'తెలంగాణ మోడల్' పుస్తకావిష్కరణలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయపరంపరకు అక్షరచిహ్నంగా 'తెలంగాణ మోడల్' పుస్తకం ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం ప్రగతిభవన్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువడిన 'తెలంగాణ మోడల్'' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ దార్శనిక ఆలోచనలతో ప్రవేశపెట్టిన పథకాలు నేడు దేశానికి ఎలా నమూనా అయ్యాయో ఈ పుస్తకంలో గౌరీశంకర్ పొందుపరిచారని చెప్పారు. విజయాలను నమోదు చేయడం అంటే చరిత్రలో తెలంగాణ ప్రభుత్వ కార్యకలాపాలు భద్రపరచడమేనని, ప్రస్తుతం దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉండే ఈ విజయాలు పుస్తకరూపంలో రావడం భవిష్యత్‌తరాలకు పాఠాలుగా నిలుస్తాయన్నారు. 'టుడే ఏ రీడర్–టుమారో ఏ లీడర్' అంటారని గుర్తు చేశారు. శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



తెలంగాణ మోడల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్. చిత్రంలో గౌరీశంకర్, దేశపతి, దిలీప్ తదితరులు

ఎర్రోజు శ్రీనివాస్ 'నడక' పుస్తకావిష్కరణ

తెలంగాణ వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాలన్నీ కలిపి తీసుకొచ్చిన 'నడక' పుస్తకాన్ని మంత్రి కేటీఆర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ వ్యాసాల ద్వారా దశాబ్దాల కాల తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని విశ్లేషించిన తీరును కేటీఆర్ అభినందించారు.

రేపటి నుంచి సిద్దిపేటలో రైలుకూత

సికింద్రాబాద్–సిద్దిపేట మధ్య రోజూ రెండు రైలు సర్వీసులు

సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట–సికింద్రాబాద్ మార్గంలో రెండు ప్యాసింజర్ రైళ్లు మంగళవారం నుంచి రాకపోకలు సాగించనున్నాయి. వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న సిద్దిపేటతో పాటు గజ్వేల్, ప్రముఖ పుణ్యక్షేత్రాలైన నాచగిరి (నాచారం), కొమురవెల్లి తదితర ప్రాంతాల మీదుగా సికింద్రాబాద్ స్టేషన్‌కు రోజుకు రెండు ప్యాసింజర్ రైళ్లు తిరుగుతాయి. తొలుత కాచిగూడ–సిద్దిపేట మధ్య రైళ్లు తిప్పాలని భావించినా, ఆయా ప్రాంతాల నుంచి ఎక్కువ మంది సికింద్రాబాద్‌కు వస్తున్నందున, సికింద్రాబాద్ స్టేషన్ నుంచే రైళ్లు నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది.

సికింద్రాబాద్–సిద్దిపేట (నిడివి 116 కిలోమీటర్లు)

- డెమూ రైలుచార్జీ :రూ.60
- హాల్ట్‌స్టేషన్లు: మల్కాజిగిరి, కెవలరీ బ్యారక్స్, బొల్లారం, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, మనోహరాబాద్, నాచారం, బేగంపేట, గజ్వేల్, కొడకండ్ల, లకుడారం, దుద్దెడ, సిద్దిపేట



కృష్ణా – రాయచూర్ రైలు సర్వీసును ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. పక్కన గవర్నర్ తమిళిసై

ట్రిప్పులు ఇలా...

- సిద్దిపేటలో రైలు(నంబరు:07483) ఉదయం 6.45కు బయలుదేరి సికింద్రాబాద్‌కు 10.15కు చేరుకుంటుంది.
- తిరిగి సికింద్రాబాద్‌లో రైలు (నంబరు:07484) ఉదయం 10.35కు బయలుదేరి సిద్దిపేటకు మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుకుంటుంది.
- తిరిగి సిద్దిపేటలో మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.10 గంటలకు చేరుకుంటుంది.
- సికింద్రాబాద్‌లో సాయంత్రం.5.45 గంటలకు బయలుదేరి సిద్దిపేటకు రాత్రి 8.40 గంటలకు చేరుకుంటుంది.
- అయితే ఉదయం సిద్దిపేట బదులు సికింద్రాబాద్ నుంచే రైలు బయలుదేరేలా చూడాలని స్థానిక నేతలు రైల్వేకు లేఖ రాశారు. దీనికి రైల్వే సమ్మతిస్తే ఈ వేళలు అటూ ఇటుగా మారుతాయి.
- సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి సిద్దిపేటకు ఎక్స్‌ప్రెస్ బస్సుచార్జీ రూ.140. ప్రయాణ సమయం రెండున్నర గంటలు. రైలులో ప్రయాణ సమయం కాస్త ఎక్కువగా ఉన్నా, చార్జీ మాత్రం బస్సుతో పోలిస్తే సగానికంటే తక్కువగా ఉంది. రైలులో సికింద్రాబాద్–సిద్దిపేట మధ్య రాను పోను రూ.120 అవుతుండగా, పాస్ తీసుకుంటే రూ.90 ఉండొచ్చు.

కృష్ణా టు రాయచూర్ రైలు రాకపోకలు షురూ

మహబూబ్‌నగర్–మునీరాబాద్ (కర్ణాటక) మధ్య 234 కి.మీ. నిడివితో నిర్మించే రైల్వే ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కృష్ణా వరకు పనులు పూర్తి కావటంతో కొత్త రైలు సర్వీసు ప్రారంభమైంది. కాచిగూడ–బెంగుళూరు మార్గంలో ఉన్న దేవరకద్ర నుంచి కొత్త లైన్ మొదలు, అటు సికింద్రాబాద్–వాడీ మార్గంలో ఉన్న కర్నాటక సరిహద్దు స్టేషన్ అయిన కృష్ణాకు ఇది అనుసంధానమైంది. దీంతో కాచిగూడ నుంచి కృష్ణా స్టేషన్ మీదుగా కర్ణాటకలోని రాయచూరు వరకు ప్యాసింజర్ డెమూ రైలు సర్వీసును ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహబూబ్‌నగర్‌లో జరిగిన బహిరంగసభలో జెండా ఊపి ప్రారంభించారు. దీంతో కృష్ణా నుంచి కొత్త రైలు బయలుదేరి కాచిగూడకు చేరుకుంది. సోమవారం నుంచి కాచిగూడ–రాయచూరు మధ్య ప్రారంభమవుతుంది.

రైలుచార్జీ: 85.. రోజుకు ఒకటే ట్రిప్పు

కాచిగూడ–రాయచూరు (నిడివి 221 కిలోమీటర్లు) ప్రస్తుతం స్పెషల్ సర్వీసుగా ఉన్నందున ఎక్స్‌ప్రెస్ చార్జీలున్నాయి. రెగ్యులర్ సర్వీసుగా మారిన తర్వాత ఆర్డినరీ చార్జీలు అమలులోకి వస్తాయి. అప్పుడు చార్జీ రూ.50 ఉంటుంది.

హాల్ట్‌స్టేషన్లు: కాచిగూడ, మలక్‌పేట, డబీర్‌పురా, యాకుత్‌పురా, ఉప్పుగూడ, ఫలక్‌నుమా, శివరాంపల్లి, బుద్వేల్, ఉందానగర్, తిమ్మాపూర్, కొత్తూరు, షాద్‌నగర్, బూర్గుల, బాలానగర్, రాజాపురా, గొల్లపల్లి, జడ్చర్ల, దివిటిపల్లి, యెనుగొండ, మహబూబ్‌నగర్, మన్యంకొండ, దేవరకద్ర, మరికల్, జక్లేర్, మక్తల్, మాగనూరు, కృష్ణా, చిక్‌సుగుర్, రాయచూరు

రైలు (నంబరు:07477) వేళలు ఇలా

- కాచిగూడలో ఉదయం 9.40కి బయలు దేరి 11.50గంటలకు మహబూబ్‌నగర్, 12.14కు దేవరకద్ర, మధ్యాహ్నం 2 గంటలకు కృష్ణా, 3 గం.కు రాయచూరు చేరుకుంటుంది.
- తిరిగి రాయచూరులో మధ్యాహ్నం.3.30 గంటలకు రైలు(నంబరు:07478)బయలుదేరి 3.49కి కృష్ణా, 5.29కి దేవరకద్ర, 6.05కు మహబూబ్‌నగర్ రాత్రి 9.10గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది.

రాజకీయ నిరుద్యోగుల అడ్డాగా టీఎస్‌పీఎస్సీ



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కోదండరాం తదితరులు

- కనీస అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వం సభ్యులుగా నియమించింది
- టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన రౌండ్ టేబుల్ సమావేశంలో రేవంత్‌రెడ్డి
- బోర్డును రద్దు చేయాలన్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్
- ఈ నెల 14న సడక్ బంద్‌కు టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరాం పిలుపు

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) రాజకీయ నిరుద్యోగులకు అడ్డాగా మారిందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కనీస అర్హతలు లేని వ్యక్తులను కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం నియమించడంతో కమిషన్ పనితీరు అస్తవ్యస్తమైందని మండిపడ్డారు. ఫలితంగా లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తు అల్లకల్లోలంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ అభ్యర్థుల ఆధ్వర్యంలో జరిగిన టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్‌లతో కలసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరి, కమిషన్ తీరుపై విరుచుకుపడ్డారు.

సీఎం కుటుంబానికి అవి ఏటీఎంలు...

మంత్రి కేటీఆర్‌కు టీఎస్‌పీఎస్సీ, సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు, ఎమ్మెల్సీ కవితకు సింగరేణి సంస్థలు ఏటీఎంలుగా మారాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సీఎం కార్యాలయంలో పనిచేసే వ్యక్తుల బంధువులే టీఎస్‌పీఎస్సీ బోర్డులో అక్రమాలకు పాల్పడ్డారని.. వారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ఆయన డిమాండ్ చేశారు. గ్రూప్–1 పరీక్ష విషయంలో ప్రభుత్వ తీరును హైకోర్టు తప్పుబట్టినా ఇప్పటికీ బోర్డును రద్దు చేయకుండా మొండిగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో 30 లక్షల మంది నిరుద్యోగులతోపాటు వారి తల్లిదండ్రులు కలిపి మొత్తం 90 లక్షల మంది ఓటు ద్వారా కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి రాగానే ఏటా జనవరిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల వ్యవహారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, టీఎస్‌పీఎస్సీ తీరును నిరసిస్తూ ఈనెల 14న సడక్ బంద్ (రహదారుల దిగ్బంధం) చేపట్టాలని పిలుపునిచ్చారు. బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసులో 'సిట్' నివేదిక వివరాలను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. తక్షణమే కొత్త బోర్డు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కోదండరాం పిలుపు మేరకు రహదారుల దిగ్బంధానికి టీపీసీసీ పూర్తి మద్దతు ప్రకటించింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ వినాయక్‌రావు పాల్గొనగా నిరుద్యోగులు శివానంద స్వామి, మహేష్, మిత్రదేవి అధ్యక్షత వహించారు.

చదువు మాని.. చపాతీల తయారీ

చేర్యాల గురుకులంలో విద్యార్థుల వంటావార్పు

చేర్యాల(సిద్దిపేట): వసతి గృహంలో హాయిగా చదువుకోవలసిన విద్యార్థులు వంట పనివారిగా మారి చపాతీలు తయారు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలోని గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం ఉదయం అల్పాహారంలో చపాతీలు అందించాల్సి ఉంటుంది. కానీ వాటి తయారీకి సరిపడా మనుషులు లేకపోవడంతో విద్యార్థులతో చేయించారు. ప్రిన్సిపాల్ సహకారంతోనే కాంట్రాక్టర్ ఇలా పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని గురుకుల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు వద్ద ప్రస్తావించగా.. తమకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి ఉందని స్పష్టం చేశారు. అందువల్లే విద్యార్థులతో వంట పని చేయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



చపాతీల తయారీలో విద్యార్థులు

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.